ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP కపిల్ చిట్స్ Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 289 పేజీలు: 8 వెల: 6.50

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

- ఆయన బోధించారు.. ఆచరించారు • భుజ్ భూకంప సమయంలో సాయి అందించిన సేవలు మరువలేం • మానవ సేవే మాధవ సేవకు దర్పణం సాయి
- సాయి శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీ
- రూ. 100 స్మారక నాణెం, స్టాంపులు విడుదల చేసిన ప్రధాని • పేదలకు 100 గిర్ జాతి గోవులు అందజేత

**పుట్టపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** సేవ పరమో ధర్మః అనేది మన మూల జీవన విధానంలోనే ఉందని... లవ్ ఆల్ సర్వ్ ఆల్ అని భగవాన సత్యసాయి బాబా బోధించారని... బోధించడమే కాకుండా తాను ఆచరించడంతో పాటు ఆయన సంస్థలూ అదే పాటించేలా సత్యసాయి బాబా అందరిలోనూ స్ఫూర్తి నింపారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సత్యసాయి బాబా 100వ జయంత్యుత్సవాలకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు హాజరయ్యారు. వీరితోపాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, కిషన్ రెడ్డి, మంత్రి నారా లోకేష్ సహా పయ్యావుల, సవిత, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ రూ.100 స్మారక నాణేన్ని విడుదల చేశారు. సత్యసాయి స్మారక తపాళా బిళ్లల్ని ప్రధాని, సిఎం ఆవిష్కరించారు. మొదట సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి చేరుకున్న ప్రధాని మోడీకి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహా పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు స్వాగతం పలికారు. ఆ తర్వాత కుశ్వంత్ >>2



బుధవారం పుట్టపర్తిలో సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో ప్రధాని మోడీకి జ్ఞాపికను బహూకరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సచిన్ టెండూల్కర్, రత్నాకర్ తదితరులు

## బంగారూ... అంటూ పిలిచే సాయి -ముఖ్యమంత్రి

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** "బంగారూ' అంటూ ఆయన పిలిచే పిలుపు ఎప్పటికీ గుర్తుంటుంది. బాబాతో నాకు ఎన్నో అనుభవాలు ఉన్నాయని సిఎం చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకూ ఉచితంగా అందించారు. 102 సత్యసాయి విద్యాలయాలు.. 60,000 మందికి ఉత్తమ విద్యను అందిస్తున్నాయి. సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రులు, మొబైల్ ఆస్పత్రుల ద్వారా రోజూ రోగులకు సేవలందుతున్నాయి. రాయలసీమ ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రశాంతి నిలయాన్ని తాకట్టుపెట్టి అయినా ప్రాజెక్టును పూర్తి చేయాలను >>2

## ప్రేమ, శాంతి బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

**పుట్టపర్తి, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** నాస్తికులను సైతం ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించిన సత్యసాయి సమ్మోహన శక్తి ప్రపంచంలో అరుదైనదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్యటనను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి బాబా మనకాలంలో ప్రత్యక్ష దైవ స్వరూపంగా ప్రజలకు ప్రేమ, సేవ, శాంతి, సౌభాగ్యం మార్గాన్ని చూపించిన మహానుభావుడని కొనియాడారు. "అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు (లవ్ ఆల్ సర్వ్ ఆల్), అందరికీ సహాయం అందించు... ఎవ్వరినీ బాధించకు (హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్) అనే బాబా మహావాక్యాలు ఈ ప్రపంచానికి విశ్వశాంతి, సర్వజన సుఖాయ అనే ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఈ పుణ్యభూమి పుట్టపర్తిలో నేడు జరుగుతున్న భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా ప్రకటించడం ఎంతో గౌరవంగా >>2

# అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు

నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అంశాలపై ఫోకస్

మొంథా తుఫాన్ బాధిత రైతులకు త్వరలో రూ.390 కోట్లు ఇస్తాం

రెండో విడత అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు



బుధవారం పెండ్లిమర్రిలో రైతులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**పెండ్లిమర్రి, నవంబరు 19 ప్రభాతవార్త:** వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు... అన్నదాతకు అండగా నిలిచేందుకు.. పంచసూత్ర ప్రణాళికతో వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు ఐటీ నిపుణులకు ఎంత మంచి పేరు ఉందో.. ఎపి రైతులు కూడా ప్రపంచ వ్యాప్తంగా అదే స్థాయిలో గుర్తింపు రావాలని సిఎం చంద్రబాబు చెప్పారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రెండో విడత నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. రెండో విడత చెల్లింపుల్లో భాగంగా రూ.7 వేల చొప్పున 46,85,838 మంది రైతుల ఖాతాలకు రూ.3,135 కోట్లను జమ చేశారు.
రచ్చబండలో పాల్గొని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు విధానాలు అవలంభించాలి. సాగులో టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడితే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. మనది రైతు ప్రభుత్వం. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలి విడతలో రూ.3,175 వేల కోట్ల సొమ్మును ఈ ఏడాది ఆగస్టులో జమ చేశాం. రెండు విడతలు కలిపి మొత్తం రూ.6,310 కోట్లు అన్నదాతకు అందించాం. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాట ప్రకారం నిధులు జమ చేయడం రైతు సంక్షేమంపై ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**పంచ సూత్రాల అమలుతో రైతే రాజు**

"నీరు సమృద్ధిగా ఉన్నచోటే అభివృద్ధి జరిగింది. రాయలసీమ వాసుల కష్టాలు నేను కళ్లారా చూశాను. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేసి ప్రతి ఎకరాకు నీరివ్వాలన్నదే నా సంకల్పం. భూగర్భ జలాలు పెంచాలి. ఒకప్పుడు సీమలో 100 అడుగుల కింద నీరు ఉండేది. ఇప్పుడు 7.3 మీటర్లకే నీరు వస్తోందంటే మన దూరదృష్టి వల్లే సాధ్యమైంది. ఆనాడు నా నియోజకవర్గం కుప్పంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకొచ్చి మైక్రో ఇరిగేషన్‌కు వెళ్లాం. భూగర్భ జలాలు పెరిగితే పర్యావరణం కూడా బాగుంటుంది. రాష్ట్రంలో నీటిభద్రత కల్పించేందుకు నిరంతరం పని చేస్తున్నాం. పట్టిసీమ పూర్తిచేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. సముద్రంలోకి వృథాగా పోయే వరద నీటిని >>2

# మరో భారీ ఎన్‌కౌంటర్

- కీలక నేత టెక్ శంకర్ హతం • మరో ఆరుగురు కూడా మృతి • కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించలేదన్న అధికారులు

**విజయవాడ/పాడేరు, నవంబరు 19,పభాతవార్త ప్రతినిధి:** మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు జరుగుతున్నాయి.మావోయిస్టు కదలికలపై ఎపి పోలీసు తీక్షణ దృష్టిపెట్టింది. కేవలం 24గంటల వ్యవధిలో ఆపార్టీ కీలక నేతల్లో ఒకరైన టెక్‌శంకర్ ఎదురు కాల్పుల్లో హతమయ్యారు.ఈ విషయాన్ని డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేసారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారం నిజం కాదు. మారేడిమిల్లిలో నిన్నజరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుపార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు హతమయ్యారు. బుధవారం ఏవోబీలో కాల్పులు కొనసాగుతున్నాయన్నారు. మారేడిమిల్లిలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని డిజిపి వివరించారు.పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కమ్యూనికేషన్ టీం ఛీఫ్, సౌత్ జోనల్ కమిటీ మెంబర్ సురేష్ అలియాస్ రమేష్, ఏరియా కమిటీ సభ్యులు జాగరగొండ ఏరియా మిలిషియా కమాండర్ లోకేష్ అలియాస్ గణేష్ కూడా హతమయ్యారు. వీరితోపాటు జాగరగొండ డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు శ్రీను అలియాస్ వాసు.. జాగరగొండ డివిజినల్ కమిటీ, ఏరియా కమిటీ సభ్యురాలు అనిత, ఇదే కమిటీలో సభ్యురాలు షమ్మి ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు అధికారులు ధృవీకరించారు. మావోయిస్టు జాడలున్న ఏ ప్రాంతాన్ని వదిలేది లేదని, అన్ని చోట్ల జల్లెడపడుతున్నామన్నారు.విజయవాడ సహా రాష్ట్రంలో నిన్న అదుపులోకి తీసుకున్న వారిలో 50మందిని కోర్టుకు రిమాండ్ నిమిత్తం హాజరు పరుస్తామని తెలిపారు.ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో భద్రతా బలగాలు బుధవారం కూడా భారీ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఈరోజు ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారాన్ని పోలీసులు ఖండించారు. విజయవాడను మావోయిస్తుటు షెల్టర్‌జోన్‌గా చేసుకోవడం,పెద్ద సంఖ్యలో ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తలదాచుకోవడం కలకలం సృష్టించింది. ఎవరి దృష్టి ఉండదని ఆటోనగర్‌లో 27మంది ఒకేభవనంలో ఆయుధాలతో ఉన్నారు. విజయవాడలోని >>2



బుధవారం మావోయిస్టుల నుంచి పట్టుబడిన ఆయుధాలను చూపిస్తున్న ఎడిజి లడ్డా



## ఆస్తుల కేసులో నేడు సిబిఐ కోర్టుకు జగన్

ఆరేళ్ల తర్వాత వ్యక్తిగతంగా కోర్టు ముందుకు

**విజయవాడ, నవంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్థుల కేసులో హైదరాబాద్ లోని సిబిఐ ప్రత్యేక కోర్టుకు గురువారం హాజరు కానున్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని జగన్ కోరగా సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈకేసుల్లో డిశ్చార్జి పిటీషన్‌లపై రోజు వారీ విచారణ జరుగుతున్నందున ఆయన ప్రత్యక్షంగా హాజరుకావాలని సిబిఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక రోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు. గత నెల >>2

**హిడ్మాను పట్టుకుని, చంపలేదు ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా** 2లో

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు

- కుట్రదారులను తేల్చేందుకు బోర్డు కీలక నిర్ణయం
- రవికుమార్ కాల్ డేటాయే ప్రధానం
- కీలక మలుపు తిరిగిన దర్యాప్తు



**తిరుపతి,నవంబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణి చోరీ ఘటనపై మళ్లీ కొత్తగా కేసు నమోదు చేయాలని టిటిడి బోర్డు నిర్ణయించడం సంచలనాలు రేకెత్తించనుందా అనేది హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ కేసులో రానున్న రోజుల్లో ఎవరూ ఊహించలేని విధంగా దర్యాప్తు జరిగితే అసలు దోషులు ఎవరనేది వెలుగుచూస్తుందా? అసలు ఏ కోణంలో ఎవరు లబ్ధిపొందారనేది తేల్చాలనేది టిటిడి బోర్డు ముందున్న కీలక విషయం. ఇప్పటికే ఈ కేసులో ఫిర్యాదిదారుడు, కీలక వ్యక్తి పూర్వ పరకామణి ఏవిఎస్ఓ వైవి సతీశ్‌కుమార్ ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అయితే కీలక ఫిర్యాది మరణించడంతో కేసు మూసివేయకుండా ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులకు క్రిమినల్ కేసుగా ఫిర్యాదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని భావిస్తున్నారు.
ఏకంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు మొక్కుబడుల రూపంలో కానుకలుగా సమర్పించుకున్న నగదునే చోరీచేయడం వెనుక అసలు ఎవరున్నారనేది తేల్చి భక్తుల ముందు, చట్టం ముందు బహిరంగం చేయాలనేది బోర్డు నిర్ణయంగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో జరిగిన 920 అమెరికన్ డాలర్ల చోరీలో అప్పట్లో నమోదైన కేసు పరిధి పరిమితంగానే ఉందనే కోణంలో అదేఉదంతంపై మరోకేసు నమోదుకు టిటిడి బోర్డు నిర్ణయించింది. మరిన్ని చోరీలు, దుర్వినియోగాల దృష్ట్యా క్రిమినల్ కేసు నమోదు దిశగా ఆలోచన చేసి అందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. 2023లో పరకామణి భవనంలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేసి రవికుమార్ అనే వ్యక్తి పట్టుబడటం, అదేరోజు నిఘాభద్రత పర్యవేక్షిస్తున్న ఏవిఎస్ఓ వైవి సతీశ్‌కుమార్ అతనిని పట్టుకోవడం జరిగింది. తదుపరి దానిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సమగ్రంగా విచారణ చేపట్టి నిందితుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సిన కొందరు పోలీస్ అధికారులు, టిటిడి గత బోర్డు పెద్దలు, టిటిడి >>2



## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు

లిక్కర్ కేసులో ప్రభుత్వం సంచలన ఆదేశం

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైఎస్సార్సీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులను జప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేసిన సిఫార్సులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. చెవిరెడ్డి, ఆయన కుమారులు, బంధువుల పేరిట ఉన్న ఆస్తులపై చర్యలు రూ. 54.87 కోట్ల నల్లధనం లావాదేవీలు జరిపినట్టు సిట్ గుర్తించింది. సిట్ సమాచారాన్ని అనుసరించి తిరుపతి, నెల్లూరు, >>2

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల



బుధవారం గండిగుంట-2 రైతు సేవా కేంద్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

**ఉయ్యూరు, నవంబరు 19, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి బస్తా కొనుగోలు చేస్తామని, ఎలాంటి దిగులు అవసరం లేదని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం ఆయన ఉయ్యూరు మండలంలో పర్యటించారు. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, ఎండి ఎస్ డిల్లీరావు, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ తదితరులతో కలిసి మండలంలోని గండిగుంట-2 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ధాన్యం కొనుగోలు సాంకేతిక సిబ్బందితో మాట్లాడి అందుబాటులో ఉన్న గోనె సంచులు, రవాణా వాహనాలు, ఇప్పటివరకుసేకరించిన ధాన్యంవివరాలను మంత్రి తెలుసుకున్నారు. ఈ క్రమంలో >>2

**మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురు దెబ్బ** 2లో



బుధవారం సత్యసాయిబాబా మహాసమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ



ప్రశాంతి నిలయంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌తో ప్రధాని మోడీ



వేడుకలలో డ్రమ్స్ వాయిస్తున్న ప్రముఖ కళాకారుడు శివమణి

# సత్యసాయి సేవలు జాతికి స్ఫూర్తి

>> హాల్లో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించిన శతజయంతి ఉత్సవాల్లో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ... "సత్యసాయి బాబా మన మధ్య భౌతికంగా లేనప్పటికీ ఆయన స్థాపించిన సంస్థలు గ్రామీణ అభివృద్ధి, ప్రజలకు వైద్యం లాంటి సేవల్ని అందిస్తున్నారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలు జరుపుకోవటం మనకు ఓ వరం. బాబా పాటించిన ప్రేమ, సేవ భావన ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేస్తోంది. బాబా జీవితమే వసుధైక కుటుంబం అనే భావనతో ఉండేది. మన భారతీయుల జీవన విధానమే సేవ, భక్తి, జ్ఞానం. కోట్ల మంది బాబా భక్తులు దేశవ్యాప్తంగా మానవ సేవే మాధవ సేవ అని భావించి సేవలు అందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా సత్యసాయి సేవా దళ్ సభ్యులు ప్రజలకు సేవలందిస్తున్నారు. భుజ్ భూకంపం సమయంలో సేవాదళ్ చేసిన సేవలు నాకు బాగా గుర్తున్నాయి. 3 వేల కిలోమీటర్లకు పైగా తాగునీటి పైపుల్ని ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తి తీర్చారు. వైద్యం ఉచితంగా అందిస్తున్న సంస్థలను బాబా నిర్మించారు. సుకన్య సమృద్ధి యోజన కోసం వేల మంది బాలికలకు ఆర్థిక సాయం అందిస్తోంది ట్రస్టు. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 4 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు ఉన్నాయి. రూ.3.25 లక్షల కోట్లకు పైగా నిధులు ఈ ఖాతాల్లో ఉన్నాయి. వారణాసి ఎంపిగా అక్కడ 27 వేల మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజన కింద నిధులు జమ చేయించాను. సోషల్ సెక్యూరిటీ కవరేజ్ కోసం దేశంలో చాలా పథకాలను ప్రారంభించాం. వీటిపై విదేశాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సత్యసాయి ట్రస్టు తరపున వంద గిర్ జాతి గోవులను పేదవారికి నా చేతుల మీదుగా అందించటం సంతోషంగా ఉంది. పేద ప్రజల జీవితాలు ఈ గోవుల ద్వారా పెను మార్పు వస్తుంది. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా వారణాసిలో 480కి పైగా గిర్ జాతి ఆవులను పేదవారికి అందించాం. ఇప్పుడు వెయ్యికి పైగా గిర్ ఆవులు ఆ ప్రాంతంలో తయారు అయ్యాయి. రువాండాలో 200కు పైగా గిర్ ఆవులు ఉన్నాయి. గోవుల దానం లాంటి సంప్రదాయం అక్కడ కూడా ఉంది. గోసంపద ద్వారా పాల ఉత్పత్తి, పోషకాహారం, సోషల్ ఇమ్యూనిటీ లాంటివి పెరుగుతాయి. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం ముందుకు వెళ్తోంది. ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం. వోకల్ ఫర్ లోకల్ అనే మంత్రాన్ని అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను. స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తే ఆత్మనిర్భర్ భారత్ తయారైనట్టే. భగవాన్ సత్యసాయి ప్రేరణతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రతీ వ్యక్తి ఆలోచనలో కరుణ, శాంతి, కర్మ అనే విధానాల ద్వారా ముందుకు వెళ్లాలి" అని ప్రధాన మంత్రి సూచించారు.

# బాట చూపిన సాయి: సిఎం చంద్రబాబు

>> భావిస్తున్నామన్నారు. బాబా నమ్మింది ఒకటే - మానవ సేవే మాధవ సేవ. అదే ఆయన జీవితం, అదే ఆయన సందేశమని పేర్కొన్నారు. ప్రేమే ఏకైక మతం, హృదయమే ఏకైక భాష, మానవత్వమే ఏకైక కులం, విధి ఒకటే చట్టమని, సర్వవ్యాపకమైన దైవం ఒకటేనని బాబా చెప్పిన మాటలు ప్రపంచం నలుమూలలా కోట్లాది మందిని ప్రభావితం చేశాయన్నారు. వందలాది దేశాల నుంచి వచ్చిన భక్తులందరికీ ఆయన దివ్య అనుగ్రహం లభించిందని, పేద నుండి అగ్ర కులాల దాకా, సామాన్యుల నుండి ప్రపంచ నాయకులదాకా అందరి బాధలు వినడం, పరిష్కార మార్గం చూపడం ఆయన ధర్మమైందన్నారు. సత్యసాయి సంస్థల ద్వారా అందుతున్న సేవలు ప్రపంచంలో ఏ సంస్థలతో పోల్చిన ప్రత్యేకమై, విశిష్టమై అద్వితీయంగా ఉంటాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ మహోత్సవానికి స్వయంగా హాజరై ఆశీస్సులు పొందడం, బాబాతో ఆయనకు ఉన్న ఆత్మీయ బంధాన్ని వెల్లడిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటి, పారిశ్రామిక శాఖ మంత్రి నారాలోకేష్, ప్రముఖ బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్, ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డి, , ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర రెవిన్యూ శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఎంపి బికేపార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, సత్యసాయి యూనివర్శిటీ ఛాన్సలర్ చక్రవర్తి, ట్రస్ట్ సభ్యులు నాగనంద, నిమిష్ పాండ్య, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, కేరళ సంగీత విద్వాంసులు హరిహరన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శివమణి, బిజెపి నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు, వేలాది మంది సాయి భక్తులు పాల్గొన్నారు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> ఆటోనగర్, కానూరు లోని కొత్త ఆటోనగర్‌లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇక్కడ కర్మాగారాల్లో ఉత్తరాది నుంచి వేలమంది కార్మికులు వచ్చి పనిచేస్తుంటారు. ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా లేకపోవడం, గస్తీ లోపించడం అరాచక శక్తులకు మరింత ఊతమిస్తోంది. మావోయిస్టుల కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచే ఎస్‌ఐబీ(స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో) కార్యాలయానికి సమీపంలోనే మావోయిస్టులు షెల్టర్ పొందిన భవనం ఉంది. ఈ కార్యాలయానికి 3.5కి.మీ దూరంలోనే మావోయిస్టులు షెల్టర్ తీసుకోవడం చర్చనీయాంశమైంది. ఇదేమార్గంలో మంత్రి పార్థసారథి క్యాంపు కార్యాలయం కూడా ఉంది. సమీపంలోనే భారతీయ జనతా పార్టీ ఎంఎల్‌ఏ సుజనాచౌదరి నివాసం ఉంది. మచిలీపట్నంలోని ఎస్పీ బంగ్లాలో మరమ్మత్తులు జరుగుతుండటంతో ఈ ప్రాంతానికి 500 మీటర్ల దూరంలోని ఒగేటెట్ కమ్యూనిటీలో ఏస్పీ విద్యాసాగర్ నాయుడు తన బంధువుల ఇంట్లో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈ క్రమంలో పకడ్బంది సమాచారంతో లభించడంతో మావోయిస్టు ఆశ్రిత ప్రాంతంపై దాడి జరిగిందంటున్నారు. ఇక డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పిన సమాచారాన్ని అనుసరించి అయిదు జిల్లాల్లోను, విజయవాడ, గుంటూరు నగరాల్లో కీలకం ఎన్టీఆర్, గుంటూరుజిల్లా నదితీర ప్రాంతాల్లో గాలింపు చర్యలు జరుగుతున్నాయి,.ఇక ఇదే క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భవన నిర్మాణ కార్మికులను, ఇతర సంచార కార్మికులను పోలీసులు విచారిస్తున్న సమాచారం

**దేవ్‌జీ, అజాద్ లొంగిపోవాలి: ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా**

ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతంలోని రంపచోడవరం అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. వారిలో దేవ్ జీ, ఆజాద్‌తో సహా పలువురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారన్న ప్రచారం జరిగింది. అయితే చనిపోయిన వారిలో టెక్ శంకర్ ఒక్కరే కీలకమైన నేతల అని ఏపీ ఇంటలిజెన్స్ ఎడిజి లడ్డా ప్రకటించారు. నేటి ఎన్‌కౌంటర్‌లో హతమైన మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆయన సెక్యూరిటీ టీం అంతా పట్టుబడటంతో ఆయనను కూడా పట్టుకున్నారని.. ఎన్ కౌంటర్ చేస్తారని కొంత మంది ఆరపణలుచేశారు. అయితే ఈ ప్రచారాన్ని పోలీసులు ఖండించారు. మొత్తం నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఈ ఎన్కౌంటరులో చనిపోయారు. జోగారావు, జ్యోతితో పాటు సురేశ్, గణేష్, వాసు, అనిత, షమ్మిగా మిగిలిన వారిని గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

షెల్టర్ కోసం చత్తీస్‌ఘడ్ నుంచి ఎపికి వస్తున్న మావోయిస్టులు లొంగిపోవాలని లడ్డా పిలుపునిచ్చారు. కృష్ణ, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులు, వారి సహాయకులు అరెస్టయ్యారు. మాడ్వీ హిడ్మాతో సన్నిహితంగా ముడిపడినవారే ఎక్కువగా అరెస్టయ్యారు. ఈ ఆపరేషన్లు ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా నిర్వహించామని, మావోయిస్టుల నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటిని లడ్డా మీడియాకు ప్రదర్శించారు.

**అరెస్టయిన మావోయిస్టులకు రిమాండ్**

విజయవాడలో పట్టుబడిన మొత్తం 24 మంది మావోయిస్టులకు రిమాండ్ విధించారు. అనంతరం ఈ 24 మంది మావోయిస్టులను రాజమహేంద్రవరం లోని కర్మాగారానికి తరలించాలని అధికారులు ఆదేశాలను జారీ చేశారు. అంతేకాకుండా మరో నలుగురు మావోయిస్టుల వయసు నిర్ధరించాలని కోర్టు ఆదేశించింది.

## సిబిఐ కోర్టుకు జగన్

>> ఆయన కోర్టు అనుమతితో ఐరోపా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన ముగియగానే ప్రత్యక్షంగా హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ ఆయన కోర్టుకు వెళ్ళకుండా, వ్యక్తిగతంగా హాజరు మినహాయింపు కోరారు. సిబిఐ అభ్యంతరం చెప్పడంతో ఇప్పుడు కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అక్రమాస్థుల కేసులో 2013 సెప్టెంబరునుంచి జగన్ బెయిలుపై ఉన్నారు.

## ఆగ్నేయ బంగాళాఖాతంలో 22న అల్పపీడనం

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈనెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశంఉందని, అనంతరం అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా కొమోరిన్ పరిసర ప్రాంతాలపై మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం ఉదయానికి లక్షద్వీప్ దీవులకు సరిహద్దు, మాల్దీవుల ప్రాంతాలకు విస్తరించిందని తెలిపింది.

## హిడ్మాను పట్టుకుని, చంపలేదు
### ఎన్‌కౌంటర్‌లోనే హతమయ్యాడు: లడ్డా

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్త:** చత్తీస్‌ఘడ్ నుంచి ఎపికి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టామని, నవంబరు 17న చేపట్టిన కీలక ఆపరేషన్ చేపట్టామని, నిన్న మారేడుమల్లిలో హిడ్మా మరో ఐదుగురు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారని ఎపి అడిషనల్ డిజి మహేష్ చంద్ర లడ్డా పేర్కొన్నారు. ఎన్టీఆర్ పోలీస్ కమీషరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిడ్మాను పట్టుకుని అనంతరం చంపామనే ప్రచారంలో నిజం లేదన్నారు. మంగళవారం ఎపి లోని నాలుగు ప్రాంతాల్లో అదుపులోకి తీసుకున్న 50 మంది పీజీఎల్‌ఏ సభ్యుల అరెస్ట్ విషయం గురించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచారం మేరకు ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారనే దానిపై దృష్టి పెట్టామని, ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నామన్నారు. ఎక్కడా ఎవ్వరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్‌ను పూర్తి చేశామన్నారు. వీరి నుండి 45 ఆయుధాలు, 272 రౌండ్లు, రెండు మ్యాగ్‌జైన్‌లు, 750 గ్రాముల వైర్, నాలుగు కత్తులు, నగదు రూ.12 లక్షల72వేలు, 84 మెమరీ కార్డులు, రేడియో సెట్‌లు-1, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటితో పాటు రెండు కత్తులు తదితర మారణాయుధాలను కూడ పట్టుకున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇంత మంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. వీరిలో బీజాపూర్ జిల్లాకు చెందినవారు 28 మంది, సుకుమా ప్రాంతానికి సంబంధించి-21, నారాయణపూర్ ప్రాంతానికి సంబంధించి-1, ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ఏరియా కమిటీ సభ్యులు, ప్లాటూన్ టీంలను పట్టుకున్నామని పేర్కొన్నారు.

# ధాన్యం నగదు జమ 24 గంటల్లోనే..

>> గ్రామానికి చెందిన సతీష్ కుమార్ పొలంలో పండించిన ఎంటియు 1262 రకం ధాన్యం తేమ శాతాన్ని మంత్రి సమక్షంలో పరీక్షించగా 15.9 శాతం వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం ఉండాలని, అంతకుమించి తేమశాతం ఉన్న ధాన్యాన్ని రైతుకు సమ్మతమైతే ఒక శాతానికి ఒక కేజీ చొప్పున మినహాయింపు చేస్తున్నట్లు వివరించారు. అక్కడికి చేరుకున్న రైతులతో మంత్రి ముఖాముఖి మాట్లాడి ధాన్యం సేకరణలో వారికున్న సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపడుతూ రైతులకు అండగా ఉన్నామని అన్నారు. రైతు సేవ కేంద్రాల (ఆర్‌ఎస్కే) ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ మద్దతు ధర ఇచ్చి 24 గంటల్లోపే రైతు ఖాతాలకు నగదు జమ చేస్తున్న సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే నేటికి 2 వేల శాతంతో అధికంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వాతావరణ మార్పులకు రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఆర్‌ఎస్కే ల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని మంత్రికోరారు. జిల్లాలో ఎక్కడాకూడా గోనె సంచుల కొరత, రవాణా వాహనాల ఇబ్బందులు లేకుండా గత సంవత్సరపు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.52 కోట్ల గోనె సంచులు ఆర్‌ఎస్కేల ద్వారా రైతుల కల్లాల వద్దకే చేరుస్తున్నామన్నారు. జిల్లాలో ఈ నెలాఖరుకల్లా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరులో 7.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేయనున్నామని తెలిపారు.

జిల్లాలో 99 శాతం ఈ-పంట పూర్తి చేశామని, కౌలు రైతులకు గంటల వ్యవధిలోనే ధాన్యం కొనుగోలు నగదు జమ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వాతావరణ మార్పుల సమయంలో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటను సురక్షితంగా కాపాడుకునేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, వాటిద్వారా నిన్న మంగళవారం వరకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఆర్‌ఎస్కే లలో నాణ్యమైన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగాఉంచినట్లు తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్నా ఆర్‌ఎస్కే లలోని సిబ్బందిని సంప్రదించి సహాయం పొందాలని రైతులకు సూచించారు. వరి కోత యంత్రం మళ్ళీ రాదనే ఆందోళనలో, పరిపక్వానికి రాని వరి పంటను ముందుగానే కోసి నష్టపోవద్దని, అవసరమైనప్పుడు వరి కోత యంత్రాన్ని పంపించి కోత కోయిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# అభివృద్ధికి పంచసూత్రాలు

>> రాయలసీమ వైపు మళ్లించి రిజర్వాయర్లు నింపాం. హంద్రినీవా ద్వారా సీమకు నీరిచ్చాం. రాష్ట్రంలో 95 శాతం జలాశయాలు నిండాయి. చెప్పిన విధంగా నదుల అనుసంధానం చేసి చూపిస్తాం. అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉండబట్టే రైతులకు మేలు జరుగుతోంది." అని సీఎం అన్నారు. "ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ఇందుకు అనుగుణంగా మన సాగు పద్ధతులు మారాలి. ప్రకృతి సేద్యం వైపు రైతులు మళ్లాలి. డిమాండ్ ఉన్న పంటలను పండించాలి. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోంది. ఇంకో 6 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం పరిధిలోకి తీసుకువస్తున్నాం. మొత్తంగా 18 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఒకప్పుడు దేశానికే అన్నం పెట్టిన పంజాబ్ లో ఎరువుల వాడకం విపరీతంగా పెరగడంతో ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం రసాయనిక రహిత పంటలకే విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. టెస్టింగ్, ట్రేసబులిటీ వంటి అంశాలనేవి ఇప్పుడు దేశ, విదేశాల్లో కీలకంగా మారాయి. అందుకే రైతులు క్రిమిసంహారక మందులు, ఎరువుల వాడకం తగ్గించాలి." అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మద్యం కుంభకోణం కేసు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ నవంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పకు ఏసీబీ కోర్టు ఇచ్చిన డీఫాల్ట్ బెయిల్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. వీరి బెయిల్ రద్దుకు సీఐఈడి వేసిన పిటీషన్‌ను కోర్టు అనుమతించింది. ఈ నెల 26 లోపు జడ్జి ఎదుట ముగ్గురూ సరెండర్ కావాలని ఆదేశించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్‌లను ఎసిబి కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించింది. రెగ్యులర్ బెయిలు పిటీషన్లను విచారించాలని ఎసిబి కోర్టును హైకోర్టు ఆదేశించింది.

## బంగారూ... అంటూ పిలిచే సాయి

>> కున్నారు. ఈ విషయం తెలిసి భక్తులు ముందుకు వచ్చి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. రూ.550 కోట్లు ఖర్చు పెట్టి ఎపి, తెలంగాణ, తమిళనాడులో 1600 గ్రామాలు, 30 లక్షలకు పైగా జనాభాకు నీరిచ్చారు. చెన్నై డ్రింకింగ్ వాటర్ మోడర్నైజేషన్ స్కీంకు రూ.250 కోట్లు ఖర్చు పెట్టారు. సత్యసాయి స్ఫూర్తిని, ఆయన చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి. రాష్ట్రప్రభుత్వం భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోంది" అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

## సామాన్య ప్రజలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బులు పంపిణీ

**విజయవాడ,నవంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్య, దిగువ మధ్యతరగతి ఆదాయ వర్గాల కుటుంబాల వారికి ఏపీ ప్రభుత్వం మరో శుభవార్తను అందించనున్నది..విద్యుత్తు ఆదాను చేసే దిశలో ఈ కుటుంబాలకు ఫ్యాన్లు, లైట్లు, బల్బుల పంపిణీ చేయాలని ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం!. రాష్ట్రంలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులందరికీ బీఈఈ స్టార్‌రేటెడ్, ఎనర్జీ ఎఫిషియెంట్ పరికరాలు అందించనుంది. క్లీన్ ఎనర్జీని అందరికీ అందుబాటులోకి తెచ్చే క్రమంలో భాగంగా.. విద్యుత్‌ను ఆదా చేసే చర్యలలో భాగంగా.. ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో ఏపీ హౌసింగ్ డిపార్టుమెంట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు నాలుగు ఎల్ఈడీ బల్బులు, ఆరు ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, రెండు బీఎస్‌డీసీ ఫ్యాన్లు అందించనుంది. 2026 నాటికి ఆరు లక్షల మంది ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం అందించే అదనపు సాయం ద్వారా వీటిని అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా ఏటా సుమారుగా 10.24 మిలియన్ కిలోవాట్ అవర్స్ ఆదా అవుతుందని అధికారుల అంచనా. అలాగే కోట్ల రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు.

# పరకామణి చోరీపై త్వరలో మరో కేసు

>> ఓ అధికారి కలసి నిందితుడ్ని అరెస్ట్ చేయకుండా రాజీధోరణిలో లోక్అదాలత్‌లో అప్పటి ఏవిఎస్ఓ ఇటీవల అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయిన సతీశ్‌కుమార్‌పై ప్రోద్బలం చేసి రాజీచేయించారనేది ప్రధాన ఆరోపణలు. అందుకు ప్రతిఫలంగా రవికుమార్‌నుండి 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను శ్రీవారి కానుకగా రాయించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు కీలకంగా వ్యవహ రించిన గత బోర్డులో పెద్దలు ,టిటిడి ,పోలీస్ అధికారుల పాత్ర ఏంటనేది తేల్చడానికి ప్రస్తుత టిటిడి బోర్డు కీలకంగా నిర్ణయం తీసుకుంది. ఈ కేసు సమగ్ర దర్యాప్తులోభాగంగా హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో 20మంది బృందం మరింత లోతుగా అనేక కోణాల్లో విచారణ చేస్తోంది. పూర్వ ఎవిఎస్ఓ సతీశ్‌కుమార్ ఈ కేసుపై గతంలో హైకోర్టులో కౌంటర్‌దాఖలు చేసి కేసు రాజీలో తనకెలాంటి దురుద్దేశం లేదని, పై అధికారులు చెబితేనే అలా చేయాల్సి వచ్చిందని కూడా పేర్కొన్నారు. దాని వెనుక అంతర్యమేమిటనేది కొందరు పోలీసు అధికారులు తప్పుపడుతున్నారు. టిటిడి పరిధిలోని అంశం గనుక బోర్డు, ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలనేది అప్పట్లోనే గుప్పుమంది. ఇదే పరిణామంలో వారం రోజుల క్రిందట ఆయన అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ కేసులో డిసెంబరు 2వతేదీకి తుది నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలతో తాజాగా మరో కొత్తట్విస్ట్ నెలకొంది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా హుండీకి సమర్పించిన కానుకలు లెక్కించే పరకామణి నుండి ఏకంగా 920 అమెరికన్ డాలర్లు చోరీ చేయడం పెద్ద విషయంగానే బోర్డు భావిస్తోంది. డాలర్ల చోరీకేసు వెనుక కుట్రదారులను తేల్చేలా విచారణ చేయాలని తీర్మానించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న గత టిటిడి ఛైర్మన్, అధికారులు, పోలీసు అధికారులతోబాటు లోక్అదాలత్‌లో పరకామణికేసు రాజీచేసిన న్యాయమూర్తిపై కూడా చర్యలు చేపట్టాలని హైకోర్టు సూచించడం సంచలనంగా మారింది. పరకామణి చోరీ వ్యవహారంలో "పెద్ద"లుగా వ్యవహరించి చేతివాటం చూపిన వారెవరనేది ఇప్పుడు డిసెంబర్ 2వతేదీకి వెలుగుచూడనుంది. అదేగాక చోరీచేసిన గుమస్తా టిటిడి ఉద్యోగికూడా కాకపోవడం మరో కొసమెరుపు. మరోవైపు రవికుమార్ కూడబెట్టిన ఆస్తులు, కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్‌ఖాతాలు, లోక్అదాలత్‌లో రాజీతో ఎవరెవరికి ఎంత మొత్తంలో లాభపొందారనే వివరాలు రాబట్టడంలో ఆయన కాల్‌డేటా ఆధారంగా పోలీసులు విచారణ వేగవంతంగా చేస్తున్నారు. చోరీ జరిగిన రోజు నుండి రాజీచేసుకున్నవరకు నిందితుడుఎవరెవరితో, ఎంతకాలంగా, ఎన్ని రోజులు మాట్లాడారు, ఎవరితో వాట్సాప్ ఛాటింగ్‌లుచేశాడు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయనతో సంభాషించిన వారికాల్‌డేటానుకూడా పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. రవికుమార్ పేరున అతనికుటుంబ సభ్యుల పేరున ఉన్న ఆస్తులు ఎవరిపేరున మారాయనేది తమిళనాడు ప్రభుత్వం నుండి సమాచారం అందితే ఈ మొత్తం కేసులో చిక్కుముడివీడిపోనుందనేది సమాచారం. ఇప్పుడు కొత్తగా తిరుమల పోలీసులు కేసు నమోదుచేస్తే అసలు దోషులుఎవరనే కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనేది హాట్‌టాఫిక్‌గా మారింది. మరోవైపు రవికుమార్ కూడా తన ఆస్తులపై దర్యాప్తు విచారణ ఆపాలని హైకోర్టును ఆశ్రయించారు.

## వారం - వర్జ్యం

20-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
● అమావాస్య మ.12.16
విశాఖ ఉ.10.58, అనూరాధ కార్తె
వర్జ్యం : మ.3.28-5.15
దు.ఉ.10.01-10.46, మ.2.33-3.18
రాహుకాలం - మ.1.30-3.00

## వారఫలం

**మేషం:** శ్రేయోభిలాషుల ఒత్తిడికి తలవంచి ఇష్టం లేకపోయినా ఓ సందర్భంలో రాయభారం నిర్వహిస్తారు. దూరప్రాంతాల నుండిశుభవార్తలు.

**వృషభం:** మధ్యవర్తిత్వాలకు వివాదాస్పద అంశాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. వివాహం ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**మిథునం:** ఉద్యోగస్తులు సహోద్యోగుల సహాయ సహకారాలు అందుకుంటారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**కర్కాటకం:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది. మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు.

**సింహం:** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**కన్య :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు అందిపుచ్చు కోవడంలో నైపుణ్యం చూపండి. సంతానం నాకు సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**తుల :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కలిగిన దానితో తృప్తి పడతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

**వృశ్చికం:** ఆర్థిక ప్రణాళికలు నూతనమైన మలుపులు తిరుగుతాయి. కాంట్రాక్టులు అతికష్టం మీద దక్కించుకొంటారు.

**ధనుస్సు:** కొత్త పెట్టుబడులు అనుకూలమైన ఫలితాలను ఇస్తాయి. షేర్లు, భూముల క్రయ విక్రయా లలో లాభాలు పొందుతారు.

**మకరం:** కొద్దికాలం పరిచయమున్న మిత్రులు మీకు అండదండగా నిలుస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కుంభం:** సరికొత్త ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టడంలో మాత్రం కొంత వెనుకబడతారు. దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మీనం:** దరఖాస్తు పారములు పంపునప్పుడు వాటిని బాగా పరిశీలించి పంపండి. భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## చెవిరెడ్డి కుటుంబ ఆస్తుల జప్తు

>> చిత్తూరు జిల్లాల్లోని ఆస్తులు ఉన్నాయి. వీటిని జప్తు చేయాలని సిట్ విజ్ఞప్తి మేరకు హోం శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి, కెవిఎస్ ఇన్‌ఫ్రా ఎండీ చెవిరెడ్డి లక్ష్మి పేరిట ఉన్న చర, స్థిరాస్తులన్నింటినీ జప్తు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భూములు, ఇతర ఆస్తులు ఈ జాబితాలో ఉన్నాయి. మద్యం కుంభకోణం ద్వారా చెవిరెడ్డి కుటుంబం అక్రమ మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టిందని సిట్ తన విచారణలో గుర్తించింది. సుమారు రూ. 54.87 కోట్ల నల్లధనాన్ని అధికార అండతో భూ లావాదేవీల ద్వారా మళ్లించినట్టు సిట్ నిర్ధారించింది. ఈ మేరకు సిట్ చేసిన విజ్ఞప్తి ఆధారంగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ అవినీతి నిరోధక చట్టం కింద ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు చేపట్టాలని డిజిపిని ప్రభుత్వం ఆదేశించింది.



గోవులకు మేత అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ



బాలికలకు సంవృద్ధి యోజన పథకం కింద సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

# పుట్టపర్తిలో ప్రధాని పర్యటన గ్రాండ్ సక్సెస్

## - ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు - సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సేవలను పొగడ్తలతో ముంచెత్తిన అగ్రనేతలు - ట్రస్టు ద్వారా 100 ఆవులను రైతులకు బహూకరణ - సుకన్య సంవృద్ధి యోజన కింద పేద బాలికలను ట్రస్ట్ ద్వారా ఎంపిక

**అనంతపురం, నవంబర్ 19 ప్రభాతవార్త బ్యూరో** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన దేశ ప్రధాని నరేంద్రమోదీ పర్యటన గ్రాండ్ సక్సెస్ అయింది. కట్టుదిట్టమైన పోలీసు భద్రత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు కృషి వల్ల ప్రధాని సభ సజావుగా సాగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేయడంతో ప్రధాని నరేంద్రమోదీ సభ సక్సెస్ అయిందని చెప్పవచ్చు. శ్రీ సత్యసాయి శత జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంతో గత కొన్నిరోజులుగా రాష్ట్ర స్థాయి అధికారులు కూడా పుట్టపర్తిలోనే మకాం వేసి శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు సెంట్రల్ ట్రస్ట్‌తో కలిసి చర్యలు తీసుకోవడంతో ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటన సక్సెస్ అయిందని చెప్పవచ్చు. ఒకరోజు ముందుగా మంగళవారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్, అతిథులు, భారత రత్న అవార్డు గ్రహీత సచిన్‌టెండుల్కర్, సినీ నటి ఐశ్వర్యారాయ్‌బచ్చన్‌తో కాకుండా కేంద్ర మంత్రులు, ఇతర మంత్రులు వచ్చారు. మంగళ, బుధవారం పెద్ద ఎత్తున వివిఐపిలు రావడంతో పుట్టపర్తి కళకళలాడింది. పుట్టపర్తి అంతా విద్యుత్ దీపాలు అలంకరించడం, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ట్రస్ట్ నిర్వాహకులు ఆనందానికి గురయ్యారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం పుట్టపర్తికి చేరుకుని శ్రీ సత్యసాయి మహాసమాధిని సందర్శించడంతోపాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా 100 ఆవులను బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రైతులకు బహూకరించారు. అందులో ప్రధాన మంత్రి చేతులు మీదుగా రైతులకు అందజేశారు. పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో జరిగిన సభలో సత్యసాయి బాబాసేవలకు గుర్తింపుగా 100 రూపాయల నాణేన్ని, పోస్టల్ స్టాంప్‌లను కేంద్ర ప్రభుత్వం తరుపున ప్రధాని నరేంద్రమోదీ చేతులు మీదుగా ఆవిష్కరింపజేశారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలికలకు ఆర్థిక సాయం అందే విధంగా 20వేల మందికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆర్థిక సాయం అందించే పథకానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా ముగ్గురు బాలికలను వేదికపైకి ఆహ్వానించి ప్రధాని చేతులు మీదుగా పథకాన్ని వారికి అందజేశారు. సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తూ..సుకన్య సంవృద్ధి యోజన పథకం సంబంధించిన గోవులను సహాయంగా అందించే విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్నేళ్ల కిందట వారణాసిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా 480పైగా గిరి ఆవులను పంపిణీ చేశామని, ఇప్పుడు గిర్‌ఆవులు, లేగ దూడల సంఖ్య దాదాపు 1700లకు పెరిగిందని ప్రధాని గుర్తు చేశారు. ఏడెనిమిది ఏళ్ల క్రింద ఆఫ్రియాలోని రుమాండలోని తన పర్యటన సందర్భంగా 200 గిరి ఆవులను ఆ దేశానికి భారత్ బహుమతిగా అందించిందని ప్రధాని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలో భాగంగా పుట్టపర్తిలోని స్టేడియంలో జరిగిన సభలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం సాయి భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం 12:19 గంటలకు ప్రారంభించి 12:39గంటల వరకు ప్రసంగించారు. దాదాపు 20 నిమిషాల వరకు ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించినా, ఎలాంటి నోట్స్, పేపర్ చూడకుండానే అనర్గలంగా హిందీలో మాట్లాడటం విశేషం. ప్రధాని తన ప్రసంగంలో సత్యసాయి బాబా బోధనలను, సేవలను, ఫిలాసఫీని, అభినందిస్తూనే ప్రస్తుతం సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ తన ప్రసంగంలో సత్యసాయిబాబా సేవలను కొనియాడారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ ఒక్కొక్కరు 8 నిమిషాల చొప్పున ప్రసంగించగా, సీఎం ప్రసంగించారు.

## బాబా మార్గాన్ని భావితరాలకు అందించడమే ట్రస్ట్ లక్ష్యం

### - శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్

**పుట్టపర్తి, నవంబర్ 19, ప్రభాతవార్త** భక్తులతో భగవాన్ సత్యసాయి మాట్లాడుతూ, దీవెనలు అందించడానికి వస్తుంటానని చెప్పేవారని, ఆ వాగ్దానం నేడు ప్రధాన మంత్రి నరేంద్రమోడి పునీత దర్శనంతో నిజమైందని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. బుధవారం భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడి విచ్చేసిన సందర్భంగా హిల్‌వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆర్.జె.రత్నాకర్ మాట్లాడుతూ, సాయి భక్తులు, సేవాదళ్ సభ్యులకు, ప్రపంచం నలుమూల నుండి విచ్చేసిన వేలాది మంది భక్తులకు ప్రేమపూర్వక అభినందనలు తెలియజేశారు. పుట్టపర్తి భగవాన్ సత్యసాయి బాబా జన్మభూమి మాత్రమే కాదు, ఆయన కర్మభూమి కూడా అన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, సేవ అనే మానవతా విలువలను ఇక్కడి నుంచే ప్రసారం చేశారన్నారు.సత్యసాయి విద్యాసంస్థల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవ చేస్తున్నారని గర్వంగా తెలిపారు. ఆ విద్యార్థుల్లో చాలామంది ఈ శతజయంతి కార్యక్రమాలకు ప్రత్యేకంగా విచ్చేసి సేవలో పాల్గొనడం బాబా బోధనల మహాత్యం అన్నారు. సత్యసాయి ప్రసంగాలను ఊటంకిస్తూ, "మా అమ్మ చదవలేదు.. నన్ను కూడా చదవించలేదు. కానీ ఆమె ఇచ్చిన విలువలు, దీవెనలు నన్ను నడిపిస్తున్నాయ్యి అని బాబా చెప్పేవారిని గుర్తు చేసుకున్నారు. దేశంలోని తల్లులు తమ పిల్లలకు జ్ఞానం, విలువలు అందించాలని బాబా ఎల్లప్పుడూ ఉద్బోధించేవారన్నారు.

## సత్యసాయిబాబా జన్మించి నూరేళ్లు అయినా ఆయన దివ్య స్ఫూర్తి ఇప్పటికీ నిలిచి ఉంది

### ప్రముఖ సినీనటి ఐశ్వర్య రాయ్ బచ్చన్




**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లోని హిల్ వ్యూ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ తన హృదయపూర్వక భావాలను పంచుకున్నారు. బాబా పట్ల ఆమెకున్న భక్తి, ఆయన బోధనల పట్ల గౌరవం, సేవా మార్గం పట్ల ఉన్న ఆమె నిబద్ధత ఈ సందేశంలో స్పష్టంగా ప్రతిఫలించాయి.భగవాన్ సత్యసాయి బాబా జన్మించి నేటికి వందేళ్లు పూర్తయింది. కానీ ఆయన ప్రభావం, ఆయన దివ్య స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిలియన్ల హృదయాల్లో ఇంకా నిలిచే ఉంది. ఆయన ప్రేమకు, సేవకు, దయకు సరిహద్దుల్లేవు." సేవను నిజమైన నాయకత్వంగా చెప్పిన బాబా బోధనలను గుర్తుచేసుకుంటూ చెప్పారు. మానవ సేవే మాధవ సేవ అని బాబా నమ్మేవారు... చేసి చూపించారు. ఆయన చేసిన ప్రజాసేవ, ప్రేమ, దయ, పరిపూర్ణత – ఇవన్నీ ప్రపంచానికి ఒక ఆదర్శం."భగవాన్ బోధించిన 5 డ్డీల (ఇంగ్లీషు భాషలో)గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. డిసిప్లిన్ ( క్రమశిక్షణ), డెడికేషన్ (అంకితభావం), డివోషనల్ (భక్తి), డిటర్మే షన్(దృఢ సంకల్పం), డిస్క్రిమినేషన్ (సత్యాసత్య వివేకం), ఈ అయిదు డి లు మన జీవితానికి దిశగా, ధర్మంగా నిలుస్తాయి.

## వైసిపి ఎంపి మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ 21కి వాయిదా

### - కౌంటరు దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశం

**విజయవాడ,నవంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు హాజరయ్యేందుకు తనకు అనుమతి ఇవ్వాలంటూ ఏపీ మద్యం కుంభకోణం వ్యవహారంలో అరెస్టయిన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలంటూ సిట్‌ను ఏసీబీ కోర్టు ఆదేశించింది. ఎంపీ మిథున్ రెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణ నవంబర్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం స్కాంలో ఏ4గా ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు. ఆయన్ని ఈ ఏడాది జులై 19వ తేదీన సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అంతకుముందు ఆయన్ని దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఆయన్ని అరెస్ట్ చేసి.. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. నాటి నుంచి ఆయన జైలులోనే ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంతో తన ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అనుమతి ఇవ్వాలంటూ కోర్టులో మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అందుకు షరతులతో కూడిన బెయిల్‌ను ఆయనకు ఏసీబీ కోర్టు మంజూరు చేసింది. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఇక న్యూయార్క్ వెళ్తున్న ఎంపీల ప్రతినిధి బృందంలో ఎంపీ మిథున్ రెడ్డికి కేంద్రం చోటు కల్పించింది. ఈ పర్యటనకు వెళ్లేందుకు అనుమితి ఇవ్వాలంటూ మరోసారి ఏసీబీ కోర్టును ఆయన ఆశ్రయించారు. షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. అక్టోబర్ 23 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు ఆయన న్యూయార్క్‌లో పర్యటించారు.

## ప్రముఖుల రాకతో జనసంద్రంగా మారిన పుట్టపర్తి రహదారులు

**పుట్టపర్తి రూరల్ నవంబర్ 19 ప్రభాతవార్త:** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో శ్రీ సత్య సాయి శతవర్ష జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఉదయం 9: 50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు కేంద్ర,రాష్ట్ర మంత్రులు కిషన్ రెడ్డి, కింజరపు రామ్మోహన్ నాయుడు, సత్య కుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్ , అనగాని సత్యప్రసాద్ , సవితమ్మ, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి స్వాగతం పలికారు. తొలిత ప్రధానమంత్రి సీఎం డిప్యూటీ సీఎంలతో కలిసి శ్రీ సత్య సాయి మహాసమాధిని దర్శించుకుని, కుల్వంత్ మందిరంలోని సత్యసాయి కాంచ విగ్రహం వద్ద ధ్యానముద్రలో కూర్చుని బాబా ఆశీస్సులు పొందారు. అనంతరం పండితులు ప్రధానిని వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. సత్య సాయి ట్రస్టు ద్వారా నిరుపేద రైతులకు అందిస్తున్న గోదాన లబ్ధిదారులకు గోవులను దానం చేశారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సత్యసాయి ముద్రణ కలిగిన 100 రూపాయల నాణ్యాన్ని, స్టాంపును, మరియు సత్యసాయి ట్రస్టు ద్వారా బాలికలకు అందిస్తున్న సమృద్ధి పథకాన్ని పిల్లలకు అందించి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ట్రస్ట్ జిల్లాలోని 20వేల మంది ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్పించనుంది. ఈ కార్యక్రమంలో క్రికెటర్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ పాల్గొన్నారు. ప్రముఖ మ్యూజిక్ డ్రం ప్లేయర్ శివమణి ప్రత్యేక వాయిద్య ప్రదర్శనను , ప్రఖ్యాత గాయని సుధా రఘునాథన్ గీతాలను ఆలపించారు. వీరితోపాటు సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, జాతీయ అధ్యక్షుడు నిమిష్పాండే పాల్గొన్నారు.



ప్రధాని మోడీకి ఆశీర్వచనం చేస్తున్న పండితులు

## నా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితంచేసిన సాయి బాబా మన వెంట ఉంటే భయం ఉండదు : సచిన్ టెండూల్కర్

**అనంతపురం, నవంబర్ 19, (ప్రభాతవార్త బ్యూరో)** భగవాన్ సత్యసాయి బాబా మన వెంట ఉంటే భయం అనేది ఉండదని, నా శారీరక, మానసిక ఆరోగ్యం పై సత్యసాయి బాబా బోధనలు ఎంతో ప్రభావితం చేశాయని భారతరత్న అవార్డు గ్రహీత, మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అభిప్రాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి లో బుధవారం జరిగినభగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవంలో ఆయన పాల్గొని బాబా పట్ల తనకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని, దివ్యానుభూతులను ఎంతో హృదయపూర్వకంగా పంచుకున్నారు. సభలో వేదికపై ప్రధాని నరేంద్ర మోది, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తదితర ఎందరో ముఖ్యుల సమక్షంలో భక్తులను, విద్యార్థులను ఉద్దేశిస్తూ సచిన్ టెండుల్కర్ తన సందేశాన్ని ఈ విధంగా కొనసాగించారు... సత్యసాయి బాబాకు నా ప్రణామాలు. ఆయన నాకు చిన్నతనం నుంచే ఒక దైవసంబంధం లాంటి అనుభూతిని ఇచ్చార"ని తన బాల్యాన్ని గుర్తుచేసుకుంటూ చెప్పారు. "నాకు ఐదేళ్ల వయసులో ఉండగా ఎక్కడికైనా వెళ్లినా ఈ బాలుడు బాల సత్యసాయి బాబాలా ఉన్నాడు అని అందరూ చెప్పేవారు. ఆ మాటలు అప్పట్లో వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా, తరువాత బాబాతో ఏర్పడిన అనుబంధం ఆ మాటలకు అర్థం చూపింది." 1990లలో వైట్‌ఫీల్డ్‌లో భగవాన్ సత్యసాయి బాబా దర్శనం పొందిన సందర్భాన్ని సచిన్ ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటూ "మనం అడగకపోయినా మన మనసులో ఏముందో, ఏ సందేహం వుందో బాబా ముందుగానే చెప్పేవారు. ఇది నమ్మశక్యం కాకపోయినా.. నేను అనుభవించిన సత్యం." శారీరక, మానసిక ఆరోగ్యంపై బాబా ఇచ్చిన బోధనలు తన జీవితాన్ని ప్రభావితం చేశాయని ఆయన తెలిపారు.

## టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

### పెందుర్తిలోని రైల్వే పనుల్లోని ఒరిగిన విద్యుత్ స్తంభం, రైలు ఆపడంతో తప్పిన ప్రమాదం

**విశాఖపట్నం, నవంబర్ 19 ప్రభాతవార్త** పెందుర్తి వద్ద టాటానగర్ ఎక్స్ ప్రెస్ కు పెను ప్రమాదం తప్పింది. రైల్వే గ్యాంగ్ రైలు రోడ్డు పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లతో కలిగిన విద్యుత్ స్తంభ పక్కకి ఒరిగిపోయింది. అదే రోడ్లో టాటానగర్ ఎక్స్ ప్రెస్ పెందుర్తి దాటుతుంది అయితే టాటా నగర్ ఎక్స్రెస్ లోకో పైలట్ ఈ ప్రమాదాన్ని ముందుగా గమనించి రైలును ఆపేశారు. దీంతో రైలు బండిలో ఉన్న ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారు. దీన్ని గమనించిన రైల్వే అధికారులు హుటా కొట్టిన ఆ విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# తిరుమల సమాచారం

## కార్తికమాసంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం



**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌రోడ్డుని నడకమార్గంలో లక్ష్మీనరసింహస్వామికి బుధవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఏడాది స్వాతితిరునక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేపడతారు. ఆలయంలో మూలమూర్తికి ఉదయం పాలు, పెరుగు, తేనె,చందనం ,పసుపుతో విశేషంగా అభిషేకిరంచారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పోటు పేష్కార్ మునిరత్నం, అర్చకులు పాల్గొన్నారు.

## వెంకన్నసేవలో విద్యాదీశతీర్థస్వామి



**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** కార్తీకమాసం స్వాతితిరునక్షత్రం సందర్భంగా బుధవారం ఉదయం వ్యాసరాజమఠం మఠాధిపతి విద్యా దీశతీర్థస్వామి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వచ్చిన స్వామికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ సాంప్రదయంగా స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న స్వామి తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీఅన్నప్రసాదంకు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,నవంబర్ 19ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదాల ట్రస్ట్‌కు దాతలు విరివిగా విరాళాలిస్తున్నారు. బుధవారం ఉదయం తమిళనాడు వేలూరుకు చెందిన డార్లింగ్ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్ సంస్థ డైరెక్టర్ మురళీ వెంకటసుబ్బు ఎస్వీ అన్నప్రసాదంకు 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు.

## ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి



**తిరుచానూరు, నవంబర్ 19, ప్రభాతవార్త** తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో మూడవ రోజు ముత్యపు పందిరిపై శ్రీ మహాలక్ష్మి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్ర నామార్చన నిత్యర్చన నిర్వహించారు. తర్వాత ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపుచేసి స్వర్ణ పుష్ప మణి మాణిక్యాలతో సర్వాంగ సుందరంగా ధనలక్ష్మి అలంకారంలో ముత్యపు పందిరిపై కొలువు తీర్చారు. తిరుమాడ వీధులలో గజరాజులు నడుస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ ముత్యపు పందిరిలో శ్రీ మహాలక్ష్మి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కర్పూర నీరాజనాలతో అమ్మవారి కృప కటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో వాహన సేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, యుఒ అనిల్ కుమార్ సింగల్, జేఈఓ వీరబ్రహ్మం సివిఎస్వో కే.వి.మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ డెప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్, ఏవీఎస్ఓ రాధాకృష్ణ మూర్తి, ఆర్జిత ఇన్స్పెక్టర్ చలపతి ఉన్నారు.


IDBI BANK

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

రాజమండ్రి బ్రాంచ్, డోర్ నెం.46-22-11, కర్రి సూరి రెడ్డి ప్లాజా, దానవాయిపేట, పార్క్ రోడ్డు, రాజమండ్రి - 533103.

(రూలు 8(1)) స్వాధీనత ప్రకటన APPENDIX -IV (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) ప్రకారము **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **దిగువ తెలిపిన ఋణగ్రహీతలు** వారి బకాయి మొత్తం నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా దిగువ తెలిపిన తేదీలలో **డిమాండ్ నోటీసు** జారీ/ప్రచురణ చేయబడినది. ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన రూలు 8 ప్రకారము దిగువ టేబుల్‌లో పేర్కొన్న ఆస్తులను **స్వాధీనత** తీసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. చట్టం యొక్క రూల్సు 2002 నందలి సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

ఈ ఆస్తుల విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా దిగువ తెలిపిన చెల్లించవలసిన బకాయి మొత్తం మరియు వడ్డీ, ఇతర ఖర్చులు **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

| వ. నెం. | ఋణగ్రహీత/హామీదారు | బ్యాంకుకు తనఖా ఉంచిన స్థిరాస్తుల వివరములు | డిమాండ్ నోటీసు, స్వాధీనత నోటీసు మరియు ఇతర వివరములు |
|---|---|---|---|
| 1. | **శ్రీమతి చల్లా విజయలక్ష్మి(ఋణగ్రహీత), శాశ్వత చిరునామా:** డి.నెం.27-2-11, వెంకటేశ్వర మఠం వీధి, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. **శ్రీ చల్లా శ్రీనివాస్ (సహ-ఋణగ్రహీత), కమ్యూనికేషన్ చిరునామా:** డి.నెం.46-6-53, జాంపేట శివాలయం, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. | తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, తొర్రేడు వద్ద వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.343/1బిలోని PMAY(U) మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.టీ-3 యావత్తు ఆస్తి (కామన్ ఏరియాలలోని దామాషావాటాతో కలిపి 365 చ॥అ॥ల విస్తీర్ణం). **హద్దులు: ఉత్తరం** : మెట్లు, **దక్షిణం:** టిఎఫ్-4, **తూర్పు** : కామన్ కారిడార్ (1.8 మీ॥), **పడమర:** ఓపెన్ టు స్కై. దానిపై ఉన్న అన్ని భవనములు మరియు నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన లేదా భూమికి అనుసంధానించబడిన దేనికైనా శాశ్వతంగా బిగించబడిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీలతో పాటు. | **డిమాండ్ నోటీసు తేది : 10.09.2025 బకాయి: తేది.10.12.2024 నాటికి రూ.3,90,790/- మరియు వడ్డీ, ఇతర ఖర్చులు స్వాధీనత తేది : 18.11.2025** |
| 2. | **శ్రీమతి కప్పల హేమ కృష్ణవేణి (ఋణగ్రహీత),** భర్త: బాబూరావు, డి.నెం.44-15-84, బైపాస్ రోడ్డు, అన్నపూర్ణమ్మపేట, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్ - 533101. **శ్రీమతి శీలం అనూష (సహ-ఋణగ్రహీత),** డి.నెం.45-38-10, అంబేడ్కర్ నగర్, తాడితోట, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్- 533101. **శ్రీమతి కప్పల హేమకృష్ణ వేణి (తనఖాదారు),** భర్త: బాబూరావు, ఫ్లాట్ నెం.టీ-1, మూడవ అంతస్తు, బ్లాక్ బి3, వైఎస్ఆర్ జగనన్న నగర్, తొర్రేడు గ్రామం, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా-533293. | తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, తొర్రేడు వద్ద వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.343/1బిలోని PMAY(U) మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.టీ-1 యావత్తు ఆస్తి (కామన్ ఏరియాలలోని దామాషావాటాతో కలిపి 365 చ॥అ॥ల విస్తీర్ణం). **హద్దులు: ఉత్తరం** : ఓపెన్ టు స్కై, **దక్షిణం:** టిఎఫ్-2, **తూర్పు** : కామన్ కారిడార్ (1.8 మీ॥), **పడమర:** ఓపెన్ టు స్కై. దానిపై ఉన్న అన్ని భవనములు మరియు నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన లేదా భూమికి అనుసంధానించబడిన దేనికైనా శాశ్వతంగా బిగించబడిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీలతో పాటు. | **డిమాండ్ నోటీసు తేది : 19.02.2025 బకాయి: తేది.09.10.2024 నాటికి రూ.3,86,737.94 పై. మరియు వడ్డీ, ఇతర ఖర్చులు స్వాధీనత తేది : 18.11.2025** |
| 3. | **శ్రీమతి నేమాలి జగదీశ్వరి (ఋణగ్రహీత),** భర్త: నేమాలి సత్తిరాజు, డి.నెం.18-6-14/1, లింగంపేట వీధి-3, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. **శ్రీ నేమాలి సత్తిరాజు (సహ-ఋణగ్రహీత),** డి.నెం.18-6-14/1, లింగంపేట వీధి-3, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. **శ్రీమతి నేమాలి జగదీశ్వరి (తనఖాదారు),** ఫ్లాట్ నెం.టీ-4, మూడవ అంతస్తు, బ్లాక్ బి3, వైఎస్ఆర్ జగనన్న నగర్, తొర్రేడు గ్రామం, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా-533293. | తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, తొర్రేడు వద్ద వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.343/1బిలోని PMAY(U) మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.టీ-4 యావత్తు ఆస్తి (కామన్ ఏరియాలలోని దామాషావాటాతో కలిపి 365 చ॥అ॥ల విస్తీర్ణం). **హద్దులు: ఉత్తరం** : టిఎఫ్-3, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు** : కామన్ కారిడార్ (1.8 మీ॥), **పడమర:** ఓపెన్ టు స్కై. దానిపై ఉన్న అన్ని భవనములు మరియు నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన లేదా భూమికి అనుసంధానించబడిన దేనికైనా శాశ్వతంగా బిగించబడిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీలతో పాటు. | **డిమాండ్ నోటీసు తేది : 10.09.2025 బకాయి: తేది.15.11.2024 నాటికి రూ.3,76,165/- మరియు వడ్డీ, ఇతర ఖర్చులు స్వాధీనత తేది : 18.11.2025** |
| 4. | **శ్రీమతి పప్పు లోవలత, (ఋణగ్రహీత),** భర్త: పప్పు అప్పారావు, డి.నెం.20-18-43,ద సాంబశివరావుపేట, 3విఎ అడ్డా వీధి, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. **శ్రీపప్పు అప్పారావు, (సహ-ఋణగ్రహీత),** డి.నెం.20-18-43,ద సాంబశివరావుపేట, 3విఎ అడ్డా వీధి, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్-533101. **శ్రీమతి పప్పు లోవలత (తనఖాదారు),** ఫ్లాట్ నెం.ఎస్-8, రెండవ అంతస్తు, బ్లాక్ బి3, వైఎస్ఆర్ జగనన్న నగర్, తొర్రేడు గ్రామం, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా-533293. | తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, తొర్రేడు వద్ద వైఎస్ఆర్ జగనన్న నగర్, సర్వే నెం.343/1బిలోని PMAY(U) రెండవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.ఎస్-8 యావత్తు ఆస్తి (కామన్ ఏరియాలలోని దామాషావాటాతో కలిపి 365 చ॥అ॥ల విస్తీర్ణం). **హద్దులు: ఉత్తరం** : ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఎస్ఎఫ్-7, **తూర్పు** : ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్ (1.8 మీ॥). దానిపై ఉన్న అన్ని భవనములు మరియు నిర్మాణాలు మరియు భూమికి అనుసంధానించబడిన లేదా భూమికి అనుసంధానించబడిన దేనికైనా శాశ్వతంగా బిగించబడిన అన్ని ప్లాంట్ మరియు మెషినరీలతో పాటు. | **డిమాండ్ నోటీసు తేది : 10.09.2025 బకాయి: తేది.19.11.2024 నాటికి రూ.3,81,608.21 మరియు వడ్డీ, ఇతర ఖర్చులు స్వాధీనత తేది : 18.11.2025** |

తేది : 18.11.2025, ప్రదేశం : రాజమండ్రి సం/- అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# భారత్ చేతిలో హసీనా భవిత!

సొంత దేశంలో కల్లోలానికి కారకురాలై పరాయి పంచన కాలం వెళ్లదీస్తున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణదండన విధించింది. ఇదేమీ ఊహించనిది కాదు. అధికారంలో ఉన్నా లేకున్నా చట్టానికి ఎవరూ అతీతులు కారన్నది న్యాయ పరిభాషలో, ప్రాథమిక సూత్రంగా వర్తిస్తుంది. లోకకళ్యాణం కోసం దేశాధినేతలు తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజాదరణ పొందకపోవచ్చు. కానీ అంతమాత్రాన వాళ్ల దేశ విధ్వంసానికి పాల్పడుతున్నారని చెప్పడం సాహసమే అవుతుంది. హసీనా ఏదో అల్లాటప్పా రాజకీయాలు చేసుకునే చిన్నస్థాయి కుటుంబం నుంచి వచ్చిన మహిళ కాదు. ఆ దేశ ఏర్పాటులో, నిర్మాణంలో ప్రగతిలో పాలు పంచుకున్న బంగ్లా జాతి పిత షేక్ ముజిబుల్ రహ్మాన్ కూతురు. ఎంతో కొంత దేశభక్తి లేకుండా ప్రధాని బాధ్యతలు స్వీకరించారంటే నమ్మలేం. ఆ కుటుంబం చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు. 1971లో బంగ్లాదేశ్ విమోచన కోసం పోరాడి బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించేందుకు ముజిబుర్ చేసిన కృషి ఎనలేనిది. ప్రజల్లోంచి ఉద్యమాలు వచ్చినప్పుడు వాటిని సానునయంగా పరిష్కరించడమో, అది సాధ్యం కానప్పుడు వాటిని అణచివేయడమో ప్రభుత్వాలు చేయగలిగిన పని. ఆమె కూడా అదే చేశారు. అయితే కొన్ని నిర్ణయాలు ప్రజలకు రుచించకపోయి ఉండవచ్చు. వాటినే బూచిగా చూపి విపక్షాలు కూడా జనాన్ని చైతన్యవంతుల్ని చేసి ముందుకురికించే శ్రమ తీసుకున్నారేమో అనిపిస్తుంది. బంగ్లాదేశ్ విమోచన పోరాటంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమర యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కేటాయింపుతో నిరుద్యోగులు, విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తింది. అదే ఉద్యమానికి దారి తీసింది. జూలై 15న విద్యార్థులు ఉవ్వెత్తున చేసిన తిరుగుబాటును ఉక్కుపాదంతో అణచివేయాలని హసీనా తీర్మానించారు. అయితే ఎక్కడో లౌక్యం, చాణక్యం బెడిసికొట్టి 1400 మంది మృతికి ఆ నిర్ణయం కారణమైంది. మానవత్వాన్ని మరచి ఎంతో మంది బలైపోవడానికి ఆమె నిర్ణయం దారి తీసినందుకు జనాగ్రహం వ్యక్తమైంది. ఉద్యమాన్ని అణచివేత వ్యూహాలకు కర్త, కర్మ, క్రియా హసీనాయేనని ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం అభియోగాలు మోపింది. కాగా ఉద్యమ సమయంలో ఉద్యమకారులపైకి హసీనా తమ సొంత పార్టీ అవామీ లీగ్ కార్యకర్తలను కూడా ఉసికొల్పారని అభియోగం. ప్రజాస్వామ్య పునాదుల పునరుద్ధరణకు తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే తాత్కాలిక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ మాత్రం హసీనాకు పడిన మరణ శిక్ష సబబే అని వ్యాఖ్యానించారు. కాగా ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత తీర్పుయని, ఒక అనామిక ప్రభుత్వం ఒత్తిడితో వెల్లడైన తీర్పుగా హసీనా పేర్కొన్నారు. 1975లో సైనిక తిరుగుబాటులో తల్లిదండ్రులు, ముగ్గురు సోదరులు, మరికొందరు కుటుంబ సభ్యులు కూడా హతమయ్యారు. అనంతరమే ఆమె దేశ రాజకీయాల్లోకి ప్రవేశించాల్సిన అగత్యం ఏర్పడింది. ఈ ట్రిబ్యునల్ ఆనాటి హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు కూడా మరణశిక్ష విధించారు. మాజీ ఐజి చౌదరి అబ్దుల్లా అల్ మమూల్‌కు ఐదేళ్ల శిక్ష పడింది. ఒక దేశంలో కానీ, ఒక రాష్ట్రంలో కానీ పాలకుల పట్ల విపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉద్యమించినప్పుడు, వారిని నయానో, భయానో దారిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించడమూ జరిగేదే. అది ప్రభుత్వ బాధ్యత. తాత్కాలిక ప్రభుత్వం కూడా ఆనాటి ఉద్యమకారులకు చేసిందేమీ లేదు. కానీ హసీనాకు శిక్షపడిందంటేనే అది వారికి న్యాయం జరిగినట్లు భావించాలనిచెబుతోంది. ఇదిలా ఉంటే హసీనాకు శిక్ష అయితే వేయగలిగారు కానీ ప్రస్తుతం ఆమె ఇండియా ఆశ్రయంలో ఉంది. ఎక్కడో రహస్యంగా దాక్కోలేదు. భారత ప్రభుత్వం రక్షణ కల్పిస్తోంది. బంగ్లాలో నిరసనకారులను చిత్రహింసలకు గురిచేయడం నిరాయుధ విద్యార్థులపైకి మారణాయుధాలతో దాడి చేసిన చర్యలకు జవాబుదారీగా ఆమెను ట్రిబ్యునల్ అభిశంసించింది. విద్యార్థులపై దాడి జరిపేటట్లుగా హసీనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసిందని మరో ఆరోపణలున్నాయి. ఏదిఏమయినా ముస్లిం దేశాలలో అధికారపక్షాన్ని తిరుగుబాటుతో కూలదోయటమనేది తరచు జరిగే ప్రక్రియ. గతంలో ఆయాప్రభుత్వాలను సైన్యమే కూలదోసేది. ప్రస్తుత బంగ్లాదేశ్ విషయం వేరు. ఇక్కడ ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేసిన సైన్యం కూడా మాటపడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా భారత్‌లో ఉన్న ఆమెను ఎలాగైనా స్వదేశానికి రప్పించుకొని మరణశిక్ష అమలు చేయాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కొత్త వ్యూహాలు పన్నుతోంది. బంగ్లాదేశ్‌లో మరణశిక్ష విధించబడిన షేక్ హసీనాను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ఇప్పటికేభారత్‌కు విజ్ఞప్తిచేసింది. భారత్,బంగ్లాదేశ్‌ల మధ్య ఉన్న ఒప్పందం మేరకు షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను తమకు అప్పగించడమే తక్షణ కర్తవ్యమని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు కర్తవ్యబోధ చేస్తోంది. బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలు కాపాడే దిశగా శాంతి ప్రజాస్వామ్యం స్థిరత్వం కలిగేటట్లు తమ దేశనిర్ణయాలు ఉంటాయని భారత్ ప్రకటించింది. ఈ రెండు దేశాల మధ్య ఉన్న ఒప్పందంలోని ఆర్టికల్ '6' ప్రకారం హత్య, ఉగ్రవాదం, వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావమున్న నేరాల్లోని నిందితులకు అప్పగించకుండా భారత్‌తిరస్కరించే అవకాశముంది. పరస్పర అప్పగింత సందర్భాలలోను 1962ఒప్పందంలోని సెక్షన్ 29ప్రకారం రాజకీయ ప్రేరేపిత ఒప్పందాలకు తిరస్కరించే అధికారం భారత్‌కు ఉంది. హసీనా భవితవ్యం ఇప్పుడు భారత్ దేశ నిర్ణయం మీద ఆధారపడి ఉంది.

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటికంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.



ఎడ్వర్డ్

మనిషి అన్నవాడు ఈ భూప్రపంచంలో తామరాకు లాగా జీవించాలి. తామర నీటిలో పెరుగుతున్నప్పటికీ దానికి తడి అంటదు.



స్వామి వివేకానందుడు

# ప్రజావాక్కు



### నిధుల కొరత

వాతావరణ మార్పులుగ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లో భారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అది వాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రకబాధ్యతలపైఆధారపడిన ఒక సుస్థిర దృక్కోణం. ప్యారిస్ఒప్పందానికి పునాదిఅయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకు ఒకే రకం బాధ్యతలనుపెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం వాతావరణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది. నిధుల కొరతపరిష్కారం కాకుండా ఉద్గార తగ్గింపులపై ఒత్తిడి చేయడం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రిస్క్రిప్షన్ చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమే కానీ, తెలంగాణలో అన్ని జిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు అమ్మిసొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందులషాప్‌లో ఫార్మాసిస్ట్‌లేదు. పర్యవేక్షణలేదు నిబంధనల ప్రకారం ప్రతిమందుల దుకాణంలోఅర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. యాంటీబయాటిక్ మందుల అమ్మకాలకు సంబంధించిన హెచ్1రిజిస్టర్‌ను చాలా దుకాణాలు నిర్వహించడం లేదు.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

### పేదరికాన్ని నిర్మూలించాలి

కేరళ ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు దుర్భర పేదరికం నిర్మూలన చేసాం అని ప్రకటిస్తే ఎంత బాగుంటుంది. కేరళ మోడల్‌లో చేసిందేమిటి కనీస అవసరాల గుర్తింపు చేసి స్థానిక సంస్థల్నుబలంగ్గాపనిచేయడమేకదూ. అయితే తెలంగాణ వంటి రాష్ట్రాలు కేరళ మోడల్‌ను అవలంభించడంతోపాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టడానికి కావాల్సిన ప్రణాళికలు సెస్ సంస్థ ద్వారా వేయించాలి.

- భారత అవినాష్, జనగామ

### సమాజానికి కొత్త సవాలు

ఈరోజుల్లో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలనుఇది అందిస్తోంది. అయితే అదేసమయంలో దీని దుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా వేదిక అవుతోంది. నిజా నిజాలు తెలియకుండానే ప్రజలు షేర్‌చేయడం వల్ల చిన్న సంఘటనలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయి. కొన్నిసార్లు హింసాత్మక ఘటనలకు కూడా ఇది కారణమవుతోంది. వ్యక్తిగత జీవితాన్ని ఇంటర్నెట్‌లో అనవసరంగా ప్రదర్శించడం వల్ల గోప్యత కోల్పోవడం, మోసపూరిత చర్యలకు బలికావడం వంటి సమస్యలుపెరుగుతున్నాయి. అదేవిధంగా యువతసోషల్ మీడియా ఆకర్షణలో మునిగిబాధ్యతలు విస్మరించేపరిస్థితి ఏర్పడుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మాటల కందని మహావిషాదం

ఇస్లాం మత ఆచారం ప్రకారం ముస్లిములకు అయిదు ప్రధాన సూత్రాలుంటాయి. అవి భగవంతుడైన అల్లా మీద నమ్మకం, ప్రార్థన, ఉపవాసం, దానం, జీవితంలోఒకసారయినా వారి పవిత్ర స్థలమైన మక్కా యాత్ర చేయడం. ఇందులో అన్నింటినీ తమకు అందుబాటులో నున్నచోట ఆచరించవచ్చు. కానీ హజ్ యాత్రకు సౌదీ అరేబియాకు వెళ్ళితీరాలి. ఈ నెల17వ తారీఖున అక్కడకు వెళ్ళినవారు మక్కా నుండి మదీనా బస్సులో వెడుతుండగా రాత్రి వేళ అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడడంతో అందులో ప్రయాణిస్తున్న 45 మంది సజీవ దహనం అవడం ప్రజలందరి హృదయాలను కలచివేసింది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### తెలంగాణలో తార స్థాయికి అవినీతి

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదోఒకప్రాంతంలో ప్రభుత్వఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. తాజాగా మెదక్ జిల్లా టెక్మాల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎసిబికి చిక్కడం అందర్నీ షాక్ గురిచేసింది. లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలైన పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పడం రావడం లేదు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలల హక్కుల పరిరక్షణ కాగితాలకే పరిమితం!

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనం దరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమ లుచేశారు. ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలిం చడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొల గించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.**

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. బాలల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కలిగించి, పిల్లలు తమ భావాలను, సమాచారాన్ని పంచుకోవడాన్ని, పరస్పర అవగాహనను పెంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ దినోత్సవం నిర్వహించబడుతున్నది. 1954, డిసెంబరు 14న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959, నవంబరు 20న ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. 1989, నవంబరు 20న బాలల హక్కులపై సంప్రదాయ ఆచరణను ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్య సమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తున్నారు. అయితే ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధిలేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవిఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మిక శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాలలోపు



పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసిపిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పనిచేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాలలోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికిమించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగంఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్నిఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులుగానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మానివేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకుకార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలుచేశారు. ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొన సాగుతూనే ఉన్నారు. బాల కార్మికవ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. ●

# ఎఐతో భాషాభివృద్ధి సాధ్యమేనా?


వి. వరద రాజు

చక్రం పురాతన ఆవిష్కరణ. కొత్త రాతి యుగంలో మెసెపుటోమియన్లు కనుగొన్నారు. రవాణాకు చక్రం, ఇరుసులే ముఖ్యం. ఈ రెండు వాళ్ళ సృష్టే. ఇవి రవాణా గతినే మర్చివేసాయి. ప్రగతి చక్రాన్ని ఫర్ మని త్రిప్పాయి. ఆవిరి, ముద్రణా యంత్రాలు సమాజాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాయి. విద్యుత్, కంప్యూటర్ కనుగొన్నాక అభివృద్ధి ఊహకు అందని తీరాలకు చేరింది. గుండు సూది మొదలు కంప్యూటర్ వరకు ప్రతి ఆవిష్కరణ మానవ జీవితాన్ని ఎంతో వేగవంతం చేసాయి. తేలిక పరిచాయి. అధిక సుఖమయం కావించాయి. అయినప్పటికి ఈ మార్పులు మధ్య ఒక మానవ అనుభవం మాత్రం ఏ మాత్రం మార్పు లేకుండా అలాగే నిశ్చలంగా నిలిచి వుంది. అది భాష. భావాన్ని వ్యక్తం చేసేదే (సాధనం) భాష. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. తరువాత ఉత్తరం వచ్చింది. ఫోన్ దూరాన్ని చేరిపేసింది. అదనంగా మెయిల్, వాట్సాప్, ఇలా మెసేజ్ చేసే సాధనాలు చాలా వచ్చాయి. నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో వున్నాయి. ఎన్ని సాధనాలు వచ్చినా భాష మారలేదు. అలానే వుంది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే కానీ ప్రేరణ అలానే నిలిచివుంది. కృత్రిమ మేధా ఇప్పుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరిగి రాస్తోంది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తోంది. వ్యాసాలు రచిస్తోంది, సంగీత బాణీలు కడుతోంది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధా ట్యూటరుగా, అనువాదకునిగా, ఆశ్చర్యకరంగా ఒక సహచరునిగాను వ్యాహరిస్తున్నది. తర్కం, స్థిర వ్యస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజనీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఎఐ ద్వారా తక్షణమే ఎవరైనా పొందవచ్చు. భాష వేరే కోవకు చెందింది. దీనికి నియమాలు ఉంటాయి. అంతేకాకుండా ఒక భాష ఆ జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఎఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదంసరిగానే ఉంటుంది. ఐతే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. యంత్రం ఆ ఉద్వేగ అనుభూతి చెందదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఎఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగాఉంటుంది. కానీ పేలావం అనిపిస్తాయి. మనిషి మాటలో వినిపించే పలు స్వరాలు, లయ, మాధుర్యాలు వినిపించవు. అనువాదం అంటే ఒక భాష నుండి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైందని భాషవేత్తలు చెబుతారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఒ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలూ ఉంటాయి. అలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకోంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలనిపిస్తాయి. తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. ఇవన్నీ విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తుంది. ఈ బంధం భాష నేర్చుకోవడంలో మెలుకువలు తెలియజేస్తుంది. ఈ సజీవ శిక్షణ ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు. కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడి సరిచేస్తాయి. వ్యాకరణం వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసన్ని అందిస్తాయి. టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. లెసన్ ప్లాన్ రాసుకోవచ్చు, విద్యార్థులు నుండి వేగంగా అభిప్రాయాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకోనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషా పటిమ ధారళంగా మాట్లాడడం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే అలవడుతుంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనేఉంటాయి. యాస, మర్యాద పూర్వక సంభషణా స్వరాలు మెల్లగా అనుభవంతో మారుతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లాయలోపాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు. ఇదే నిజమైన భాష ప్రావీణ్యత సాధనా మార్గం. గత మూడు దశాబ్దాలుగా పట్టణీకరణ జోరక్కొంది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు బాగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచుకోవాలంటే ఇంగ్లీష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఎఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెను ముప్పు కలిగిస్తుంది. భాష నేర్చుకోవలసిన అవసరంలేదనే భావన మనలో నాటుతుంది. అందుకే టెక్నాలజీని నేర్చు, వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్పడం అంటే పదవినియోగం అనుకుంటే పొరపాటు. ఈ ప్రపంచాన్ని మరో దృష్టికోణంతో దర్శించడం. భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమైవుంటాయి. ఇదే నిజ భాషా పండిత్య సాధనకు సోపానం. ●

# పల్లెల ప్రగతియే దేశాభివృద్ధికి సూచిక

డా.పోలం సైదులు

గ్రామంలో ప్రజాస్వామ్యం వికసించి, అది స్వయం సమృద్ధి సాధించినప్పుడే జాతి అభివృద్ధి చెందుతుందన్నారు మహాత్మ గాంధీ. అందుకే గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో స్వయం పాలన గావించడానికి పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎప్పుడైతే గ్రామాలు అభివృద్ధి చెందుతాయో అప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి దిశగా పయనిస్తాయి. గ్రామాభివృద్ధి అనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహాయ సహకారాలతో ముడిపడి గ్రామపాలన గావించే గ్రామ ప్రథమపౌరుడు (సర్పంచ్)పై ఆధారపడి ఉంటుంది. బీసీల 42శాతం రిజర్వేషన్స్ కారణంగా న్యాయపరమైన చిక్కులు తలెత్తడంతో కాస్త ఆలస్యమైన ఎన్నో అవాంతరాలను అధిగమించి ఎట్టకేలకు ప్రభుత్వం నవంబర్ 17న జరిగిన కేబినెట్ సమావేశంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్న నేపథ్యంలో డిసెంబర్ 1నుండి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించి, డిసెంబర్ రెండవ వారంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వేసి స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. గ్రామాలలో విభిన్న రాజకీయపార్టీలకు చెందిన నాయకత్వం రిజర్వేషన్ పరంగా అభ్యర్థులను ఖరారుచేసి ఇప్పటికే ఎవరికి వారు అంతర్గత ప్రచార కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం గమనించవచ్చు. ఈ ఎన్నికలలో ఎన్నో వింతలను అంటే ఒకే కుటుంబానికి చెందిన ఇరువురి వ్యక్తులను అన్నాతమ్ముడు, అన్న చెల్లి, తల్లి కొడుకు, అత్త కోడలు బరిలో నిల్చోవడం లాంటి సంఘటనలను చూడవచ్చు. అలాగే ఈ ఎన్నికలలో ఒకవైపు అధికారపార్టీ తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి, మరొకవైపు ప్రతిపక్షపార్టీ బలోపేతం కావడానికి ప్రయత్నంలో భాగంగా డబ్బుఏరులై పారనుంది. ఓటర్లను ఆకర్షించడానికి చేయని ప్రయత్నం అంటూ ఉండదు. ఎన్నో నెరవేరలేని హామీలుస్తూ, బ్రతిమిలాడుతూ, భయపెడుతూ, బహుమతులనిస్తూ ప్రచారం చేస్తుంటారు. వాస్తవానికి గ్రామాలలో ఎన్నికయ్యే సర్పంచ్ పైననే గ్రామాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గ్రామ ప్రథమ పౌరుడంటే ఇంటికి పెద్దదిక్కువలే గ్రామానికి పెద్ద. గ్రామ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి నిరంతరం వారి క్షేమం, సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతుండాలి. అంతేగానీ ఏదో హోదాకోసమో ఆర్థికపరమైన వ్యాపారంగా భావించి లక్షలలో ఖర్చుపెట్టి వడ్డీతో సహా సంపాదించుకోవాలనో ఎన్నికలలో పోటీచేయవద్దు. గ్రామప్రజలు సైతం పార్టీలు, కులాలు, మతాలకతీతంగా డబ్బుకు ఎలాంటి ప్రాధాన్యత నివ్వకుండా, సేవాదృక్పథం కలిగి గ్రామాభివృద్ధికి పాటుపడే నాయకున్ని ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఏదిఏమైనప్పటికి ఫిబ్రవరి మాసం నుండి యావత్తు తెలంగాణ రాష్ట్రమంతట నూతనంగా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుమెంబర్లు నియామకం కాబోతున్నారు. కావున వారి విధుల నిర్వహణ, అభివృద్ధిపై సరైన అవగాహన ఏర్పర్చుకొని, గతంలోచరిత్ర సృష్టించిన కొన్ని విషయాలను



పరిశీలిస్తూ అవగతం చేసుకుంటూ, ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా హాజిపల్లి గ్రామపంచాయతీకి గ్రామ ప్రథమపౌరురాలిగా ఎన్నికై గ్రామంలోని వీధులన్నీ సిమెంట్ రోడ్లతో నిర్మించి, ప్రతివీధికి భూఅంతర్భాగం ద్వారా మురికి కాలువలను నిర్మించి, ప్రతి ఇంటికి మరుగుదొడ్లు కట్టించి, పిల్లలకు పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను, గ్రామపంచాయితీ భవనాన్ని, గ్రంథాలయాన్నీ నిర్మించి 2008లో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు (రాష్ట్రపతి) శ్రీమతి ప్రతిభా పాటిల్ గారి చేతుల మీదుగా నిర్మల గ్రామ పురస్కారాన్నీ అందుకున్నారు. అదే సంవత్సరం నవంబర్ మాసంలో రాష్ట్రప్రభుత్వం నుండి 'శుభ్రం' అవార్డు పొందడం అనేది మిగతా గ్రామ ప్రథమ పౌరులకు ఆదర్శం. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామ చంద్రపురం, నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం, మహారాష్ట్రలోని అహ్మదనగర్ జిల్లాలోని హైవేర్ బజార్‌లో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలిస్తే గ్రామ సభలను విజయవంతంగా జరిపి, పలు సమస్యలకు పరిష్కార మార్గాలను చూపుతూ, ఆ సభలలో గ్రామంలోని ప్రతి ఒక్కరిని హాజరయ్యేటట్లు చేసి, గ్రామాభివృద్ధికి కృషిచేశారు. గంగాదేవిపల్లిలో 18రకాల వివిధ కమిటీలను గ్రామసభ ద్వారా శుద్ధమైన త్రాగునీరు కమిటీ, పారిశుద్ధ కమిటీ, ఆరోగ్యా కమిటీ, సమాచార కమిటీలు మొదలగు వాటిని ఏర్పాటు చేసి ఎవ్వరికి ఏ విషయంలో సమస్య వచ్చినా, తగిన కమిటీలను సంప్రదించి సులభంగా పరిష్కరించుకునే విధంగా యంత్రాంగాన్నీ ఏర్పాటుచేసి అభివృద్ధికి దోహదపడటం జరిగింది. పాఠశాలలకు వెళ్ళే వయసు వచ్చిన బాలబాలికలను పాఠశాలలలో చేర్పించేటట్లు యంత్రాంగాన్ని తయారుచేసి గ్రామంలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషిచేస్తూ విజయవంతంకావడం. ప్రతిఇంటికి పరిశుభ్రమైన త్రాగునీరు అందేటట్లు చూడటం. జనాభా నియంత్రణలో భాగంగా దంపతులను ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలతోచాలని ప్రోత్సహిస్తూ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్స్ చేయించడం. గ్రామంలోని ప్రతి పసిపిల్లలకు ప్రభుత్వం తరుపున అందించే పోలియో చుక్కలు, టీకాలు, వివిధ వ్యాక్సిన్లు సకాలంలో అందరికి అందేటట్లు చూడటం. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బ్యాంకులో ఖాతా తెరిచి నగదు నమోదు చేసుకోవడానికి ప్రోత్సహించడం. గ్రామంలో పారిశుద్ధానికి అధిక ప్రాముఖ్యతనిస్తూ, ఎవ్వరికి ఎలాంటి అంటూ రోగాలు రాకుండా జాగ్రత్తపడటం. గ్రామంలో అందరి సమేతంగా మద్యపానాన్ని నిషేధించి అభివృద్ధిలో పరుగులు తీసేవిధంగా తీర్చిదిద్దడంఅనేది యావత్తు రాష్ట్రానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాల గురించి సర్పంచ్ బరిలో ఉన్నటువంటి అభ్యర్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరీ ముఖ్యంగా గ్రామాలలో జరిగే ఈ పంచాయితీ ఎన్నికలలో స్నేహపూరిత పోటీని కలిగివుండాలే తప్పా, ఒకరిపై ఒకరు వ్యక్తిగతంగా ఛాలెంజ్‌గా తీసుకోని అధిక ధనాన్ని ఖర్చుచేసి, మద్యాన్ని ఏరులై పారిస్తూ, తను నష్టపోయి, ఇతరులను ఇబ్బందులపాలు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉన్నది. గ్రామంలోని ప్రజలంతా కలిసికట్టుగా వుండి అభివృద్ధిని కాంక్షిస్తూ, వీలైతే ఎలాంటి ఎన్నికలు లేకుండా నిస్వార్థపరుడిని, గ్రామ క్షేమం, సంక్షేమం, అభివృద్ధిని కాంక్షించే వ్యక్తులను ఎన్నుకోవడం ఎంతో మంచి పరిణామం. ఎలాంటి కక్షలు, కుట్రలు లేకుండా, ఎన్నికల అధికారులతో సహకరిస్తూ, పంచాయితీ ఎలక్షన్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై వున్నది. ప్రశాంత వాతావరణంలో, మరెంతో ప్రశాంతంగా ఎన్నికలలో పాల్గొంటూ ఒక మంచి వ్యక్తిని గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి దోహదపడాలని ఆశిద్దాం. ●



బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని కాంగ్రెస్ అభిమానులు నివాళులర్పిస్తున్న దృశ్యం

# బీహార్‌లో నేటి నుంచి కొత్త సర్కార్

**- ఎన్‌డిఎ శాసనసభా పక్ష నేతగా నితీశ్ ఎన్నిక - పదోసారి సిఎం కానున్న జెడియు అధినేత - డిప్యూటి సిఎంలుగా సామ్రాజ్ చౌదరి, విజయ్ సిన్హా - ప్రమాణస్వీకారోత్సవానికి హాజరుకానున్న ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు - డిప్యూటీ సిఎం పదవి కావాలని ఎల్‌జెపి పట్టు**



**పాట్నా, నవంబరు 19:** బీహార్‌లో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్‌ను ఎన్‌డిఎ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఎన్‌డిఎ ఎమ్మెల్యేల సమావేశంలోనూ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ అరిఫ్ అహ్మద్ మొహమ్మద్ ఖాన్ వద్దకు వెళ్లిన నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించారు. గవర్నర్ దానిని ఆమోదించారు. తరువాత నితీశ్ కుమార్, ఎన్‌డిఎ నేతలు నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో గురువారం పాట్నాలోని చారిత్రిక గాంధీ మైదానంలో సిఎంగా నితీశ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయడం ఇది 10వసారి. సిఎంతోపాటు డిప్యూటీ సిఎంలుగా సామ్రాట్ చౌదరి, విజయ సిన్హాలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఎన్‌డిఎ వర్గాలు వెల్లడించాయి. మంత్రులు ఎంతమంది ప్రమాణ స్వీకారం చేయబోతున్నారనేది మాత్రం బహిర్గతం కావడం లేదు. అంతకుముందు జెడియు ఎమ్మెల్యేలు తమ శాసనసభపక్ష నేతగా నితీశ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. సచివాలయంలోని సంవాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నితీశ్ కుమార్‌ను శాసనసభ పక్ష నేతగా విజయ్ చౌదరి, ఉమేష్ కుష్వాహా ప్రతిపాదించగా, పార్టీ నేతలు మద్దతు తెలిపారు. మరోవైపు బిజెపి శాసనసభా పక్షనేతగా తారాపుర్ ఎమ్మెల్యే సామ్రాట్ చౌదరిని ఎన్నుకున్నారు. ఉప నేతగా విజయ సిన్హాను ఎన్నుకున్నారు. బిజెపి కేంద్ర పరిశీలికుడిగా హాజరైన ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఈ విషయాన్ని ప్రకటించారు. కాగా రేపు పట్నాలోని గాంధీ మైదానంలో సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం జరగనుంది. అంతకుముందు స్పీకర్ పదవితో సహా కీలక మంత్రి పదవుల కేటాయింపుపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. స్పీకర్ పదవి కోసం బిజెపి, జెడియు గట్టిగా పట్టుబట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీలో బిజెపికి చెందిన నంద్‌కిశోర్ యాదవ్ స్పీకర్‌గా ఉన్నారు. జెడియు పార్టీకి చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. అయితే ఈసారి కూడా స్పీకర్ పదవిని దక్కించుకోవాలని బిజెపి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, మంత్రివర్గ కూర్పుపై భాగస్వామ్య పక్షాల మధ్య ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి పదవి ఫార్ములాకు ఎన్‌డిఎలోని పార్టీలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 89, జెడియు 85 భారీగా సీట్లు రావడంతో ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు ఓ మంత్రి పదవి కేటాయించానే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ ఫార్ములా ప్రకారం బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్ జేపీ (రామ్‌విలాస్) పార్టీకి 3, ఆర్‌ఎల్‌ఎం, హెచ్‌ఏఎంలకు ఒక్కోటి చొప్పున మంత్రి పదవులు లభించే అవకాశం ఉంది. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షం ఎల్‌జెపి ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. కూటమిలోని పార్టీలందరికీ కేబినెట్‌లో చోటు కల్పిస్తున్నప్పటికీ డిప్యూటీ సిఎం కావాలని బిజెపి పెద్దల ముందు ఎల్‌జెపి అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. అయితే, దీనిపై బిజెపి నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

# నా తల్లిని బంగ్లాకు అప్పగిస్తే మిలిటెంట్లు చంపేస్తారు!

## హసీనా కుమారుడు సాజీబ్‌వాజెద్ ఆందోళన



**న్యూఢిల్లీ, నవంబరు 19:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తల్లిని బంగ్లాదేశ్‌కు అప్పగిస్తే అక్కడి మిలిటెంట్లు ఆమెను చంపేస్తారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న తన తల్లికి భద్రత కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సరిహద్దుల్లో ఉగ్రవాదం పెరిగిపోతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని భారత్‌ను హెచ్చరించారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాజీబ్ మాట్లాడుతూ తన తల్లిని అప్పగించాలన్న బంగ్లాదేశ్ ప్రభుత్వ అభ్యర్థనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుత బంగ్లా ప్రభుత్వం న్యాయ ప్రక్రియను అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. తన తల్లిపై తప్పుడు కేసులు బనాయించారని, 17 మంది న్యాయమూర్తులను తొలగించి, పార్లమెంట్ ఆమోదం లేకుండానే చట్టాలను సవరించి విచారణ జరుపుతున్నారని విమర్శించారు. కనీసం డిఫెన్స్ లాయర్లను కూడా కోర్టులోకి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ మా అమ్మ ప్రాణాలను కాపాడింది. ఆమె బంగ్లాదేశ్ విడిచిపెట్టకపోయి ఉంటే, మిలిటెంట్లు ఆమెను చంపేసేవారని సాజీబ్ అన్నారు. ప్రస్తుత యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, హసీనా హయాంలో అరెస్టయిన వేలాది మంది ఉగ్రవాదులను విడుదల చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థలు బంగ్లాదేశ్‌లో స్వేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని తెలిపారు. బంగ్లా ఉగ్రవాదంపై ప్రధాని మోదీ కూడా తీవ్ర ఆందోళనతో ఉన్నారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. తన తల్లిని అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం చేసిన అభ్యర్థనను భారత్ తిరస్కరిస్తుందన్న నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు.

# చిన్న మార్పులతో పాత చట్టాన్నే అమలుచేస్తున్న కేంద్రం!



**ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టంపై సుప్రీం సీరియస్**

**న్యూఢిల్లీ, నవంబరు 19:** ట్రిబ్యునళ్ల సంస్కరణల చట్టం2021 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ చట్టంలో నియామకాలు, సర్వీసు కండీషన్లు, పదవీ కాలాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను గతంలో సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసిందని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్యానించింది. చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగిస్తున్నాయని, అధికార వికేంద్రీకరణ సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని, అలాంటి వాటిని తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం లేదని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ చట్టాన్ని తాము సరిచూశామని, గతంలో కోర్టు రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తెచ్చారని పేర్కొంది. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుందని స్పష్టంచేసింది. ట్రిబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను ఈ సందర్భంగా కోర్టు పునరుద్ధరించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ సభ్యులు 62 ఏళ్ల వచ్చేవరకు పదవిలో కొనసాగవచ్చని తెలిపింది. ఇక ట్రిబ్యునళ్ల ఛైర్ పర్సన్లు/అధ్యక్షుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని వెల్లడించింది.

అదే సమయంలో ఈ అంశంపై జాతీయ ట్రిబ్యునల్స్ కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. 2021లో తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌తో సహా కొన్ని అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితో పాటు పలు ట్రిబ్యునళ్ల జ్యుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి. అయితే, ఈ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో మద్రాస్ బార్ అసోసియేషన్ సహా పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా తీర్పు వెలువరించింది.

# షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఖైబర్‌ఫఖ్తూన్‌క్వా సిఎం ధ్వజం



**పెషావర్, నవంబరు 19:** పాకిస్థాన్ ప్రభుత్వంపై ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది సంచలన ఆరోపణలు చేశారు. తమ ప్రావిన్స్ లో పాకిస్థాన్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోందని ఆయన ఆరోపించారు. పొరుగున ఉన్న ఆఫ్ఘనిస్థాన్ తో ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ కు సత్సంబంధాలు నెలకొనడంపై ఇస్లామాబాద్ ఆగ్రహంగా ఉందని, దీనిని చెడగొట్టడానికే ఖైబర్ ప్రావిన్స్ లో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన మండిపడ్డారు. శాంతి ప్రయత్నాలను, చర్చలను అడ్డుకోవడమే దీని వెనకున్న అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిదిని ఉటంకిస్తూ పలు కథనాలువెలువడ్డాయి. సోహైల్ అఫ్రిది కిందటి నెలలోనే ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన పాకిస్థాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీకి చెందిన నేత. ఇటీవలి కాలంలో ఖైబర్ ప్రావిన్స్ లో చోటుచేసుకుంటున్న ఉగ్ర దాడులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాక్ ప్రభుత్వమే ఈ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇటీవల పష్తూన్ తహాఫుజ్ మూమెంట్ (పీటీఎం) సభ్యులు కిడ్నాప్ కు గురైనట్లు తెలుస్తోంది. దీనిని అఫ్రిది తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ప్రపంచ దేశాలు సహించకూడదని ఆయన పేర్కొన్నారు. శాంతి ప్రయత్నాలకు భంగం కలిగించేవారిని ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తామని సోహైల్ అఫ్రిది హెచ్చరించారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో సైనిక బలగాలు సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని సీఎం అఫ్రిది ఆరోపించారు. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో సైనికులు సామాన్యులపై దౌర్జన్యం చేస్తున్నారని, సొంత ప్రజలనే చంపేస్తున్నారని విమర్శించారు.

కాగా, పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లోని తిరా లోయలో ఇటీవల పాక్ వైమానిక దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని వార్తలు వెలువడ్డాయి. సొంత ప్రజలపైనే పాక్ సైన్యం దాడి చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం సోహైల్ అఫ్రిది గుర్తు చేశారు.



# ఉచితంగా ఎఐ కోర్స్

## కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, నవంబర్ 19:** కృత్రిమ మేధకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు, ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఒక కోర్సును రూపొందించింది. 'యువ ఎఐ ఫర్ ఆల్' పేరిట దీన్ని అందిస్తుండడం విశేషం. ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారు. ఈ కోర్సు వ్యవధి 4.5 గంటలు. దీన్ని పూర్తి చేసిన వారికి ఎఐపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. కోర్సులు చాలా సరళంగా, నిజ జీవితంలో ఉపయోగించే ఉదాహరణలతో రూపొందించారు. ఇది ఫ్యూచర్‌స్కిల్స్‌ప్రైమ్, ఐజిఓటి కర్మయోగి సహా మిగిలిన ప్రముఖ ఎడ్‌టెక్ పోర్టళ్లలో అందుబాటులో ఉంది. దీని పూర్తిచేసిన వారికి భారత ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. ఈ కోర్సులో మొత్తం ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ఎఐ అంటే ఏమిటి? ఎలా పనిచేస్తుంది? విద్య, సృజనాత్మకత, ఉద్యోగాలను ఎఐ ఎలా మారుస్తోంది? ఎఐ టూల్స్‌ను భద్రంగా, బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలి? నిజజీవితంలో ఎఐ వాడే విధానం, ఎఐ భవిష్యత్తు.. రాబోయే అవకాశాలు. రిజిస్టర్ చేసుకునే విధానం : అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. హోమ్ పేజ్ కుడివైపు 'ఎన్‌రోల్'పై క్లిక్ చేయాలి. గూగుల్ లేదా లింక్డిన్ ఖాతా ద్వారా అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. పేరు, పుట్టినతేదీ, జెండర్ వంటి వివరాలు ఎంటర్ చేయాలి. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఓటిపితో ధ్రువీకరించాలి. అపార్ ఐడి ఇవ్వాలి. చెక్‌బాక్స్‌లో టిక్ చేసి సబ్మిట్ చేయాలి.

# గ్రామీ అవార్డుకు దలైలామా నామినేట్



**ధర్మశాల, నవంబరు 19:** నోబెల్ బహుమతి గ్రహీత దలైలామా మొట్టమొదటి సారి గ్రామీ అవార్డుకు నామినేట్ అయ్యారు. ఆధ్యాత్మిక ప్రవచనాలకు చెందిన దలైలామా ఆల్బమ్ ఆ పోటీలో ఉన్నది. 'ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ద దలైలామా' అన్న టైటిల్‌తో ఉన్న ఆల్బమ్ గ్రామీలకు పోటీపడుతున్నది. 90 ఏళ్ల వయసులో దలైలామా ఆ అవార్డుకు నామినేట్ కావడం ఓ మైలురాయిగా భావిస్తున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నారేషన్, స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ కేటగిరీల్లో దలైలామా ప్రవచనాల ఆడియో పోటీపడుతున్నది. 2026 ఫిబ్రవరి 1న లాస్ ఏంజిల్స్‌లో 68వ గ్రామీ అవార్డుల ప్రదానోత్సవం జరగనున్నది. కరుణ, ఆత్మ శాంతి, భావోద్వేగాల గురించి దలైలామా చేసిన ప్రసంగాలకు సరోద్ వాయిద్యకారుడు అంజద్ అలీ ఖాన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. అంజద్ కుమారుడు అమన్ అలీ బంగాష్, అయ్యన్ అలీ బంగాష్ కూడా మ్యూజిక్ కంపోజ్ చేశారు. దలైలామా ఆల్బమ్ కోసం అంతర్జాతీయ కళాకారులు ఆండ్రా డే, మ్యాగీ రోజర్స్, టోనీ సుకార్, టెడ్ నాష్, దేబీ నోవా, రూఫస్ వెయిన్‌రైట్ పనిచేశారు.

# సౌదీ ప్రిన్స్ క్షమాపణ చెప్పాల్సిందే: ఖషోగ్గీ భార్య



**వాషింగ్టన్, నవంబరు 19:** సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికాలో పర్యటిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సమావేశమై పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ అమెరికా పర్యటనపై జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి భార్య హనన్ ఎలాత్ర్ ఖషోగ్గి తీవ్రంగా మండిపడ్డారు. తనను వ్యక్తిగతంగా కలుసుకుని క్షమాపణ చెప్పాలని మహమ్మద్ బిన్ సల్మాన్ ను డిమాండ్ చేశారు. భర్త మరణంతో తాను కోల్పోయిన జీవితానికి పరిహారం ఇవ్వాలన్నారు. ఇందుకు సహకరించాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హనన్ ఎలాత్ర్ ఖషోగ్గి ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు. 2018 లో ఇస్తాంబుల్ లోని దౌత్య కార్యాలయం వద్ద జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గి హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సౌదీ ఏజెంట్లే కారణమని, సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశాల మేరకే వారు ఈ ఆపరేషన్ నిర్వహించారని ఆరోపణలు వినిపించాయి.

# అల్‌ఫలా గ్రూప్ ఛైర్మన్‌కు 13రోజులు ఇడి కస్టడీ

## చారిటబుల్‌ట్రస్టుకు రూ.415 కోట్లు విరాళాలు!

### మరింత సమగ్ర దర్యాప్తుచేయనున్న ఎన్ఐఎ, ఇడిలు

**న్యూఢిల్లీ, నవంబరు 19:** అల్ ఫలాహ్ గ్రూపు ఛైర్మెన్ జావద్ అహ్మద్ సిద్ధికీని సిటీకోర్టు వచ్చేనెల ఒకటవ తేదీవరకూ అంటే 13 రోజులపాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. అల్ ఫలాహ్ ఛారిటబుల్ ట్రస్టు మనీల్యాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అడిషనల్ సెషన్స్ జడ్జీ షీతల్ చౌదరీ ప్రధాన్ బుధవారం రాత్రి ఒంటి గంటకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఎంపీఎల్ఏ చట్టంలో సెక్షన్ 19 కింద సిద్ధిక్‌ను అరెస్టు చేశారు. ఈడీ రిమాండ్ కోసం అతన్ని రాత్రిపూట కోర్టుకు తీసుకెళ్లారు. అల్ ఫలాహ్ గ్రూపుపై విచారణ చేపట్టిన తర్వాత ఈడీ ఈ చర్యలు తీసుకున్నది. ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఏజెన్సీ చర్యలు మొదలుపెట్టింది. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ కాలేజీ విద్యార్థులను, పేరెంట్స్‌ను తప్పుదోవ పట్టించినట్లు గుర్తించారు. నాక్ అక్రిడిటేషన్ ఉన్నట్లు నమ్మించారని ఆరోపించారు. 1956 యూజీసీ చట్టంలోని సెక్షన్ 12(బీ) కింద యూజీసీ అనుమతి ఉన్నట్లు కూడా ఆ యూనివర్సిటీ తప్పుగా చూపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రూపు ఛైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిక్‌కు విరాళాల రూపంలో 415 కోట్లు అందినట్లు ఈడీ పేర్కొన్నది. తన ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి అక్రమ రీతిలో ఆ నిధులను సమీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గల్ఫ్‌లో ఫ్యామిలీ సభ్యులు స్థిరపడడం వల్ల అక్కడికి పారిపోయే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది. ఫరీదాబాద్‌లో రోజంతా జరిగిన తనిఖీల తర్వాత అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు ఛైర్మన్ సిద్ధిక్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఢిల్లీ కారు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలా విశ్వవిద్యాలయం వ్యవహారాలపై అటు దర్యాప్తుసంస్థలు, ఇటు విద్యాశాఖ, నాక్ అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 10 మంది కనిపించకుండా పోయినట్లు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కనిపించకుండా పోయిన వ్యక్తుల ఫోన్‌లు స్విచ్ఛాఫ్ అని వస్తున్నాయి. ఇందులో ముగ్గురు కశ్మీరీలు ఉన్నారని తెలుస్తోంది. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టైన నిందితులకు ఈ విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్నట్లు విచారణలో బయటపడింది. తాజాగా, పదిమంది కనిపించకుండా పోవడం గమనార్హం.

ఢిల్లీలోని పేలుడు ఘటనతో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఢిల్లీ కారు పేలుడు కేసులో ఈ విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు వైద్యులు సహా తొమ్మిది మంది అరెస్టయ్యారు.

ఈనెల 10వ తేదీన జరిగిన ఎర్రకోట కారు పేలుడు ఘటనతో వర్సిటీకి లింకు ఉన్న కారణంగా ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. తప్పుడు అక్రెడిటేషన్, గుర్తింపు చూపిస్తూ విద్యార్థులు, పేరెంట్స్ నుంచి ఆ వర్సిటీ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రూపంలోనే 415 కోట్లు సేకరించినట్లు తెలుస్తున్నది. పరారీ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అతన్ని కస్టడీలోకి తీసుకున్నట్లు ఈడీ పేర్కొన్నది. 1990 నుంచి అల్ ఫలాహ్ వర్సిటీ అంచలంచెలుగా ఎదిగిందని, ఇప్పుడు ఓ పెద్ద విద్యాసంస్థగా మారినట్లు తెలిపింది.

# ఎన్నికల సంఘంపై ఆరోపణలు రాజ్యాంగ వ్యవస్థలపై దాడి

**- రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖుల లేఖ**

**- సంతకం చేసిన వారిలో రిటైర్డ్ జడ్జిలు, మాజీ సైనికాధికారులు, రాయబారులు**




**న్యూఢిల్లీ, నవంబరు 19:** కేంద్ర ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడమంటే రాజ్యాంగ వ్యవస్థలపై దాడి చేసినట్లేనని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఇసిపై ఆరోపణలు భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాలపై దాడి చేయడమేనని అభిప్రాయ పడ్డారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ రాయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ జడ్జిలు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు. ప్రజాస్వామ్యం, దాని పునాదులపై దాడి జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారన్నారు.


## సంక్షిప్తంగా..

### అన్మోల్ బిష్ణోయ్‌ని అరెస్టు చేసిన ఎన్ఐఎ



**న్యూఢిల్లీ, నవంబరు 19:** కరడు గట్టిన నేరస్థుడు లారెన్స్ బిష్ణోయ్ సోదరుడైన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఎన్ఐఎ అరెస్ట్ చేసింది. అమెరికాలో ఉంటున్న అన్మోల్‌ను అక్కడి అధికారులు భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో అతడిని నేడు భారత్‌కు తీసుకొచ్చారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్‌కాగానే ఎన్ఐఏ అతడిని అరెస్ట్ చేసింది. అరెస్టుకు సంబంధించిన ఫార్మాలిటీస్ అన్నింటినీ అక్కడికక్కడే పూర్తి చేసి అదుపులోకి తీసుకుంది. అతడిని హై సెక్యూరిటీ మధ్య అక్కడి నుంచి తీసుకెళ్లింది. అన్మోల్ బిష్ణోయ్‌ని అలియాస్ భానుగా పిలుస్తారు. అనేక కేసుల్లో అన్మోల్ బిష్ణోయ్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. పంజాబీ సింగర్ సిద్ధూ మోసేవాల్ హత్య కేసులో అన్మోల్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అతడిపై మొత్తం 18 కేసులు నమోదు అయ్యాయి.

### సబర్మతి జైలులో ఢిల్లీ పేలుళ్ల ఉగ్రవాదిపై తోటి ఖైదీల దాడి



**అహ్మదాబాద్, నవంబరు 19:** ఆముదం గింజల నుంచి అత్యంత ప్రమాదకర విషం (రైసిన్) తయారు చేసి అమాయకుల ప్రాణాలు తీయాలని చూసిన ఉగ్రవాది అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్ పై జైలులో దాడి జరిగింది. అహ్మద్ ను యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించిన విషయం విదితమే. ప్రస్తుతం అతడు గుజరాత్ లోని సబర్మతి జైలులో హైసెక్యూరిటీ బ్యారక్ లో ఉన్నాడు. అయితే, ఏం జరిగిందనే విషయంపై పూర్తి సమాచారం లేనప్పటికీ అహ్మద్ పై తోటి ఖైదీలు దాడి చేసి తీవ్రంగా కొట్టారని తెలుస్తోంది. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నామని, ఖైదీలు ఎందుకు దాడి చేశారనే విషయంపై ఆరా తీస్తున్నట్లు జైలు అధికారులు తెలిపారు. ఖైదీలు మూకుమ్మడిగా దాడి చేయడంతో అహ్మద్‌ను కాపాడేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

### బిఎండబ్ల్యు కారు ఢీకొని భారత సంతతి గర్భిణి మృతి




**సిడ్నీ,నవంబరు 19:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అదుపుతప్పిన ఓ కారు ఢీ కొట్టడంతో భారత సంతతికి చెందిన 8 నెలల గర్భిణి మరణించింది. భర్తతో కలిసి వాకింగ్ చేస్తున్న సమయంలో కారు ఢీ కొట్టడంతో ఈ ఘోరం జరిగింది. భారత సంతతికి చెందిన సమన్విత ధరేశ్వర్ సిడ్నీలోని ఓ ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీలో సిస్టమ్ అనలిస్ట్ గా పనిచేస్తున్నారు. భర్త, మూడేళ్ల బాబుతో పాటు సిడ్నీలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భవతి. ఈ క్రమంలోనే కిందటి వారం భర్త, కొడుకుతో కలిసి సమన్విత వాకింగ్ కు వెళ్లారు. ఆ సమయంలో ఓ బీఎండబ్ల్యూ కారు అతివేగంగా దూసుకొచ్చింది. అదుపుతప్పి పార్కింగ్ లాట్ లోని మరో కారును ఢీ కొట్టింది. దీంతో ఆ కారు కదిలి ముందున్న సమన్వితను బలంగా తాకింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సమన్వితను వెంటనే దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది.

### వైట్‌హౌస్‌లో ట్రంప్ విందు - మస్క్ హాజరు



**వాషింగ్టన్, నవంబరు 19:** ట్రంప్- మస్క్‌ల మధ్య విభేదాలు తలెత్తడంతో దూరంగా ఉంటున్నారు. అయితే, ఈ గొడవల తర్వాత తొలిసారిగా ఎలాన్ మస్క్ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టడం రాజకీయ, వ్యాపార వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా పర్యటనకు వచ్చిన వేళ, ఆయన గౌరవార్థం అధ్యక్షుడు ట్రంప్ వైట్‌హౌస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ట్రంప్ ఆహ్వానం మేరకు ఎలాన్ మస్క్ ఈ విందులో పాల్గొన్నారు. మస్క్‌తో పాటు పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు కూడా హాజరయ్యారు. ప్రభుత్వ విధానాలపై విభేదించి సలహా మండలి నుంచి వైదొలిగిన మస్క్, ఇప్పుడు మళ్లీమస్క్ విందులో పాల్గొన్నారు.



# చంద్రబాబు 'తిరుగులేని శక్తి'

- ఆనంద్ మహీంద్రా ప్రశంసిస్తూ ట్వీట్
- త్వరలో మిమ్మల్ని ఎపికి ఆహ్వానిస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు రీట్వీట్

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మహీంద్రా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దృక్పథాన్ని, విధానాలను ప్రశంసించిన అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో చంద్రబాబు రాష్ట్రంలో పెట్టుబడులకు సులభతరమైన వాతావరణం కల్పించేందుకు "ఎస్క్రో సిస్టమ్"ను ప్రవేశపెడతామని ప్రకటించారు. రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకుని, ప్రతి పెట్టుబడిదారుకు హామీ ఇచ్చిన ఇన్సెంటివ్స్‌ను తక్షణమే చెల్లించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ వీడియోను ఎక్స్‌లో పంచుకున్న మహీంద్రా చంద్రబాబును ప్రశంసించారు. "ఈ మనిషి తిరుగులేని శక్తి.. దశాబ్దాలుగా ఆయన అభివృద్ధి విధానాలకు అకర్షితుడ్ని అవుతున్నారు. కొత్త, ముందుకు తీసుకెళ్లే విధానాలు మాత్రమే కాకుండా, తాను, తన చుట్టూ ఉన్నవారందరి ప్రమాణాలను ఎప్పుడూ పెంచుతూ ఉంటారు" అని ప్రశంసించారు. ఈ పోస్టు వైరల్ అయింది. మహీంద్రా గ్రూప్ చైర్మన్‌గా, భారతదేశీయ పారిశ్రామిక రంగంలో ప్రభావవంతమైన వ్యక్తిగా ఆయన అభిప్రాయాలు ఎప్పుడూ చర్చనీయాంశాలు ఉంటాయి. ఆనంద్ మహీంద్రా ప్రశంసలపై చంద్రబాబు స్పందించారు. భారతదేశం అద్భుతమైన వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని నేను గట్టిగా నమ్ముతున్నాననని.. మన బాధ్యత నిరంతరం నూతన ఆవిష్కరణలు చేయడమన్నారు. ప్రజల విస్తారమైన వ్యవస్థాపక శక్తిని అన్‌లాక్ చేయడానికి కొత్త మార్గాలను సృష్టించాల్సి ఉందన్నారు. తాను ఈ ప్రయత్నంలో తన వంతు పాత్ర పోషిస్తున్నాననని చంద్రబాబు తెలిపారు. గత కొన్ని దశాబ్దాలుగా మీ మద్దతు మరియు భాగస్వామ్యం అమూల్యమైనవి. త్వరలో మిమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌కు స్వాగతించడానికి తాను ఎదురు చూస్తున్నాననని.. పెట్టుబడుల విషయంలో తగ్గేది లేదని హింట్ ఇచ్చారు.

# రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

- సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే పెట్టుబడులు
- దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలి
- నారా భువనేశ్వరి

కుప్పం, నవంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరుగుతున్న రాష్ట్రాభివృద్ధిని ఎవరూ ఆపలేరని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా బుధవారం ద్రవిడ వర్సిటీలో విద్యార్థులను ఉద్దేశించి నారా భువనేశ్వరి ప్రసంగించారు. ఎపి రాష్ట్రం సన్‌రైజ్ రాష్ట్రం అన్నారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ తన బాధ్యతలను నెరవేర్చుతున్నారన్నారు. సిఎం చంద్రబాబు ఒక విజన్‌తో రాష్ట్ర అభివృద్ధికి పనిచేస్తున్నారన్నారు. పారిశ్రామికవేత్తలతో కూడా సిఎం చంద్రబాబు మాకోసం కాదు, రాష్ట్రం కోసం రావాలని కోరుతున్నారని పేర్కొన్నారు.



ఇటీవల జరిగిన సిఐఐ సదస్సులో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు, 16లక్షల ఉద్యోగాలకు అవకాశం రావడం జరిగిందన్నారు. మంత్రి లోకేష్ రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో వైజాగ్‌కు గూగుల్ సంస్థను తెచ్చారన్నారు. ఇప్పటికే వైజాగ్‌లో టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయన్నారు. మిట్టల్ గ్రూప్ సైతం రూ.1.40లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రూ.9400 కోట్లతో నెల్లూరులో బిపిసిఎల్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. కుప్పంలో సైతం ఇటీవలే రూ.2203 కోట్లతో ఏడు పరిశ్రమలు, 23,330 ఉద్యోగాలకు సంబంధించి సిఎం శంకుస్థాపన చేసిన విషయం గుర్తుచేశారు. దేశ భవిష్యత్తుకు యువత చేయి చేయి కలపాలని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

### 2029లోగా అమరావతి నగరం పూర్తి

రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణం 2029లో పూర్తవుతుందని సిఎం సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ 2026లో, పోలవరం ప్రాజెక్టు 2027నాటికల్లా పూర్తవుతాయన్నారు. యువత దేశ భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. మనమంతా భారతీయులం అనే విషయం మరువరాదన్నారు. ద్రవిడ వర్సిటీని దివంగత ఎన్టీఆర్ స్థాపించారని ఈ విశ్వవిద్యాలయాన్ని యూనిక్ వర్సిటీగా చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారు అడిగిన ప్రశ్నలకు నారా భువనేశ్వరి సమాధానం ఇచ్చారు. అంతకుముందు వర్సిటీలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య ఎం. దొరస్వామి, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, రెస్కో చైర్మన్ ప్రతాప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**- మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్**

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికార యంత్రాంగం దృష్టిలో పెట్టుకోవాలని, అందుకు తగ్గట్టుగా సంక్షేమ ప్రణాళికలు ముందుకు తీసుకెళ్లాలని ఆ శాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్ సూచించారు. రాష్ట్ర సచివాలయంలోని మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధికి రుణాలు తదితర కార్యక్రమాల అమలుపై అధికారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా చేపట్టిన పనుల పురోగతిని, వివిధ భవన నిర్మాణ పనుల పూర్తికి నిధుల వినియోగం, ప్రధాన మంత్రి విరాసత్‌క సంవర్ధన్ (పిఎం వికాస్), ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పిఎంజెవికె), జాతీయ మైనార్టీల అభివృద్ధి ఆర్థిక సంస్థ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం, హజ్‌యాత్ర (2026)కు తీసుకుంటున్న ముందస్తు చర్యలు గురించి అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సిఇఒ మహ్మద్ అలీ, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎ.శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుపై వైఎస్సార్సీ ఫేక్ ప్రచారం: మంత్రి సుభాష్

సచివాలయం, నవంబరు 19 ప్రభాతవార్త: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు కూడా బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడాన్ని వైసీపీ వక్రీకరించి ఫేక్ ప్రచారం చేస్తుందని రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవ చేశారు. "గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లుగా" విశాఖ పరిరక్షణకు ఎవరేం చేశారని ముఖ్యమంత్రి చెప్పడాన్ని జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తు కార్మికులను రెచ్చగొడుతుందని ఆయన విమర్శించారు. వైసీపీ 5ఏళ్ళ పాలనలో విశాఖ ఉక్కును తుక్కు కింద పోస్కోకి అమ్మేందుకు విశ్వప్రయత్నాలు చేసిన సంగతి మరచి కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడడం సిగ్గు అని పించడం లేదాని మంత్రి సుభాష్ వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాకనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్రంతో ప్రకటన చేయించడమే కాక ప్లాంట్ పరిరక్షణకు 12 వేల కోట్ల ప్యాకేజి సాధించిన విషయం గుర్తు చేసుకోవాలని వైసీపీకి సూచించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మరో 2600 కోట్లు ఇచ్చిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రజాధనం వృధా కాకుండా కార్మికులందరూ బాధ్యతగా పనిచేయాలని సిఎం చంద్రబాబు చెప్తే దాన్ని వక్రీకరించి జగన్ అండ్ కో ఫేక్ ప్రచారం చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఆక్షేపించారు. వైసీపీ పాలనలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 20శాతం కాగా నేటి కూటమి ప్రభుత్వంలో అది 79శాతానికి పెరిగిందని కార్మికశాఖ మంత్రి వెల్లడించారు. అప్పట్లో ఒకటి బ్లాస్ట్ ఫర్నేస్ పనిచేయగా ఇప్పుడు మూడు పని చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చి లాభాల బాట పట్టించి ఉద్యోగులు కార్మికులకు అండగా నిలిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రగతికి అడ్డుపడే రాజకీయ అజ్ఞానులు,మంద బుద్ధిగల వారే చంద్రబాబు వ్యాఖ్యాలను వక్రీకరిస్తున్నారంటూ ఆయన వైసీపీపై మండిపడ్డారు.ప్రతి ఒక్కరూ కష్టపడితేనే సంస్థలకైనా, వ్యక్తులకైనా మంచి భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు చెప్పడం తప్పు ఎలా అవుతుందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ డిమాండ్ చేశారు.

# శివనామస్మరణతో హోరెత్తిన శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: హర హర మహాదేవా అంటూ భక్తులు కీర్తిస్తుండగా ఆలయ అర్చకులు భక్తి భావంతో గంగమ్మ తల్లికి హారతులిచ్చారు. నిండుకుండలా స్వర్ణముఖి నదీ ప్రవహిస్తుండగా కార్తీక మాసం అమావాస్య సందర్భంగా గంగా హారతులతో పునీతమైంది. శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున కార్తీక మాసం అమావాస్య పవిత్ర దినమైన బుధవారం రాత్రి 'స్వర్ణముఖి హారతులు' ఏర్పాటు చేశారు. గంగమ్మఅమ్మవారు, మరో వైపు సోమాస్కంద మూర్తి అయిన శివయ్యలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేసి జలవినాయక ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. నభూతో అన్నట్లు హారతుల్ని నిర్వహించారు. స్వర్ణముఖి అందాల్ని హారతుల్ని తిలకించటానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు, ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చారు. స్వర్ణముఖి తీరం భక్త జనులతో కిటకిట లాడింది. శివనామస్మరణతో దద్దరిలింది. హారతులతో పునీతమైంది. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, సభ్యులు పగడాల మురళి, లక్ష్మమ్మ, దండి రాఘవయ్య, గాదిపాకుల గోపి, వాకచర్ల గుప్రశెట్టి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు రాజేష్ గురుకుల్, కమల్, నిరంజన్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణముఖి నదిలో గంగమ్మకు హారతులిస్తున్న దృశ్యం

# పుత్తూరులో ఒకరి దారుణ హత్య



పుత్తూరు, నవంబరు 19 ప్రభాతవార్త: అన్నం తినడానికి డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన తిరుపతి జిల్లా పుత్తూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. రవి (35) అనే వ్యక్తి రామ్మూర్తిరెడ్డి (55)ని భోజనం కోసం డబ్బులడిగాడు. డబ్బులివ్వకపోగా తనను తిట్టడంతో ఆ కోపంలో కత్తితో పొడిచి చంపానని నిందితుడు రవి పోలీస్ విచారణలో తెలిపాడు. మిట్టపల్లూరుకు చెందిన రామ్మూర్తిరెడ్డి (55) పుత్తూరు పట్టణంలో నివశిస్తూ విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు తాలూకాలో కేశవరాజకుప్పం గ్రామానికి చెందిన రవి కొన్నాళ్లుగా పుత్తూరులో బికారిగా తిరుగుతున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఆధార్ కార్డు కూడా లేదు. రోడ్లపై ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో రామ్మూర్తి రెడ్డి బుధవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై గొల్లపల్లిలో సమీపంలోని ఒక దాబాలో రోటీలు కొనుక్కొని తిరిగి ద్విచక్ర వాహనంపై పుత్తూరుకు వెళుతున్నాడు. సరిగ్గా గొల్లపల్లి క్రాస్, రిలయన్స్ పెట్రోలు బంక్ దగ్గర రామ్మూర్తిరెడ్డి వాహనాన్ని నిలిపి భోజనానికి డబ్బులివ్వాలని రవి అడిగాడు. డబ్బులివ్వకుండా ఏ ఊరు నుంచి వచ్చావు, ఇక్కడ ఏం పనిచేస్తున్నావని రామ్మూర్తి రెడ్డి కొంచెం గట్టిగా అడగడంతో ఇద్దరి మధ్య వాగ్యుద్ధం జరిగింది. దాంతో రవి తన దగ్గరున్న చాకుతో రామ్మూర్తి రెడ్డిని పొడిచాడు. దీంతో రామ్మూర్తి రెడ్డి కుప్పకూలిపోయాడు. స్థానికులు అతనిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. రామ్మూర్తిరెడ్డికి వివాహమైంది. పిల్లలు లేరు. ఇదిలా వుండగా వారం రోజుల క్రితం ద్రౌపదిదేవి గుడి వద్ద ఒక సెల్ ఫోన్ దొంగిలిస్తూ దొరికిపోయిన రవిని అక్కడే ఇనుప పైప్‌లకు కట్టి స్థానికులు కొట్టారు. ఆ సంఘటనపై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. హత్య కేసును సిఐ శేఖర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# నవోదయ విద్యార్థిని ఆత్మహత్య



మర్రిపాడు (నెల్లూరు), నవంబరు 19, ప్రభాత వార్త: నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నవోదయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రణీత (14) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని విద్యాలయ ప్రిన్స్‌పాల్ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ప్రణీతను మొదటగా ఆయమ్మ చూసి ప్రిన్స్‌పాల్‌కు చెప్పడంతో ఆమె విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం తెలిపారు. వారు హుటాహుటిన విద్యాలయం చేరుకోగా విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తెను చూసి బోరుమన్నారు. బాలిక తండ్రి కొండాపురం ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ నవోదయ విద్యాలయంలో బాలికను చదివిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అందనంత ఎత్తులో ఉన్న ఫ్యాన్‌కు వైరు బిగించి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై విద్యార్థిని తండ్రి, కొండాపురం ఎంఇఒ రవికుమార్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తన కుమార్తె ఇటువంటి పనులకు పాల్పడే వ్యక్తి కాదని, చదువులోను, క్రీడల్లోను బాగా రాణిస్తుందని ఐపిఎస్ చదవాలనే లక్ష్యంతో తాను కష్టపడి చదువుకుంటుందన్నారు. విద్యాలయంలో అసలేం జరిగిందో తెలియాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు నవోదయ విద్యాలయం లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులకు ఆంధ్ర విద్యార్థి సంఘం, పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

# భోళాశంకరునికి అష్టోత్తర కలశాభిషేకం

**లక్షబిల్వార్చన, కుంకుమార్చనలు ముగింపు**

శ్రీకాళహస్తి, నవంబరు 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన స్వామి వారికి కోటి బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆలయ సంప్రదాయం మేరకు అష్టోత్తర శత శంఖాభిషేకం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన 'లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు' ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయంలో భారీ ఎత్తున పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆర్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారధ్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితుల వేద మంత్రాలతో ఆలయం దద్దరిల్లింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే లక్ష బిల్వార్చన, కుంకుమార్చనల్లో భాగంగా ముగింపు సందర్భంగా స్వామి గర్భగుడి ఎదురుగా స్వామి అమ్మవార్ల కలశాలను ఏర్పాటు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకంకు 108 కలశాలను ఏర్పాటు చేశారు. పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన కలశాలను ప్రదక్షిణ జరిపారు. ఆ జలాలతో అభిషేకించారు. స్వామి అమ్మవార్ల గర్భగుడుల వద్ద కుంభం (తిరుప్పావడ) నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ధూప దీప నైవేద్యం హారతులు, మంత్రపుష్పం నిర్వహించారు. పది రోజుల పాటు నిర్వహించిన లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలలో వాడిన పత్రి కుంకుమలను భక్తి శ్రద్దలతో సన్నిధి వీధి గుండా ఊరేగింపుగా తీసుకెళ్ళి పవిత్ర జీవనది స్వర్ణముఖి నదిలో నిమజ్జనం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాథ్ వారి కుటుంబసభ్యులు, ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి, డిప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు పాల్గొని సంకల్పం చేశారు. ఏర్పాట్లను ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుదదర్శనం నాయుడు, వెంకటస్వామి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, అనువంశిక ప్రధానార్చకులు డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్, డాక్టర్ స్వామి నాధన్, అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, అచ్చితా గురుకకుల్, సురేష్ గురుకుల్, నిరంజన్ గురుకుల్ వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుల ముఠా అరెస్టు

- 8 మంది నిందితులు కటకటాల్లోకి
- తిరుపతి జిల్లా ఎస్పీ



తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: డిజిటల్ అరెస్ట్ ముసుగులో అమాయకులను మోసం చేస్తున్న అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తులను తిరుపతి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. 8మంది నిందితులను అరెస్ట్ చేసి ఇద్దరి జాయింట్ అకౌంట్‌లోని నగదును ఫ్రీజ్ చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. తిరుపతి నగరానికి చెందిన 65ఏళ్ళ సీనియర్ సిటిజన్‌ను లక్ష్యంగా చేసుకుని తెలియని వ్యక్తులు వాట్సాప్‌కాల్ చేసి ముంబై సిబిఐ అధికారులుగా పరిచయం చేసుకున్నారు. 583 కోట్ల రూపాయలు మనీలాండరింగ్ కేసులో అతని పేరు ఉందని చెప్పి భయపెట్టారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా విచారణ చేస్తామని నమ్మించి అతని బ్యాంక్ అకౌంట్ నుండి వివిధ ఖాతాలకు డబ్బు పంపాలని ఒత్తిడిచేసి మోసం చేశారు. ఇలా బాధితుడి నుండి ఏకంగా రూ.80 లక్షలు వివిధ రాష్ట్రాల్లోని మ్యూట్ ఖాతాల్లో జమ చేయించుకున్నారు. బాధితుడు ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సిఐలు శ్రీనివాసులు, వినోద్‌కుమార్ బృందం దర్యాప్తుచేసింది. బాధితుడి ఖాతా నుండి ముందుగా రెండు మ్యూట్ అకౌంట్లకు అక్కడ నుండి 14 ఇతర రాష్ట్రాల్లోని ఇతర ఖాతాలకు, చివరకు గేమింగ్‌యాప్ వినియోగదారుల ఖాతాలకు నిధులు చేరినట్లు కనుగొన్నారు. ప్రధాన నిందితుడు కోటిబాబు టెలిగ్రామ్ ద్వారా హర్యానాలోని డానియల్, చైనాకు చెందిన టియాన్ ఇంకా డి పేర్లతో ఉన్న విదేశీ నెట్‌వర్కుతో సంబంధాలున్నట్లు తెలిసింది. 2024 జనవరిలో కోటిబాబు కంబోడియాకు వెళ్ళి 24రోజులు అక్కడ సైబర్‌మోసగాళ్ళ నెట్‌వర్కుతో కలసి పనిచేశాడు. తిరిగి వచ్చిన అతను శ్రీనివాస్, చంద్రశేఖర్, ప్రశాంతిరెడ్డి, గౌతమ్ వంటి వ్యక్తుల ద్వారా భారీ సంఖ్యలో మ్యూట్ అకౌంట్ ఖాతాలను సేకరించినట్లు నిర్ధారించారు. ముద్దాయిల బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.2.5లక్షల నగదును ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ముద్దాయిల్లో అనంతపురం జిల్లాకు చెందిన దండే క్రాంతికుమార్, నిమ్మల పవన్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన మానే కోటిబాబు, రాజమండ్రి ప్రాంతానికి చెందిన పరసాల శ్రీనివాస్, బళ్లారి జిల్లాకు చెందిన మరకట్టు చంద్రశేఖర్‌రెడ్డి, కె.శివశంకర్, ప్రశాంత్‌రెడ్డి, గౌతమ్ ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి. డిఎస్పీ భక్తవత్సలం, సిఐలు వినోద్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.

# విద్యుత్తు చార్జీల్లో రూ.12,717 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులపై రూ.12,717 కోట్ల ట్రూఅప్ భారాలు వేయాలన్న ప్రతిపాదన తిరస్కరించాలని ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని కోరారు. నాలుగో నియంత్రిత ఐదేళ్ళలో (2019-20 నుంచి 2023-24) ఫీలింగ్, రిటైల్ విద్యుత్ విక్రయాలకు విద్యుత్ సంస్థలు చేసిన ఖర్చు వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తానికి మధ్య వ్యత్యాసాన్ని ట్రూఅప్ కింద వసూలుకు అనుమతించాలని డిస్కంలు ఏపీఈఆర్‌సీలో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కమీషన్ ఇన్‌ఛార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు హాజరై, ట్రూఅప్ కింద డిస్కంలు చేసిన ప్రతిపాదన తిరస్కరించాలని కోరారు. 'వైకాపా ప్రభుత్వం ఐదేళ్ళలో రూ.32 వేల కోట్లు ట్రూఅప్ భారాలు వేసింది. అదే బాటలో కూటమి ప్రభుత్వం వెళ్తోంది. ట్రూడౌన్ పేరుతో రూ.923 కోట్లు ప్రజలకు ఇచ్చి... రూ.12,717 కోట్ల భారం వేయడం భావ్యమేనా? ఇప్పటికే రూ.15,845 కోట్ల అదనపు భారాలు ప్రజలు భరిస్తున్నారు' అని బాబూరావు పేర్కొన్నారు. ఇంధన సర్దుబాటు ఛార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) నిర్ధేశించే విధానంలో లోపాలున్నాయని, ఈ నేపథ్యంలో ఎఫ్‌పీపీసీఏ పూర్తిగా తొలగించాలని విద్యుత్‌రంగ నిపుణులు వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక తరపున ఆంజనేయులు, సిమెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తరపున గోపీనాథ్, ఫ్యాప్సీ తరపున వైదేహి, ఏపీ ఫెర్రో అల్లాయిస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ తరపున విజయగోపాల్‌రెడ్డి వర్చువల్‌గా హాజరై ట్రూఅప్ ప్రతిపాదన ఉపసంహరించాలని కోరారు.

# నెల్లూరులో పంచలోహ కృష్ణుని విగ్రహం చోరీ

**గంటల వ్యవధిలో నిందితుడి అరెస్ట్, విగ్రహం స్వాధీనం**

**ప్రశంసలందుకున్న సంతపేట పోలీసులు**

నెల్లూరు క్రైమ్, నవంబరు 19 ప్రభాతవార్త: పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగుడు అపహరించుకుని వెళ్లారు. ఫిర్యాదు అందుకున్న సంతపేట పోలీసులు గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి సంతపేట పోలీసు స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.వి సోమయ్య వివరాలను వెల్లడించారు. కామాటివీధిలో సంతాన బాలగోపాల కృష్ణమందిరం ఉంది. వాచ్‌మెన్ అంకయ్య రోజులాగానే బుధవారం ఉదయం ఆలయం గేట్లు తెరచి పనులు చేసుకుంటుండగా గుర్తుతెలియని దుండగుడు లోనికి ప్రవేశించి గర్భగుడిలోని పంచలోహ కృష్ణుని ఉత్సవ విగ్రహం, ఇత్తడి గంటను అపహరించుకుని వెళ్లారు. అర్చన చేసేందుకు ఆలయంకు వచ్చిన పూజారి రఘునందన్ ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ సీహెచ్ భాస్కర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. దీంతో భాస్కర్ చోరీ ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సోమయ్య కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్‌లు ఆధారంగా నిందితుడు నార్త్ రాజుపాలెంకు చెందిన పాత నేరస్థుడు వెంకయ్యగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.



నిందితుడిని విచారించగా కోటమిట్టకు చెందిన షేక్ షఫికి విగ్రహం విక్రయించినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు షఫిని అదుపులోకి తీసుకుని చోరి సొత్తు స్వాధీనం చేసుకుని నిందితులిద్దరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.లక్ష వరకు ఉంటుంది. వెంకయ్యపై చీరాల రైల్వే పోలీసుస్టేషన్‌లో, ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో దొంగతనం కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సంతపేట సిఐ వైవి సోమయ్య ఇతర సిబ్బందిని టౌన్ ఇన్చార్జి డిఎస్పి గిరిధర్, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావులు అభినందించారు.

# రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తాం


● ధాన్యం సేకరించిన గంటలలోనే రైతుల ఖాతాలో సొమ్ము జమ ● ముదినేపల్లిలో మంత్రి నాదెండ్ల మనోహర్

ముదినేపల్లి/ ఏలూరు, నవంబరు 19 ప్రభాత వార్త: తమది రైతు ప్రభుత్వమని విత్తనం నుండి విక్రయం వరకు అన్ని విధాలా రైతు వెన్నంటి ఉండి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫ రాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ముదినేపల్లిలో పచ్చని పొలాల మధ్య పండగ వాతావరణంలో బుధ వారం జరిగిన అన్నదాతా సుఖీభవ.. పీఎం కిసాన్ పథకం రెండవ విడత కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి నమూనా చెక్కును మంత్రి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లా డుతూ ఏలూరు జిల్లాలో అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకం రెండవ విడతలో 1,60,968 మంది రైతుల ఖాతాలకు రూ. 106.23 కోట్లు జమచేశామన్నారు. అన్నదాతా సుఖీభవ, పిఎం కిసాన్ పథకంలో సంవత్సరానికి రూ.20 వేలు మూడు విడతలుగా అందించడం జరుగుతుందని, దీనిలో రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, 6 వేలు కేంద్ర ప్రభు త్వం అందిస్తుందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా చేసేందుకు ఉద్యానవన పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టాలను కేంద్ర బృందం పరిశీలించింది, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు వాట్సాప్ ద్వారా తమ దగ్గరలోని రైస్ మిల్లులు తెలుసుకోవడం, రైతుకు అనువైన మిల్లులో అమ్మడం వంటి వెసులుబాటు కల్పించామన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లల్లో రాష్ట్రంలోని 4 వేల రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు 16 వేల మందిని సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. గత వ్యవసాయ సీజన్లో రైతులకు 50 వేల టార్పాలిన్లు 50 శాతం సబ్సిడీపై అందించామని, ప్రస్తుతం రైతులకు పూర్తి సబ్సిడీతో టార్పాలిన్లు అందిస్తున్నామని, వీటిలో కౌలు రైతులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగానే తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాష, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మూర్తి, ఉద్యానవన శాఖాధికారి షాజా నాయక్, రైతు సంఘాల నాయకులు, ప్రభృతులు పాల్గొన్నారు.




# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: ఆత్మకూరులో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.సత్యవతి అధ్యక్షతన జిల్లాస్థాయి అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్2025-26 సంవత్సరానికి సంబంధించి 2వ విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో బుధ వారం స్థానిక శ్రీధర్‌గార్డెన్స్ కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డినమాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 46.22లక్షల మంది రైతులకు 3,077 కోట్లు రూపాయలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జమచేశారని, జిల్లా స్థాయిలో 1,95,866మంది రైతులకు రూ.130.20 కోట్లు, ఆత్మకూరు నియోజకవర్గంలో 34,223 మంది రైతులకు రూ.22.95 కోట్లు మంది లబ్ధిపొందారన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని రైతులకు అన్ని విధాల అండగా ఉంటూ ఎన్నికల హామీ మేరకు 2వ విడత కూడా అన్నదాత సుఖీభవ నిధులను సిఎం జమ చేశారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడుకు మనమందరం తోడుగా ఉండాలన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్, ఆత్మకూరులో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఎంపి వేమిరెడ్డితో కలిసి కృషి చేస్తానన్నారు. ఈరెండు ప్రధాన సమస్యలపై సిఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని సిఎం దృష్టికి తెసుకెళ్ళి వీటి సాధనకు కృషి చేస్తామన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తయితే మర్రిపాడు వరకు సోమశిల జలాలతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఈ కాలువ ద్వారా 90వేల మంది జనాభాకు తాగునీరు, 65వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలను సిఎం చంద్రబాబు నాయుడు సమర్ధవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఒక్కో రైతుకు 7వేలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి ముందుకు నడిపిస్తున్నారన్నారు. తొలుత అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సంక్షేమంలో ఎపి నంబర్ వన్

తోటపల్లి గూడూరు (నెల్లూరు), నవంబరు 19 ప్రభాతవార్త: సర్వేపల్లి నియోజకవర్గం తోటపల్లి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో కేంద్రం రూ.2 వేలు, రాష్ట్రం రూ.5 వేలు గా రైతుల ఖాతాల్లోకి రూ. 3135 కోట్లు జమవుతున్నాయని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ. 19.57 కోట్లు అందుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తోందని, గత ప్రభుత్వంలో మూడు విడతల్లో ఇచ్చిన రూ.13,500 కంటే ఎక్కువగా రెండు విడతల్లోనే రూ.14 వేలు ఇచ్చామని గుర్తు చేశారు. మరో రూ.6 వేలను మూడో విడతలో ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో మునుపటి ప్రభుత్వంతో పోల్చితే కూటమి పాలనలో నాలుగేళ్లకు అదనంగా రూ.12,088 కోట్లు రైతులకు అందుతాయని పేర్కొన్నారు. సంక్షేమంలో ఏపీ దేశంలో అగ్రగామి వృద్ధులు, వితంతువులకు ఇవ్వబడుతున్న రూ.4 వేల పింఛన్ దేశంలో ఎక్కడా లేదని, ఎన్టీఆర్ భరోసా కింద ఏపీ ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాన్ని ప్రతి బిడ్డకు విస్తరించడం వంటి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ హైలైట్స్‌గా పేర్కొన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు అసత్యాలని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సోమిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజధాని రైతులతో ప్రతినెలా సమావేశం

● సిఆర్‌డిఏ కమిషనర్ కె.కన్నబాబు

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతి రాజధాని పరిధిలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రతినెలా మూడో శనివారం రైతుల జెఏసితో సమావేశం నిర్వహిస్తామని సీఆర్డీఏ కమిషనర్ కె,కన్నబాబు తెలిపారు. రాజధాని సమగ్ర ప్లాను అమలు, నోటిపై చేసిన డ్రాఫ్ట్ ప్లాను, గైడ్‌లైన్స్ అంశాలను వివరించేందుకు సిఆర్‌డిఏ కార్యాలయంలో రైతు ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమరావతి బ్లూప్లాను, రోడ్లు, కాలువలు, రిజర్వాయర్లు, రోడ్ల వెంట గ్రీనరీ, నడక, సైకిల ట్రాక్, విద్యుత్ లైన్లు, మంచినీటి పైపులైన్లు వంటివి ఎలా ఉంటాయి. వాటిని ఎలా వినియోగిస్తామనే అంశాలను అధికారులు, కమిషనర్ రైతులకు వివరించారు. అనంతరం రైతులు జెఏసి తరుపున సమర్పించిన 14 డిమాండ్లను లేవనెత్తారు. గ్రామ కంతాలు, అబ్బురాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 150 ఎకరాలకు సంబంధించిన జరీబు భూముల అంశంతోపాటు ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్(ఎఫ్‌ఎస్‌ఐ) పెంపుదల అంశాలను ప్రస్తావించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ కొన్నిటిని పరిష్కరించామని, గ్రామ కంతాలు, జరీబు భూముల అంశాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ త్రీమెన్ కమిటీ ఇటీవల దీనిపై సమావేశం అయిందని, కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈనెల 21, 22 తేదీల్లో మరోసారి సమావేశం అవుతుందని, అప్పుడు కొన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆ సమావేశానికి అవసరమైతే జెఏసి ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. దీంతోపాటు ప్రతి నెలా మూడో శనివారం రైతుల జెఏసితో సమావేశం అవుతామని, అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని చెప్పారు. అయితే గ్రీవెన్స్ పెడుతున్నారని, రైతులు ఇచ్చిన వినతిపత్రాలు చెత్తబుట్టలో వేస్తున్నారని పట్టించుకోవడం లేదని జెఏసి సభ్యులు తెలిపారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, స్వయంగా తానే గ్రామాల్లోకి వచ్చి రైతుల వద్ద సమస్యలు తెలుసుకున్నాని, అటువంటప్పుడు పరిష్కారం చేయడానికి ఇబ్బందులు ఏమి ఉంటాయని ప్రశ్నించారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ప్రస్తుతం 2.8 ఇచ్చారని, దీన్ని 5కు పెంచాలని రైతులు కోరారు. కనీసం 3.5 అన్నా ఇవ్వాలని కోరారు. దీనికి కమిషనర్ కన్నబాబు మాట్లాడుతూ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పెంచితే ఇబ్బందులు పడతారని, బిల్డర్లతో సమస్యలు వస్తాయని తెలిపారు. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం తరువాత సమావేశంలో వివరిస్తానని అన్నారు. రాజధానిని గుర్తిస్తూ గెజిట్ ఇచ్చే అంశం ఇంతకాలం ఎందుకు పెండింగ్లో ఉందని రైతులు అడిగారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఇప్పటి వరకూ దేశంలో ఏ రాజధానికి గెజిట్ లేదని అమరావతికి అవసరం ఏముందని అన్నారు. హైదరాబాద్ నగరానికి కూడా గెజిట్ లేదని చెప్పారు. దీనిపై రైతులు మాట్లాడుతూ విభజన చట్టంలోనే హైదరాబాద్ పది సంవత్సరాలు రాజధానిగా ఉంటుందని పేర్కొన్నారని, అందువల్లే గెజిట్ అని అడిగామని తెలిపారు. ఇదే అంశంపై తాము కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళితే గెజిట్ ఇచ్చేందుకు అంగీకరించారని, అయితే న్యాయ విభాగం అధికారులు కొన్ని అభ్యంతరాలు లేవనెత్తారని తెలిపారు. వాటిని కూడా క్లియర్ చేస్తున్నామని, డిసెంబర్లో జరిగే పార్లమెంటు సమావేశాల్లో అమరావతికి సంబంధించిన బిల్లు పెట్టే అవకాశం ఉందని కమిషనర్ రైతులకు తెలిపారు. గ్రామాల్లో నుండి రోడ్లు వేసేందుకు తీసుకున్న ప్లానులో కొన్నిచోట్ల కొద్దిస్థలాన్ని వదిలేస్తున్నారని తెలిపారు. వాటిని దుకాణాలు నిర్మించుకుని వినియోగించుకునేలా ప్లాను చేస్తున్నామని కమిషనర్ రైతులకు తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఇచ్చిన ప్లాట్లకు సంబంధించి సరిహద్దు రాళ్లు కనిపించడం లేదని, ఆందోళనలో ఉన్నారని రైతులు తెలపగా పనులు జరుగుతున్న నేపథ్యంలో పగ్‌మార్కు చూపిస్తామని అక్కడ నుండి డెవలపర్ అభివృద్ధి చేసిన తరువాత రైతులకు ఇచ్చే సమయంలో రాళ్లు వేసి ఇస్తామని కమిషనర్ అన్నారు. ఇప్పుడు సరిహద్దు రాళ్లు పెట్టినా మెరకతోలాల్సి ఉంటుందని, అనంతరం కనిపించకుండా పోయే అవకాశం ఉన్న నేపథ్యంలో లేఅవుట్లు అభివృద్ధి తరువాత సరిహద్దు రాళ్లను పెట్టి ఇస్తామని కమిషనర్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ భార్గవతేజ హాజరయ్యారు.



# రైతులకు అండగా సహకార బ్యాంకులు నిలవాలి

బుచ్చి (నెల్లూరు), నవంబరు 19, ప్రభాతవార్త: సహకార బ్యాంకులు రైతులకు అండగా నిలవాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వవ్వేరు కో ఆపరేటివ్ బ్యాంకులో నిర్వహించిన 72వ అఖిలభారత సహకార వారోత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రంలో బుచ్చిరెడ్డిపాళెంలోని వవ్వేరు బ్యాంకు అగ్రస్థానంలో ఉందని ఆమె ప్రశంసించారు. గత ప్రభుత్వ పాలనలో వవ్వేరు బ్యాంకు నిర్వహణ అస్తవ్యస్తంగా మార్చి వేశారని. ప్రస్తుతం ఈ బ్యాంకు అభివృద్ధిని కాంక్షించి దొడ్ల విజయలక్ష్మిని బ్యాంకు చైర్మన్ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. వవ్వేరు బ్యాంకు 145 కోట్ల 27 లక్షలు టర్నవర్ సాధించడం అభినందనీయమని అన్నారు. ధాన్యం అరబెట్టుకునే కల్లాలు, నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు నష్టపోతున్నారని రైతుల ప్రయెజనాలను దృష్టిలో ఉంచుకొని కల్లాలు, గోదాములు నిర్మించేందుకు సహకార బ్యాంకులు ముందుకు రావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి గురప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, జిల్లా సహకార ఆడిటర్ అధికారి కాటసాని తిరుపతిరెడ్డి, విభాగేయ సహకార కోశాదికారి పోలిశెట్టి రాజశేఖర్, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, నగర అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, బ్యాంకు సిఇఒ మన్నారపు శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు చైర్మన్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు కోటంరెడ్డి లలితారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రేబాల నీటి సంఘం అధ్యక్షులు రమణారెడ్డి, అగ్రికల్చర్ ఏడి అనిత, నాయకులు వింజం రామానాయుడు,దొడ్ల కోదండరామిరెడ్డి, మైనార్టీ నాయకులు పఠాన్ మహబూబాషా, నారసింహారెడ్డి, బత్తల హరికృష్ణా, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు మొగళ్లూరు వెంకట శేషయ్య, బిజెపి నాయకులు చేవూరు వినయ్‌నారాయణ, కాసా శ్రీనివాసులు, రూరల్ బ్యాంకు డైరక్టర్ మాచవరం శ్రీనివాసులు, వవ్వేరు బ్యాంకు డైరక్టర్ మద్దిసాని మాల్యాద్రి, కోవూరు పద్మ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# పన్నుల రాబడి అదుర్స్

## అక్టోబరు నెలాఖరుకు

## రూ.82,983.17 కోట్లు



విజయవాడ, నవంబరు 19 పభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి అంచనాలకు అనుగుణంగా ఉంది. గడిచిన ఏడు నెలల్లో పన్నుల ద్వారా ఆదాయంగా ఆశించిన స్థాయిలోనే ఉండటమూ కాకుండా ఆ మొత్తంలో సగం మేర ఖజానా కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్ర పన్నుల రాబడి రూ.1,66,573.09 కోట్లుగా అంచనా వేశారు. అక్టోబరు నెలాఖరుకు రూ.82,983.17 కోట్ల వచ్చింది. ఏడు నెలల్లో సగం రాబడి సాధించింది. బడ్జెట్ అంచనాలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్ళలో 52.49%, అమ్మకపు పన్నులో 49.10%, కేంద్ర పన్నుల్లో వాటా 56% సాధించింది. మొత్తం మీద రాష్ట్ర రెవిన్యూ రాబడి రూ.91,638 కోట్లకు చేరింది. ఇది ఏడాది మొత్తం అంచనాల్లో 42.04%.

### అప్పులు రూ.67,283,53 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రూ.79,926.89 కోట్ల నికర అప్పు తీసుకుంటామని బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. ఏడు నెలల్లో రూ.67,289.53 కోట్ల నికర రుణం కాగ్ లెక్కల్లో చూపించారు. ఇందులో రూ.37,178.69 కోట్ల నికర ప్రజా రుణం, మరో రూ.30,104.83 కోట్ల నికర ప్రజా ఖాతా మొత్తాలు వినియోగించుకున్నట్లు వివరించారు.

### పన్నుల రాబడికి తోడు పన్నేతర రాబడి

కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్లు కలిపి మొత్తం కలిపి మొత్తం రూ.91,638.98 కోట్ల రెవిన్యూ రాబడి ఈ ఏడు నెలల్లో సాధించారు. అప్పులు తదితర మూలధన వసూళ్ళు కూడా కలిపి మీద ఏడు నెలల్లో రూ.1,58,960 కోట్లు ఖజానాకు చేరాయి.

### ఆస్తుల సృష్టికి రూ.13,942.50 కోట్లు

ఏడు నెలల్లో రాష్ట్రం ఆస్తుల సృష్టికి ఉపయోగపడే ఖర్చు రూ.13,942.50 కోట్లు చేసింది. ఇది బడ్జెట్ అంచనాల్లో దాదాపు 35% రెవిన్యూ ఖర్చులను రూ.1,39,444.97 కోట్లుగా పేర్కొంది. రెవిన్యూ రాబడితో పోలిస్తే ఖర్చు ఎక్కువగా ఉంది. రెవిన్యూ లోటు బడ్జెట్ అంచనాల్లో ఏడు నెలలకు 144.05% ఉంది. ఏడాది అంచనాలతో పోలిస్తే రెవిన్యూ లోటు ఇప్పటికే 44% అధికంగా ఉంది.

# విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు

## ఎపి ఖనిజ అభివృద్ధి సంస్థ ఆలోచన

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: విదేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు ఏపీ ఖనిజ అభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) ఆలోచన చేస్తున్నది. ఇందులో భాగంగా ఆఫ్రికన్ దేశాల్లో గనులు దక్కించుకోవాలనే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసింది. తద్వారా తవ్వకాలు చేసి సంస్థకు అదనపు రాబడి పెంచుకోవాలని భావిస్తోంది. సంస్థకు దశాబ్దాల తర బడి మంగంపేట ముగ్గురాయి తవ్వకాల్లో అనుభవం ఉంది. చీమకుర్తిలో గ్రానైట్ లీజులను కూడా నిర్వహిస్తోంది. కొంతకాలంగా మధ్యప్రదేశ్‌లోని సులియారీలో బొగ్గు గనుల్లో తవ్వకాలు ఆరంభించింది. ఈ అనుభవంతోనే విదేశాల్లో లీజులు తీసుకోవాలని భావిస్తోంది. మన రాష్ట్ర పరిధిలోని బొగ్గు గనులకు ప్రభుత్వ రంగ సంస్థ టెండర్లు వేసి, పోటీలో నిలవాలని సీఎం చంద్రబాబు ఇటీవల సూచించారు. దీంతో ఏలూరు జిల్లాలోని చింతలపూడి, సోమవరం బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు వేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. సోమవరం బ్లాక్‌లో సగటున జి13 రకం బొగ్గు లభిస్తుంది. ఇది 38.08 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. చింతలపూడి బ్లాక్‌లో సగటున జి12 రకం బొగ్గు లభిస్తుంది. బ్లాక్ 12.04 చదరపు కిలోమీటర్ల మేర ఉంది. సోమవరం, చింతలపూడి బొగ్గు బ్లాక్‌ల్లో భూగర్భ మైనింగ్ చేయాలని భావిస్తోంది. అలా చేస్తే గనక సంస్థకు గిట్టుబాటు కాదని కొందరు నిపుణులు అంటున్నారు. దీనికి బదులుగా ప్రత్యేక పద్ధతిలో భూమి లోపలి నుంచి మీథేన్ గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని సూచిస్తున్నారు. అయితే ఈ బ్లాక్‌లకు టెండర్లు దాఖలు చేసేందుకు డిసెంబరు 24 వరకు గడువు ఉంది. ఆ లోపు అధ్యయనం చేసి బిడ్లు వేసేందుకు ఏపీఎండీసీ సిద్ధమవుతుంది. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఇప్పటికే వివిధ దేశాల్లో మైనింగ్ కార్యకలాపాలు ఆరంభించింది. అదే విధంగా ఏపీఎండీసీ కూడా ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ఆఫ్రికాలో లభించే ఇనుప ఖనిజం, బొగ్గుతో పాటు పలు ముఖ్య ఖనిజాల గనులు తీసుకోవాలనుకుంటోంది. ఇందుకు ఏదైనా ప్రైవేటు సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టులు చేపట్టాలని చూస్తోంది. ఏ దేశాల్లో ఏ గనులు దక్కించుకుంటే రాబడి వచ్చే అవకాశం ఉందో అధ్యయనం చేయాలంటూ సలహా సంస్థ కేపీఎంజీని ఆదేశించింది. ఈ మేరకు కసరత్తు మొదలైంది. త్వరలో దీనిపై ముందడుగు పడే అవకాశం ఉందని ఏపీఎండీసీ వర్గాలు తెలిపాయి.

# 15మంది మావోలకు రిమాండ్

## రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలింపు

తాడేపల్లిగూడెం, నవంబరు 19 ప్రభాతవార్త: ఏలూరు గ్రీన్ సిటీలో పట్టుబడిన 15 మంది మావోయిస్టులకు జిల్లా కోర్టు 14రోజులు రిమాండ్ విధించింది. మావోయిస్టులను రాజమండ్రి సెంట్రల్ క్జెలుకు తరలించాలని ఆదేశించింది. విజయవాడలో పట్టుబడిన 24 మంది మావోయిస్టులకు కూడా కోర్టు రిమాండ్ విధించింది. మరో నలుగురు మావోయిస్టులకు వయో పరిమితి నిర్ధారించాలని కోర్టు ఆదేశించింది. తొలుత ఏలూరులో అరెస్టు చేసిన మావోయిస్టులను విజయవాడలో జరిగిన ప్రెస్ మీట్ కు పోలీసులు తరలించారు. అనంతరం మావోయిస్టులను విజయవాడ నుండి ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లోనే అరెస్ట్ అయిన మావోయిస్టులకు మెడికల్ టెస్టులు చేశారు. అనంతరం 15 మంది మావోయిస్టులను ఏలూరు జిల్లా కోర్టులో హాజరుపరిచారు.

# ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

విజయవాడ, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో నిన్న, ఈరోజు జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయని తెలిపారు. చట్ట విరుద్ధమైన భూటకపు ఎన్‌కౌంటర్లను సిపిఐ(యం) ఖండిస్తున్నదన్నారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికి పైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించా రని, వివిధ చోట్ల నిర్బంధించబడిన వీరిని వెంటనే సంబంధిత న్యాయ స్థానాల ముందుంచాలని సిపిఐ(యం) కోరుతున్నదన్నారు. అమాయక గిరిజనులపై వేధింపు లను, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలని, సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాపిడో పేరుతో తిరుపతిలో శ్రీకాకుళం భక్తుడి దోపిడీ

తిరుపతి, నవంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరంలో నేరస్తులు కొత్త పంథాలో దోపిడీకి పాల్పడుతున్నారు. నగరంలో ఆటోకోసం నిరీక్షిస్తున్న శ్రీకాకుళంజిల్లాకు చెందిన ఓ భక్తుడిని రాపిడో పేరుతో ద్విచక్ర వాహనదారుడు మోసం చేసి ఆపై ముళ్ళచెట్లలోకి తీసుకెళ్ళి మెడలోని బంగారుగొలుసును లాక్కెళ్ళాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీధర్ బళ్ళారిలోని ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. కుటుంబం నెల్లూరు నగరం వైఎస్ఆర్ కాలనీలో ఉంటుంది. కుటుంబసభ్యులతో కలసి మంగళవారం తిరుమలకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం శ్రీవారి దర్శనానంతరం బుధవారం ఉదయం తిరుపతికి చేరారు. తిరుగుప్రయాణంలో కుటుంబసభ్యులు నెల్లూరుకు వెళ్ళగా శ్రీధర్ బళ్ళారి వెళ్ళేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో వేచివున్నాడు. అప్పటికే రాపిడో పేరుతో అక్కడకు వచ్చిన యువకుడు అతనిని ఎక్కించుకుని మంగళం ఉపాధ్యాయనగర్ వైపు వెళ్ళాడు. అప్పటికే అక్కడ ఉన్న కొందరు మద్యం సేవిస్తూ శ్రీధర్‌పై దాడి చేశారు. అతని మెడలోని బంగారు చైను లాక్కెళ్ళారు. గట్టిగా బాధితుడు కేకలు వేయడంతో స్థానికులు గమికూడారు. సమాచారం పోలీసులుకు చేరడంతో అలిపిరి పోలీసులు వచ్చేలోపు కొందరు పరారయ్యారు. ఒకరు పట్టుబడ్డాడు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకుని మిగిలిన వారికోసం గాలింపు చేపట్టారు. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదుతో మహేశ్, వివేక్, జాఫర్, అఖిల్, ప్రభుదాస్, చందు అనుమానితులపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ఎస్ఐ లోకేశ్ సిబ్బందితో సిసికెమెరాల పుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నారు. తిరుపతిలో కొత్తరకం దోపిడీ జరగడంతో యాత్రికులు, పోలీసులు కొంత అలర్ట్ అయ్యారు.



# దుర్గమ్మ ఆలయంలో భవానీ దీక్షల విరమణ

● ముమ్మర ఏర్పాట్లు... ● ఇఓ పరిశీలన

ఇంద్రకీలాద్రి, నవంబరు 19 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో జరగబోయే భవానీ దీక్షల విరమణల కోసం ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు, స్నానాల ఘాట్లు, క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల కౌంటర్లు, కేశఖండన శాలలు, ట్రాఫిక్ నియంత్రణ తదితరాల కోసం ఆలయ ఇఓ. వికె శీనా నాయక్, డిసిపి గుణ్ణం రామకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. వెస్ట్ ఎసిపి దుర్గారావు, సిఐ గురుప్రసాద్, పోలీస్ బృందంతో కలసి పరిశీలన చేసిన అనతరం ఇఓ మాట్లాడుతూ మరోమారు కలెక్టర్, విజయవాడ సిపి లతో కలిసి పరిశీలన చేస్తామన్నారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు



దుర్గమ్మవారి ఆలయంలో బుధ వారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. బిల్వార్చన వేదోక్తంగా చేశారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. చతుర్వేద స్వస్తి, పంచ హారతులు, మహానివేదనలు గావించారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని ఎంపి కేశినేని చిన్ని బుధవారం దర్శించుకున్నారు.

# రైతులకు అండగా కూటమి సర్కార్ : ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ రూరల్ , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
రాష్ట్రంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు వెళుతుందని, రైతులకు వ్యవసాయం పరిశ్రమలు అభివృద్ధి కోసం అండగా ఉంటుందని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ రూరల్ మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో 6 కోట్ల 83 లక్షల పీఎం కిసాన్ రెండో విడత చెక్కును ఎమ్మెల్యే నానాజీ, కాకినాడ రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కో ఆర్డినేటర్ కటకం శెట్టి బాబి చేతులమీదుగా రైతులకు అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్నదాత సుఖీభవ రైతులకు ఆర్థిక సహాయం రెండో విడత అందజేయడం జరిగిందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ సారథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని అన్నారు.



ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, గ్రామీణ ఖాదీ బోర్డు డైరెక్టర్ సిరంగు శ్రీనివాస్, తాటికాయల వీరబాబు, కూటమి పార్టీ కార్యకర్తలు, రైతులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# పిఎం కిసాన్,అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం



**మామిడికుదురు , నవంబర్ 19 ( ప్రభాతవార్త )**
అన్నదాతసుఖీభవ, పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమం నియోజకవర్గ స్థాయిలో మామిడికుదురు మండలంలోని కరవాక గ్రామంలో రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది.ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు దేవ వరప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ,పిఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఒక్కో రైతు కుటుంబానికి 7000 రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందని , రాజోలు నియోజకవర్గ పరిధిలో 23,293 మంది రైతులకు రూ.15.56 కోట్ల రూపాయలు జమ కానున్నాయన్నారు. ఎవరైనా అర్హులకు నగదు జమ కాకుంటే వారు గ్రామ రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయసహాయకులను సంప్రదించి లబ్ధి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మామిడికుదురు మండల అధ్యక్షులు కుసుమ వనజ కుమారి, తాటిపాక మార్కెట్ యార్డ్ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి ,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి గొల్లపల్లి అమూల్య ,గోదావరి డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీను, మామిడికుదురు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ , గ్రామ సర్పంచ్ రేకాడి సత్యనారాయణ , ఎంపిటేసీ మల్లాడి వడ్డికాసులు,సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ రాకేష్ ,వ్యవసాయ అధికారులు ఎన్. వి. వి. సత్యనారాయణ,సీహెచ్.రమ్య ప్రియాంక ,వై. మధుకుమార్,తహశీల్దార్ పి. సునీల్ కుమార్, మండల అభివృద్ధి అధికారి జి.భవాని రైతులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం : విశాఖ ఎంపి శ్రీ భరత్

**అమలాపురం ( కోనసీమ బ్యూరో ) , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకాలు రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట సాగు సమయంలో అవసరమయ్యే పెట్టుబడి సహాయాన్ని అందించడం ఈ పథకాల ప్రధాన లక్ష్య మని విశాఖపట్నం పార్ల మెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా కమ లాపురం నియోజకవర్గ పెండ్లిమర్రి నుంచి రైతుల బ్యాంకు ఖాతాలలో అన్న దాత సుఖీభవ రెండో విడత నిధులు, 21 వ పీఎం కిసాన్ నిధులను ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జమ చేశారు. ఈ కార్య క్రమాన్ని స్థానిక పిల్లి వెంకట్రావు కోకోనట్ సొసైటీ నుండి వర్చు వల్ విధానంలో ఎంపీ శ్రీ భరత్,స్థానిక శాసనస భ్యులు అయితా బత్తుల ఆనందరావు, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, అమ్ముడా చైర్మన్ మల్లాడ స్వామి నాయుడు, జిల్లా అధికారులు రైతాంగం తిలకించారు. ఈ సందర్భం గా పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వంఅన్న దాత సుఖీభవ పథకంలో రెండో విడత రూ 5 వేల నిధులను పెట్టుబడి సహాయం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో విజ యవం తంగా జమ చేసింద న్నారు అలాగే కేంద్ర ప్రభుత్వ ప్రముఖ పథకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 21వ విడత కింద నిధులు కూడా అర్హు లైన రైతుల ఖాతాల్లో డిబిటి ద్వారా జమ అయ్యాయన్నారు.ఈ విడత ద్వారా అర్హులైన రైతులకు నేరుగా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఆర్థిక సహా యం అందించబడిందన్నారు. స్థానిక అయితా బత్తుల ఆనందరావు మాట్లా డుతూ రైతుల సంక్షే మమే పరమావధిగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వా రా రైతు కుటుంబాలకు ఆర్థిక మద్దతును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తు న్నా యన్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిధుల విడుదల కార్య క్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారన్నారు. జిల్లా కలెక్టర్



మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రస్తావించినట్లుగా రొటీన్ గా ఒకే రకమైన పంటల సాగు కాకుండా మార్కెట్లో డిమాండ్ గల వరి వంగ డాల మార్పిడి చేయాలని సూచించారు. ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని ఆ దిశగా సేంద్రియ ఉత్పత్తుల సాగు చేసి అధిక లబ్ధిని పొందాలన్నారు. డ్రోన్ టెక్నాలజీతో వ రి సాగులో రెండవ దఫా నానో యూరియా వాడి పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవాల న్నారు అదేవిధంగా అవుట్ పుట్ అధికంగా ఉన్న వంగడాలను సాగు చేసి వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చుకోవాల న్నారు రాబోయే రోజులలో మరిన్ని నూతన వరి వంగడాలు మార్కెట్లో డిమాండ్ ఉన్నవి సాగు చేయాలని సూచిం చారు. జిల్లా వ్యాప్తంగా 1,34,439 రైతులకు అన్నదాత సుఖీ భవ రెండో విడత కింద రూ 5వేలు చొప్పున రూ 67.22 కోట్లు, పీఎం కిసాన్ జిల్లా వ్యాప్తం గా 21 వ విడత కింద రూ. 2 వేలు చొప్పున 1,16,852 మంది రైతులకు రూ 23.37 కోట్లు, వెరసి రూ.90.59 కోట్లు జమ చేయడం జరిగిం దన్నారు. అర్హత గల ప్రతి రైతు కు టుంబానికి సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థిక సహా యం అందిస్తారన్నారు. అన్న దాత సుఖీభవ రూ 14 వేలు మూడు విడత ల్లోనూ సీఎం కిసాన్ మూడు విడతల్లో రూ 6 వేలు మొత్తం రూ 20 వేల నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సంవత్సరానికి మూడు విడత లుగా జమ చేస్తారన్నా. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, నాయకులు మెట్ల రమణబాబు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి బోసుబాబు, జిల్లా పశు సంవర్ధక అధికారి కే వెంకట్రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి పీవీ శ్రీనివా సరావు, సిబ్బంది రైతులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ భేటీఅయ్యారు. ఆయనతో నియోజవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించారు. రాజానగరం నియోజకవర్గం లోని రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతిపాదిత గ్రామ పంచాయతీలు అభివృద్ధి కి నోచుకోవడం లేదని బత్తుల తెలిపారు. ఈ గ్రామాల్లో ఎన్నికలు జరగక పోవడం వల్ల కేంద్ర నిధులు విడుదల కావడం లేదని చెప్పారు. ఆర్థిక పరిపుష్టి లేక ఆ గ్రామాలలో అభివృద్ధి కి నోచుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారుల కావడంతో గ్రామల సమస్యల పరిష్కారం కావడం లో జాప్యం జరుగుతోందని వివరించారు.



కనీస సదుపాయాలు కల్పించేలా ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. రాజానగరం నియోజకవర్గం లోని ప్రతిపాదిత విలీన గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పుష్కరాల దృష్ట్యా రాజానగరం నియోజకవర్గం చాలా కీలక ప్రాంతమని అందుకు అనుగుణంగా నియోజకవర్గానికి పుష్కర నిధులు విడుదల లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

# కోరమండల్ సిఎస్ఆర్ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధునికరణ

**- కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ఎమ్మెల్యే నానాజీ**



**కాకినాడ రూరల్ , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారం సిఎస్ఆర్ నిధులతో ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆట స్థలాలను, నూతన నూతన భవన నిర్మాణాలను ఆధునికరించారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పి ఎం శ్రీ నిధులు, కోరమండల్ సి ఎస్ ఆర్ నిధుల ద్వారా నిర్మించిన నూతన భవనము, కంప్యూటర్ ల్యాబ్, ఆట స్థలాలను కాకినాడ రూరల్ నియోజకవర్గం శాసన సభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరమండల్ ఎరువుల కర్మాగారం సామాజిక బాధ్యతతో చేస్తున్న అభివృద్ధి పనులను అభినందించారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల కర్మాగారం ఏవిపి యూనిట్ హెడ్ కే జగన్నాధన్ , సీనియర్ జనరల్ మేనేజర్ పద్మనాభం, హెచ్ ఆర్ మేనేజర్ కే వంశీకృష్ణ , ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి , మండల పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్ ,కూటమి నాయకులు మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆట,పాటల పోటీలు



**మామిడికుదురు , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
మామిడికుదురు శాఖా గ్రంథాలయం వద్ద జరుగుతున్న 58వ.జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక క్రైస్ట్ ద కింగ్ పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ ఆటలు,పాటల పోటీలు నిర్వహించారు. ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రామ్ ప్రసాద్, యెరుబండి సత్యనారాయణ ,గ్రంథాలయ అధికారి ఎకెవిఆర్ సూర్యనారాయణ,ఈదరాడ బిడీసీ యెరుబండి కన్నబాబు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి : రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి



**అంబాజీపేట , నవంబర్ 19 ( ప్రభాతవార్త )**
అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు అన్నారు.

మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలోని మాచవరం అంగన్వాడి కేంద్రం వద్ద రూ.3 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నాగాబత్తుల శాంత కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ మహాలక్ష్మి,వార్డు మెంబరు మంచాల జ్యోతి, అంగన్వాడి కార్యకర్త ఆశాలత, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి వెండి మామిడి తోరణాలు సమర్పణ



**మామిడికుదురు , నవంబర్ 19 ( ప్రభాతవార్త )**
అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారికి మామిడికుదురు గ్రామానికి చెందిన సుదర్శనం వెంకట సుబ్రహ్మణ్యం వారి కుమారుడు శ్రీనాథ్, జయశ్రీ దంపతులు బుధవారం రూ.30వేలు విలువైన 165 గ్రాముల వెండి మామిడి తోరణాలను సమర్పించారు.వీటిని ఆలయ ఉద్యోగులకు అందజేశారు.వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

## రాజమండ్రి జైలుకు మావోయిస్టుల తరలింపు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
ఏలూరులో అరెస్టు చేసిన 15 మంది మావోయిస్టులకు మొబైల్ కోర్టు న్యాయమూర్తి మేరీ 14 రోజుల రిమాండ్ విధించారు. వారిని రామహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు.

## ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



**సీతానగరం ,నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు "అడలసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్" కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎ.వి.కె.చైతన్య మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకోవాలని, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంచుకొని సమాజంలోని ప్రజలకు కూడా వాటి పట్ల అవగాహన కలిగించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.చిట్టిబాబు, ఎం. సుధామయి, ఎ.వాణి, తదితరులు పాల్గొన్నారు.

# ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**ఆత్రేయపురం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
స్వయంభు క్షేత్రంగా విరాజిళుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాల స్వామి వారి ఆలయం బుధవారం వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. రాజమహేంద్రవరంకి చెందిన చింతలపాటి రఘు రామ రాజు, రాధ, దంపతులు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.5,001లు విజయ నగరం కి చెందిన పురాణం వేంకట శశికాంత్, వారు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి



రూ.10,116లు విరాళంగా ఆన్ లైన్ ద్వారా అందించారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, స్వామి వారి చిత్ర పటం ప్రసాదాలను అందజేశారు.

# ఘనంగా ప్రారంభమైన 13వ మహా కుంభాభిషేకం



**శంఖవరం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :**
మండలంలోని కత్తిపూడి లో వేంచేసియున్న శ్రీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో 13వ మహాకుంభాభిషేకం పూజ కార్యక్రమాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. బ్రహ్మశ్రీ ఆగమ ప్రతిష్ట ఆచార్య గాయత్రీ దేవి ఉపాసకులు ఘంటసాల సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ర్యాలీ సుబ్రహ్మణ్య శర్మ ప్రధాన ఋత్విక్కులు చెరుకూరి వీరబాబు,చెరుకూరి ఆదిత్య శర్మ,ఘంటసాల దీక్షిత్ శర్మ, తో పాటు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ధర్మకర్త మంచాల సత్యనారాయణ చేతుల మీదుగా పూజా కార్యక్రమం ప్రారంభించారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన వేదిక పై ఉత్సవ విగ్రహాలకు ముందుగా మహాగణపతి పూజ,పుణ్యాహావాచనము,రక్షా బంధనం,దీక్షా వస్త్రధారణ,ఋత్విక వరుణ,నవగ్రహ మండపారాధన, సప్తనదీ జలాలతో మహాకుంభాభిషేకం నిర్వహించు అఖండ 571 కలశ స్థాపన,రుద్ర పారాయణ జపము,నవగ్రహ జపము, మహాకుంభ అధిష్టాన దేవత ఆవాహనము,మహా రుద్ర హెూమము,నీరాజనం ,మంత్ర పుష్పం,చతుర్వేద స్వస్తి,దర్బారు సేవా కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ ఆవరణలో వివిధ రకాల రంగులతో శివలింగ అలంకరించారు. భారీ ఎత్తున మహిళలు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు, గురువారం ఆలయ ఆవరణలో విశేష పూజలు నిర్వహించి,571 కలశాల తో శోభాయాత్రగా ఊరేగింపు మహా కుంభాభిషేకం అన్న సమారాధన చేపడతామని పేర్కొన్నారు కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు విజయ,చంద్రారెడ్డి, దుర్గారావు, సుబ్రహ్మణ్యం,సత్తిబాబు,రమణమూర్తి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట , నవంబర్ 19 ( ప్రభాతవార్త )**
అన్నదాత సుఖీబావ పీఎం కిసాన్ కింద రైతులు ఖాతాలో జమ అయ్యింది అని ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రైతులు సంక్షేమమే ముఖ్యం అనికొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం నిర్వహించిన పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. రైతులతో మా ట్లాడి,



ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు ప్రసంగాలను రైతులతో కలిసి వీక్షించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు.కొత్తపేట నియోజకవర్గానికి రూ 15.26 కోట్లు 23,018 మంది రైతులకు జమ అయినట్లు తెలిపారు. కొత్తపేట మండలం 6497 మంది రైతులకు రూ 4.22 కోట్లు విడుదలయిందని ఎమ్మెల్యే బండారు అన్నారు.ఈ కార్యక్రమం లో బూసి జయలక్ష్మి భాస్కరరావు, పాలూరి సత్యనందం, కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లి భీమరావు, గనిశెట్టి వీరేష్, మిద్దె ఆదినారాయణ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థానం హుండీ లెక్కింపులో రూ, 60 వేలు చేతివాటం

## - పోలీసులకు అప్పగింత : ఈఓ, చక్రదరరావు



**ఆత్రేయపురం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నందు బుధవారం స్వామివారి హుండీలు లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో హుండీలు లెక్కింపు సందర్భంగా సంచలనాత్మక ఘటన చోటు చేసుకుంది. హుండీల లెక్కింపుకు వచ్చిన సేవకుల్లో ఒకరు సుమారు రూ.60 వేల దొంగిలించగా బోజన సమయంలోఆలయ సెక్యూరుటీ తనిఖీ చేస్తుండగా 25వేలు బయట పడింది.దీంతో వెంటనే డిప్యూటీ కమీషనర్, ఈఓ చక్రదరరావు అతన్ని తనిఖీ చేయగా మోటార్ సైకిల్ కవర్ లో రూ 35వేలు దొరికాయి. మొత్తం రూ 60వేలు రూపాయలను అతన్ని పోలీసులకు అప్పగించారు. గతంలో కూడా హుండీలు లెక్కింపులో వచ్చిన సేవకుల్లో ఒకరు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక వ్యక్తిని పట్టుకోవడం జరిగిందని తెలియజేశారు. అనపర్తి , వేగయ్యమ్మ పేటకు చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు అనే సేవకుడు ఈ చోరీకి పాల్పడ్డాడని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ రాము తెలిపారు.అలాగే ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావును వివరణకోరగా ఉండి లెక్కింపు వారం రోజులు ముందు అన్ని శాఖల అధికారులకు సమాచారం అందిస్తున్నామని, తెలిపారు.



# ప్రజాభిప్రాయ సేకరణ పారదర్శకంగానే జరుగుతుంది : పొల్యూషన్ ఈఈ శంకర్రావు

**రౌతులపూడి , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** మండలంలోని ఎస్. పైడిపాలలో క్వారీ ప్రతిపాదిత ఏరియాలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కాకినాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఎస్.కె. టెర్రా మైన్స్ అండ్ మినరల్స్ ఎల్. ఎల్. పి కి పెద్దాపురం ఆర్డీవో పి. శ్రీ రమణి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొదట ఎస్. పైడిపాల సర్వే నెంబర్ 15 /పి హె 1.735ర్లు, ములగపూడి సర్వే నెంబర్ 1/పి హె 0.858ర్లు, డి. పైడిపాల సర్వేనెంబర్ 59/పి హె 0.507ర్లు కి నిర్వహిం చారు. తదనంతరం ఎస్ పైడిపాల సర్వేనెంబర్ 15/పి హె3.44ర్లు, తిరుపతమ్మ పేట సర్వే నెంబర్ 90 హె 2.500ర్లు కి ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సమావేశంలో ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ అనుమతులు ఇవ్వడానికి అభ్యంతరం లేదని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరా రు. ఆయా ప్రాంతంలో ఉన్న రైతులను సంప్రదించి క్వారీ కార్యకలాపాలు నిర్వహించాలని తెలియజేశారు. సమావేశాల వరకే పరిమితం చేయకుండా వెల్లడించిన అంశాలను అమలు చేయాలన్నారు. ఎస్. పైడిపాలలో లో గిరిజనులకు చెందిన డి. పట్టాలు ఉన్నాయన్నారు. దీనిపై న్యాయం చేయాలని కోరారు. తిరుపతమ్మ పేట ప్రజాభి ప్రాయ సేకరణ పై గందరగోళం నెలకొంది. క్వారీ చేసే లోకేషన్ తెలియ జేయాలని రెడ్డి బుల్లబ్బాయి, పర్వత సుభాష్ అధికారులను కోరారు. ఇప్పుడు పేర్కొన్న హె 2.500ర్లు కి 2007లో లీజ్ దరఖాస్తు చేశామని, అయితే ఆ ప్రాంతంలో ఎన్ టి పి సి కి చెందిన హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉండడంతో అప్పటి కలెక్టర్ జవహర్ రెడ్డి రద్దు చేశారన్నారు. ఇప్పుడు ఎలా ఎన్ఓసి ఇచ్చారని వారు ప్రశ్నించారు. ఆ లొకేషన్ కాదని, వేరే లొకేషన్ లో వారి జరుగుతుందని తాసిల్దార్ ఎస్. వి. నరేష్ తెలిపారు. ఏ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో రికార్డింగ్ ద్వారా పారదర్శకంగానే జరుగు తుందని పొల్యూషన్ ఈ ఈ శంకర్రావు పేర్కొన్నారు. ఎటువంటి అపోహలకు తావు లేదని ఆయన వెల్లడించారు. ఎటువంటి ఘర్షణ తలెత్త కుండా ఎస్సై జి వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పిటిసిగొల్లు చిన్నదివాణం, రాయి ప్రసాద్, పోలోజు వరహాలు, ఈగల సత్తిబాబు, కోటిపల్లి శ్రీనివాస్, రెడ్డి బుల్లబ్బాయి, చిటికుల శ్రీను, ఆమూరి సుధారాణి,సుర్ల శ్రీను,, రాయి శ్రీనివాస్, సాయి, శివ ప్రసాద్, శ్రీరం రెడ్డి శ్రీనివాస్, పోలుపర్తి తాతాజీ, పారేపల్లి శ్రీరామకృష్ణ, ఎన్జీవో జె టి రామారావు మాట్లా డారు. ఎస్ పైడిపాల ప్రజాభిప్రాయ సేకరణలో ములగపూడి ఫీల్డ్ అసిస్టెంట్ ఏ. రమణ బాబు పాల్గొని అభ్యంతరం లేదని తెలియపరచడం విశేషం. ప్రభుత్వ శాఖలో పని చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడంపై పలువురు బహిరంగంగా అతనిపై గుసగుసలాడారు. ఎస్ పైడిపాల ఇన్చార్జి వీఆర్ఓ శ్రీరాములు ఆ శాఖ అధికారులకు స్వయంగా కుర్చీలు వేయడం మరో విశేషం కనబడింది.





# నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

## - మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి.. రూ.20 వేలు ఆర్థిక సాయం



**అంబాజీపేట , నవంబర్ 19 ( ప్రభాతవార్త )** ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చిరతపూడి గ్రామపంచాయతీ పరిధిలోని కొంబత్తులవారి పేటకు చెందిన సత్యాల నాగేశ్వరరావు (45) అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొంబత్తులవారిపేటకు చేరుకుని నాగేశ్వరావు మృతదేహానికి నివాళులర్పించి,రూ.20 వేలు నగదును వ్యక్తిగతంగా సాయం చేశారు. నిరుపేద కుటుంబాలకు బాసటగా నిలుస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మాజీ సర్పంచి సరెళ్ళ వెంకటేశ్వర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# కుండలేశ్వర పుణ్యక్షేత్రంలో విషాదం



**కాట్రేనికోన ( కోనసీమ బ్యూరో ) , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** కాట్రేనికోన మండలంలోని కుండలే శ్వరం శ్రీ పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయం వద్ద అపశృతి చోటుచేసుకుంది.విశాఖపట్నం నుండి ఆలయ దర్శనానికి వచ్చిన బొట్టా నిర్మల (67) గుండె పోటుతో మృతిచెందారు.భక్తురాలు నిర్మల స్వామి వారిని దర్శించుకుని, అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆకస్మికంగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. వెంటనే అక్కడ ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది సహాయం చేసినా ప్రయోజనం లేకపోయింది. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో కుండలేశ్వర పుణ్యక్షేత్రంలో విషాద వాతావరణం నెలకొంది.

# పాఠశాలల నిర్వహణలో ఉన్న లోపాలను గుర్తించి నివేదిక అందజేయాలి : జిల్లా ఏపీసీ సమగ్ర శిక్ష డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మి

**అంబాజీపేట , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీలో భాగంగా లోపాలను గుర్తించడం జరిగిందని వాటిన తక్షణమే సవరించి నివేదిక అందజేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీసీ సమగ్ర శిక్ష డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మి ప్రధానోపా ధ్యాయులకు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ లకు సూచించారు. అంబాజీపేట మండల రీసోర్స్ భవనంలో కమ్యూనిటీ మొబైలేజేషన్ అధికారి బొరుసు వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక,జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంలకు, ఎస్ఎంసీ చైర్మన్లకు సామాజిక తనిఖీపై సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మమ్మి మాట్లాడుతూ జిల్లాలో పాఠశాలల వారిగా నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడం, లైబ్రేరీలు లేకపోవడం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సరిగా లేకపోవడం, మరుగుదొడ్ల క్లీనింగ్, రాగి జావ పౌడర్ సకాలంలో అందకపోవడం తదితర అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వీటన్నింటిని ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న సమస్యలను పర్కించి వాటి నివేదికను మండల విద్యాశాఖాధికారులకు, జెడ్పీ హైస్కూల్లో ఉన్న వాటిని పరిష్కరిస్తే డీవైఈఓలకు పూర్తి నివేదకను అందజేయాలన్నారు. సమస్యల పరిష్కరించకుండా నివేదిక ఇస్తే చర్యలు ఉంటాయన్నారు. పాఠశాలలకు వచ్చే గ్రాంటులు స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్పీ, కాంపోజిట్ స్కూల్ గ్రాంట్, సివిల్ వర్క్స్ కు సంబంధించి 40 శాతం వేశారని, వాటిని తక్షణమే ఖర్చుచేసి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రాంటుల వినియోగ బిల్లుల వివరాలను ఆయా పాఠశాలల హెచ్ఎం లాగిన్లో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 2147 స్కూల్స్ పర్యావరణ క్లబ్ (ఏకో క్లబ్), కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికి 962 క్లబ్లు మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన వాటిని తక్షణమే పూర్తి చేయాలని హెచ్ఎంలకు సూచించారు. విద్యా మిత్ర కిట్లకు సంబంధించి అన్ని పాఠశాలల్లో 89,146 మంది విద్యార్థులు ఉండగా 668కి బయోమెట్రిక్ పడటం లేదన్నారు. వీరిలో దీర్ఘకాలికంగా స్కూల్ మానేస్తే ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ సేకరించాలన్నారు.ఈ సమావేశంలో మిక్స్డ్ మీల్ ఏడీ ఎన్.సురేష్, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎం. ప్రకాష్, ఎస్ఆర్పీలు సింహాద్రి, వెంకటేశ్వరరావు, డీఆర్పీలు పాల్గొన్నారు.




# ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ విద్యార్థుల పరిశ్రమ సందర్శన

**గండేపల్లి , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** గండేపల్లి మండలం సూరంపాలెం లో ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థుల పాఠ్య కార్యక్రమంలో భాగంగా ఏపీ మెట్‌టెక్ జోన్‌కు విశాఖపట్నం పరిశ్రమ సందర్శన జరిపినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మొత్తం 82 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. పరిశ్రమ వాతావరణాన్ని, ముఖ్యంగా మెడికల్ డివైస్ తయారీ ప్రక్రియలను, బయో మెడికల్ పరికరాల ఉత్పత్తి విధానాలు, అనిమల్ హౌస్ కార్యకలాపాలు ప్రత్యక్షంగా అవలోకనం చేయడం ద్వారా విద్యార్థులు అమూల్యమైన ప్రాక్టికల్ అను భవాన్ని పొందారు.ఈ సందర్భంగా మాట్లాడిన డా. ఎం. శ్రీనివాస రెడ్డి ఇలాంటి పరిశ్రమ సందర్శనలు విద్యార్థుల్లో ప్రాక్టికల్ జ్ఞానాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అంతేకాక, ఐ.బి.ఎస్.సి నుండి నరేష్ , పరిశ్రమలో అనుసరించాల్సిన క్వాలిటీ కంట్రోల్ విధానాలు, గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు విలువైన మార్గదర్శకత అందించారు.పరిశ్రమ సందర్శన విజయవంతం కావడానికి సహకరించిన ఏపీ మెట్‌టెక్ జోన్ అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డా. డి. సతీష్ కుమార్ ఈ సందర్శన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు.




# ఆంధ్ర శబరిమలై అయ్యప్పకు మహా అన్నాభిషేకం



**శంఖవరం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** శంఖవరం మండలం సిద్ధిపుణ్య క్షేత్రంలో కొలువైన ఆంధ్ర శబరిమల అయ్యప్పకు మహా అన్నాభిషేకాన్ని నిర్వహించారు . తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తుల కిటకిటలతో సందడిగా మారగా కార్తీకమాసం మహాపుణ్యఫలాన్ని పొందేందుకు వేలాది భక్తులు తరలివచ్చారు. నవంబర్ 30న ప్రారంభమైన 18 రోజుల కోటి బిల్వార్చన మహోత్సాహం ముగియడం కార్తీక మాసం ఆఖరి బుధవారం కావడంతో అయ్యప్ప స్వామివారిని అర్చక స్వాముల వేద మంత్రోచ్ఛారణలు, భజనా మేళాల గానాలు, భక్తుల హరినామస్మరణల మధ్య అన్నాభిషేకం చేపట్టారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి మాట్లాడుతూ కోటి బిల్వార్చన విజయవంతంగా పూర్తి కావడం స్వామివారి అనుగ్రహం. కార్తీకమాసం ఆఖరి బుధవారం అన్నాభిషేకం అయ్యప్ప స్వామి ఆలయానికి అత్యంత ప్రాముఖ్యం గల సంప్రదాయం. తెల్లవారుజాము నుంచే ప్రత్యేకంగా సిద్ధం చేసిన అన్నంతో గర్భగుడిలో స్వామివారికి మహాభిషేకం నిర్వహించామని స్వామివారి శిరస్సు నుంచి పాదాల వరకు అన్నం మునిగేలా చేసిన ఈ అభిషేకమే భక్తులకు అత్యంత మంగళకరమైన క్షణం” అని పేర్కొన్నారు. అన్నాభిషేక అనంతరం పుణ్యప్రసాదాన్ని వేలాది మంది భక్తులకు అందజేశారు. స్వామివారి అనుగ్రహాన్ని పొందేందుకు దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు తరలివచ్చి అన్నాభిషేక దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణం నిండా “స్వామియే శరణం అయ్యప్పా” నినాదాలు మార్మోగాయి.

# బాలికను కిడ్నాప్ చేసిన ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్కి తరలింపు



**కోనసీమ బ్యూరో , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** జిల్లాలో సంచలనం రేపిన అమలాపురం పట్టణం, ఐ-మైండ్స్ స్కూల్ విద్యార్థిని కిడ్నాప్ ఉదంతంలో ముద్దాయికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ నెల 10 న, స్కూల్ నుంచి వస్తున్న 10సం.ల వయస్సు గల బాలికను, వరసకు మావయ్య అయిన మట్టపర్తి దుర్గా నాగ సత్యమూర్తి (చంటి) అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై వచ్చి, బాలికను కిడ్నాప్ చేసి, అటునుంచి ఆమెను కాకినాడ తీసుకెళ్లి, బాలిక క్షేమంగా తిరిగి రావాలి అంటే తను పంపిన యూపీఐ క్యూఆర్ కోడ్ స్కానర్ కి డబ్బులు పంపించాలని, తల్లిదండ్రులను బెదిరించి, డబ్బులు గుంజుకున్నాడు. అనంతరం, బాలిక తండ్రి కముజు వెంకటరమణ పిర్యాదు మేరకు, అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో కిడ్నాప్ కేసు నమోదు చేసిన అనంతరం, అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ స్వీయ పర్యవేక్షణలో, పట్టణ సి.ఐ వీరబాబు , ఎస్సైలు టి.శ్రీనివాస్, జోషిలు మూడు టీంలుగా ఏర్పడి, కాకినాడ పరిసర ప్రాంతాలు, పి.గన్నవరం మండలం ముంగండ, పోతవరం, కారుపల్లి గ్రామాలలో రాత్రి సమయంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి, కేసు నమోదు చేసిన 11 గం.లలోనే, కిడ్నాప్ కాబడిన బాలిక ఆచూకీ గుర్తించి, బాలికను ఆమె తల్లిదండ్రులకు క్షేమంగా తిరిగి అప్పగించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసులో బాలికను వదిలి పరారైన పి.గన్నవరం మండలం, ముంగండ గ్రామానికి చెందిన ముద్దాయి మట్టపర్తి దుర్గా నాగ సత్యమూర్తి (చంటి) బుధవారం ఉదయం అమలాపురం పట్టణ సి.ఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై టి.శ్రీనివాస్ సిబ్బంది పోతవరం గ్రామంలో అరెస్ట్ చేసి, ముద్దాయి నుంచి నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్, 2 సెల్ ఫోన్లు, బాలిక స్కూల్ బ్యాగ్, లంచ్ బ్యాగ్, జత స్కూల్ షూలు స్వాధీనపరచుకొని, రిమాండ్ నిమిత్తం, అమలాపురం ఆడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపర్చగా, కోర్టు ముద్దాయికి 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు. నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. ఈ కేసులో త్వరితగతిన స్పందించిన అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, ఎస్సైలు శ్రీనివాస్, జోషి సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

# వాడపల్లి 'వెంకన్న' హుండీ ఆదాయం, రూ.1.59 కోట్లు

**ఆత్రేయపురం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** ఏడు వారల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి హుండీల నుండి,రూ, 1.59 కోట్లుఆదాయం వచ్చినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రదరరావు తెలిపారు.బుధవారం జరిగిన లెక్కింపు కార్యక్రమానికి హుండీ లెక్కింపుకు పర్యవేక్షణాధికారిగా అమలాపురం దేవాదాయ శాఖ అధికారి,అసిస్టెంట్ కమిషనర్ వి సత్యనారాయణ, తనిఖీదారుగా జె రామలింగేశ్వరరావు, వై వి వి సత్యనారాయణ, వెల్ల గ్రూప్ శ్రీ దేవాలయాల తదితరులు వ్యవహరించారు.ఈ సందర్భంగా ఈఓ చక్రదరరావు మీడియా తో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి, శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల నుంచి మొత్తం రూ.1,30,38,579లు ఆదాయం,అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.29,06,170 ల ఆదాయం మొత్తం 27 రోజులకు గాను రూ.1,59,44,749 లు ఆదాయంగా లభించినట్లు తెలిపారు. నగదు తో పాటు 15 గ్రాముల బంగారం, 910 గ్రాముల వెండి కానుకలుగా రాగ,8 దేశాలకు చెందిన 35 విదేశీ కరెన్సీ నోట్లు సైతం లభించినట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపెరడెంట్ పులపర్తి రాంబాబు, సినీయర్ అసిస్టెంట్ కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వై. శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ లు, ప్రసాద్, నందిశ్వరుడు, నారాయణ,అర్చక స్వాములు, గ్రామస్తులు, శ్రీవారి సేవకులు, దేవస్థానం సిబ్బంది,బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే బండారు

## రూ.1.16 కోట్లతో నిర్మించనున్న టెన్సైల్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన..108వాహనాన్ని ప్రారంభించిన..ఎంపీ శ్రీ భరత్




**ఆత్రేయపురం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** ప్రముఖ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమలగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని బుధవారం విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు వారితో కలిసి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు, వేదమంత్రాలతో వేద ఆశీర్వచనం అందించారు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు. భారతదేశంలో పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని వైజాగ్ ఎంపీ మతుకుమిల్లి శ్రీ భరత్ అన్నారు. అనంతరం దేవస్థానం వద్ద రూ.1.16 కోట్లతో నిర్మించనున్న టెన్సైల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు శంకుస్థాపన చేశారు. అనంతరం నూతనంగా ఏర్పా టు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం గతంలో కన్నా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంలో రూ.96కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఎమ్మెల్యే బండారు తెలిపారు. వాడపల్లి చారిత్రక నాటి ఆలయంగా కనిపిస్తుం దని, స్థానిక నాయకుల కృషితో గణనీయంగా అభివృద్ధి చెందుతుందని ఎంపీ శ్రీ భరత్ అన్నారు. గతంలో ఒకే క్యూలైనుకు అవకాశం ఉన్న ద్వారాలను వెడల్పు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకులను ఆకర్షించడంలో దేశంలో 3వ స్థానంలో ఏపీ ఉందని, ఎక్కువగా ఆధ్యాత్మిక పర్యాటకానికి మన రాష్ట్రానికి పర్యాటకులు వస్తున్నారన్నారు.

# రావులపాలెం లో మావోయిస్టు అరెస్ట్..పోలీసుల అదుపులో హిడ్మా అనుచరుడు సరోజ్ మండ్వి

**రావులపాలెం , నవంబర్ 19 ( ప్రభాతవార్త ) :** ప్రశాంతతకు నిలయంగా ఉండే కోనసీమలో మావోయిస్టుల కదలికలు వెలుగులోకి వచ్చాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన ఎన్కౌంటర్ లో హతమైన మావోయిస్టు నేత హిడ్మా అనుచరుడైన సరోజ్ మండ్వి అలియాస్ ఓండాను బుధవారం రావులపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రావులపాలెం టౌన్ సిఐ ఎం. శేఖర్ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కిష్టారం పి.ఎస్ ఏరియాలోని బూర్గులంకకు చెందిన సరోజ్ మండ్వి అలియాస్ ఓండా ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలో ఉంటున్నాడు. కుంట గ్రామంలో 5వ తరగతి వరకు చదివిన ఓండా 12వ ఏటనే మావోయిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడై అటుగా ప్రయాణం ప్రారంభించాడు. సానుభూతిపరుడిగా, మిలేషియాగా, కమిటీ సభ్యుడిగా ఎదిగాడు. ప్రస్తుతం మొచాకీ ఎర్రా అలియాస్ ఎర్రదాదా సౌత్ డివిజనల్ మావోయిస్టు కమాండర్ ఇన్చార్జిగా ఉన్న కమ్యూనికేషన్ విభాగంలో కమాండర్ ఉంటూ మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. 2021 నుంచి జరిగిన వివిధ సంఘటనల్లో సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లను మావోయిస్టులు దాడులు చేసి హతమార్చడంలో కీలక పాత్ర పోషించాడు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాకు అత్యంత సన్నిహితుడిగా ఉంటున్నాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు - మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో హిడ్మా అతని భార్యతో పాటు పలువురు మావోయిస్టులు హతమైన నేపథ్యంలో పోలీసులు పక్కా సమాచారంతో రాష్ట్ర వ్యాప్తంగా తలదాచుకున్న పలువురు మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. అందులో భాగంగా రావులపాలెం గౌతమి బ్రిడ్జి సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద ముందస్తు సమాచారంతో సరోజ్ మండ్విని బుధవారం సిఐ శేఖర్ బాబు అరెస్టు చేశారు. మారేడమిల్లి ఎన్కౌంటర్ తో అప్రమత్తమై రహస్యంగా కోనసీమ ప్రాంతంలో తలదాచుకునేందుకు వస్తుండగా అతడిని పక్కా సమాచారంతో అరెస్టు చేసినట్టు సిఐ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక నాటు తుపాకీ, 10 తూటాలు స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరు పరుస్తామని సిఐ చెప్పారు.




### కొంతకాలంగా కోనసీమలోనే మకాం

ఇదిలా ఉంటే అరెస్టు అయిన మావోయిస్టు మండ్వి కొంతకాలంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎలాంటి మావోయిస్టు కార్యకలాపాలు చేయకపోయినా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మావోయిస్టు నేతల సూచనలతో సఖినేటిపల్లి ప్రాంతంలోని ఒక రొయ్యల చెరువు వద్ద గుమాస్తాగా చేరినట్టు సమాచారం. ఇటీవల మావోయిస్టు నేతలను కలిసేందుకు వెళ్ళిన మండ్వి హిడ్మా ఎన్కౌంటర్ తో తిరిగి కోనసీమ ప్రాంతానికి వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. మావోయిస్టు అరెస్టు స్థానికంగా చర్చనీయాంశమైంది.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ఫిడే వరల్డ్ కప్‌లో అర్జున్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో ఎరిగైసి అర్జున్ క్వార్టర్స్‌లోనే ఓడిపోయాడు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్రచారం ముగిసింది. గోవాలో బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ ట్రైబ్రేక్‌లో గ్రాండ్ మాస్టర్ అర్జున్ చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి చేతిలో పరాజయం చెంది టోర్నీ నుండి నిష్క్రమించాడు. క్వార్టర్‌ఫైనల్ దశలో పోటీలో మిగిలి ఉన్న ఏకైక భారతీయుడు అర్జున్ రెండు క్లాసికల్ గేమ్‌లను డ్రా చేసుకున్న తర్వాత, ట్రైబ్రేక్ లో ఎదురీత తప్పలేదు. ఎల్లప్పుడూ క్లిష్టమైన పోటీగా ఉన్న ట్రైబ్రేక్‌లో తెలంగాణలోని వరంగల్‌కు చెందిన 22 ఏళ్ల అర్జున్ మొదటి ట్రైబ్రేక్ గేమ్‌లో బ్లాక్‌తో ఫ్రెంచ్ డిఫెన్స్ కోసం వెళ్లాడు. అయితే మధ్య గేమ్‌లో ఈ భారత ఆటగాడు ఇబ్బందుల్లో ఉన్నట్లు అనిపించింది. కానీ 27వ ఎత్తుగడలో వీ చేసిన పొరపాటు సురక్షితమైన ఎత్తుగడను ఎంచుకోవడం, అర్జున్ తిరిగి ఆటలోకి అడుగుపెట్టడానికి వీలు కల్పించింది. తద్వారా 66 ఎత్తుగడల తర్వాత ఆట డ్రాగా ముగిసింది. ఇక 2023 ఎడిషన్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌లో ట్రైబ్రేక్‌లో ఆర్ ప్రజ్ఞానంద చేతిలో ఓడిపోయిన అర్జున్, రెండో గేమ్‌లో వైట్‌తో విజయం సాధించాలంటే వీ పెట్రోవ్ డిఫెన్స్‌ను బద్దలు కొట్టాల్సి వచ్చింది. అయితే, వీ 28వ ఎత్తుగడ ద్వారా విజయ ప్రయోజనాన్ని పొందారు. కానీ వీ చివరికి 79 ఎత్తుగడల తర్వాత తన సి బంటును రాణిగా ప్రమోట్ చేసి, అర్జున్‌ను ఇరుకున పెట్టడం ద్వారా భారత్ ఆశలను తుడిచిపెట్టాడు.

# టోక్యో డెఫ్లింపిక్స్‌లో అభినవ్, ప్రాంజలికి స్వర్ణం



**న్యూఢిల్లీ:** టోక్యో డెఫ్లింపిక్స్ 2025, ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ షూటర్లు అభినవ్ దేశ్వాల్, ప్రాంజలి ప్రశాంత్ ధుమల్ స్వర్ణం సాధించారు. అలాగే 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో కుషాగ్ర సింగ్ రజావత్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. బుధవారం టోక్యోలో జరిగిన 25వ డెఫ్లింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఈ భారత జంట చైనీస్ తైపీకి చెందిన యాజు కావో-మింగ్‌జుయి హ్సుపై 16-6 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. ఇప్పటివరకు, టోక్యోలో భారత షూటర్లు మాత్రమే పతకాలు సాధించారు, మొత్తం 11 పతకాలు గెలుచుకున్నారు. అభినవ్ మరియు ప్రాంజలి స్వర్ణ పతక పోటీ ప్రారంభం నుండి తమ ఆధిపత్య స్థానాన్ని నిలబెట్టుకున్నారు. దీంతో అభినవ్ 287, ప్రాంజలి 282 పాయింట్లతో క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచారు. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో, కుషాగ్రా 224.3 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

# వరల్డ్ కప్‌కు స్పెయిన్ అర్హత



**న్యూఢిల్లీ:** టర్కీతో 2-2తో డ్రా అయిన తర్వాత స్పెయిన్ 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. ఈ ప్రపంచ కప్‌తో స్పెయిన్ టోర్నమెంట్‌లో 17వ సారి పాల్గొంటుంది. 1978లో ప్రారంభమైన అర్హత పరంపరను కొనసాగిస్తోంది. అయితే 2010లో మాత్రమే టైటిల్ వచ్చింది. సెవిల్లెలో టర్కీతో జరిగిన 2-2 డ్రా తర్వాత స్పెయిన్ 2026 ప్రపంచ కప్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. యూరోపియన్ ఛాంపియన్ నాల్గవ నిమిషంలోనే డాని ఓల్మో ద్వారా తొలి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ గ్రూప్‌ను కైవసం చేసుకోవడానికి ఏడు గోల్స్ విజయం అవసరమైన టర్కీ, 42వ నిమిషంలో డెనిజ్ గుల్ ద్వారా స్కోరును సమం చేయగలిగింది. 54వ నిమిషంలో సలీహ్ ఓజ్కాన్ బాక్స్ చేసిన గోల్‌తో టర్కీ ఘంగుతింది. క్వాలిఫయర్‌లో స్పెయిన్ ఓయార్జాబల్ ఎనిమిది నిమిషాల తర్వాత మ్యాచ్‌ను సమం చేశాడు. లామినే యమల్, రోడ్రి, డాని కార్వాజల్, పెడ్రి, డీన్ హుయిజ్సెన్ వంటి కీలక ఆటగాళ్లు లేకపోయినా స్పెయిన్ ఉత్సాహంగా ప్రారంభమైంది. నాల్గవ నిమిషంలో మార్క్ కుకురెల్లా తక్కువ క్రాస్ ఇచ్చిన తర్వాత అది ఆధిక్యంలోకి వచ్చింది. దాన్ని ఫాబియన్ రూయిజ్ డమ్మీ చేయగా, ఓల్మో డిఫెండర్‌ను దాటి బంతిని నెట్‌లోకి వెళ్ళేలా చేశాడు. విరామం తర్వాత, విన్సెంజో మోంటెల్లా నాయకత్వంలోని టర్కీ ఆత్మవిశ్వాసం పెంచుకుని 55వ నిమిషంలో ఆధిక్యంలోకి వెళ్లింది. ఓజ్కాన్ బాక్స్ అంచు నుండి ఖచ్చితమైన తక్కువ ముగింపుతో గోల్ చేశాడు. క్లిష్టమైన జట్టు ఎత్తుగడను అధిగమించి టర్కీకి 2-1 ఆధిక్యాన్ని అందించాడు. అయితే టర్కిష్ డిఫెండర్ గోల్ లైన్ నుండి క్లియరెన్స్ పొందడంతో స్పెయిన్ ఓయర్జాబల్ ద్వారా స్కోరును సమం చేసింది.

# భారత్‌తో మూడో వన్డేలో దక్షిణాఫ్రికా భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** భారత్‌తో మూడో అనధికారిక వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు శతక్కొట్టడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఏకంగా 325 పరుగులు చేసింది. కాగా రెండు అనధికారిక టెస్టులు, మూమూడు వన్డేలు నిమిత్తం దక్షిణాఫ్రికా భారత్‌లో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఇరు జట్ల మధ్య రాజ్‌కోట్ వేదికగా బుధవారం నామమాత్రపు మూడో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌తో అదరగొట్టింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ ప్రొటీస్ టీమ్‌ను తొలుత బ్యాటింగ్‌కు అహ్వానించింది. ఓపెనర్లు లువాన్ డ్రి ప్రిటోరియస్, రివాల్డో మూన్‌సామీ చెలరేగారు. ప్రిటోరియస్ 98 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో ఏకంగా 123 పరుగులు చేయగా, మూన్‌సామీ 130 బంతులు ఎదుర్కొన్ని 13 ఫోర్లు, 2 సిక్సర్లు బాది 107 పరుగులు సాధించాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన ఈ ఓపెనింగ్ జోడీని భారత్ పేసర్ ప్రసిద్ కృష్ణ విడదీశాడు. దీంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ నెమ్మదించింది. మిగిలిన వాళ్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. రుబిన్ హెర్మాన్ (11), సినెతెంబ కెషిలె (1), కెప్టెన్ మార్క్వెస్ అకెర్మాన్ (16) పూర్తిగా విఫలం కాగా, డియాన్ ఫక్షరెస్టర్ 20, డిలానో పాట్‌గిటర్ 30 (నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. డిజోర్న్ ఫార్చ్యూన 2 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఫలితంగా దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్ బౌలర్లలో పేసర్లు ప్రసిద్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, హర్షిత్ రాణా తలా రెండేసి వికెట్లు కూల్చారు.

# దక్షిణాఫ్రికాతో టెస్ట్.. కీలక సమరం

## టీం ఇండియా బి అలర్ట్

### మళ్లీ ఈ 3 తప్పులు చేస్తే సిరీస్ ఖతం





**న్యూఢిల్లీ:** భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ గౌహతిలోని బర్సపర క్రికెట్ స్టేడియంలో జరుగుతుంది. ఈ టెస్ట్ మ్యాచ్ నవంబర్ 22న ప్రారంభమవుతుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. పర్యాటకులు భారత్‌ను 30 పరుగుల తేడాతో ఓడించారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికా సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. భారత్‌తోజరిగే గౌహతి టెస్ట్‌లో దక్షిణాఫ్రికా గెలిస్తే, వారు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేస్తారు. భారత్ క్లీన్ స్వీప్‌ను నివారించాలనుకుంటే, గౌహతి టెస్ట్‌లో గతంలో చేసిన ఈ మూడు తప్పులను ఇప్పుడు సరిదిద్దుకుని దాన్నుండి తప్పించుకోవాలి. కోల్‌కతా టెస్ట్‌లో భారత జట్టు నిర్లక్ష్యంగా బ్యాటింగ్‌చేసింది. గౌహతిటెస్ట్‌లో కూడా భారత్ అదే బాటలోనడుస్తే, దానిపరిణామాలను తీవ్రంగా ఎదుర్కోవలసి ఉంటుంది. రెండోటెస్ట్ గెలవాలంటే, గౌహతిలో టీమిండియా బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. మరోపక్క కొన్ని సంవత్సరాలుగా భారత జట్టు స్పిన్‌తో ఇబ్బందిపడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్ లో పర్యటించినప్పుడు, వారి స్పిన్నర్లు గణనీయమైన ఇబ్బం దులను కలిగించారు. ఇప్పుడు, దక్షిణాఫ్రికా స్పిన్నర్లు కూడా భారతదేశానికి పెద్ద తలనొప్పిగా మారుతున్నారు. భారత పరిస్థితులలో, ముఖ్యంగా టెస్ట్ మ్యాచ్‌లలో స్పిన్నర్లు కీలకపాత్ర పోషి స్తారు. అందువల్ల, గౌహతిలో స్పిన్‌ను అర్థం చేసుకుని టీమిండియా ఆడాల్సి ఉంటుంది. లేకపోతే, కోల్‌కతా టెస్ట్‌లాగా, వారుఇక్కడ కూడా గణనీయమైన ఇబ్బం దులను ఎదుర్కొంటారు. ఇక గౌహతిటెస్ట్‌లో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను భారతజట్టు తక్కువఅంచనా వేయాల్సిన అవసరం లేదు. దక్షిణాఫ్రికాలో ఎప్పుడైనా ఆటను మలుపుతిప్పగల సమర్థులైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. కోల్‌కతా టెస్ట్ రెండోఇన్నింగ్స్‌లో టెంబా బావుమా అర్ధశతకం సాధించాడు. దక్షిణాఫ్రికా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌లో అతని 55 పరుగుల ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో జరిగే ఈమ్యాచ్‌లో ఇవే తప్పులు పునరా వృతం కాకుండా చూసుకుంటే భారత్ క్లీన్‌స్వీప్ నుండి తప్పించుకోగలుగుతుంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్.. రౌండ్ 16లో ప్రణయ్, శ్రీకాంత్

## తొలి రౌండ్ మ్యాచ్‌లో తరుణ్, ఆయుష్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 లో భారత్ షట్లర్లు దూసుకుపోతున్నారు. హెచ్ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ 16వ రౌండ్‌కు చేరుకోగా, యువ ఆటగాళ్లు ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి కూడా వారి వారి మొదటి రౌండ్ మ్యాచ్‌లలో విజయాలు నమోదు చేశారు. బుధవారం ముగ్గురు ఆటగాళ్ళు 16వ రౌండ్‌కు చేరుకున్నారు. అనుభవజ్ఞులైన షట్లర్లు ప్రణయ్, శ్రీకాంత్ తమ తొలి రౌండ్ మ్యాచ్‌లలో చిన్న ప్రత్యర్థులపై మూడు గేమ్‌ల పోరాట విజయాలను నమోదు చేశారు. ప్రణయ్ ఈ మ్యాచ్‌లో అద్భుత ఆరంభాన్ని సాధించాడు. ఇండోనేషియాకు చెందిన యోహానెస్ మార్సెలినో చేతిలో 6-21 తేడాతో నిరాశపరిచే స్కోరుతో మొదటి గేమ్‌ను కోల్పోయాడు. కానీ ఆ తర్వాత, అనుభవజ్ఞుడైన షట్లర్ శక్తివంతమైన పునరాగమనం చేసి, తదుపరి రెండు గేమ్‌లను 21-12, 21-17 తేడాతో గెలిచి, మ్యాచ్‌ను కైవసం చేసుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ప్రపంచ 20వ ర్యాంక్ క్రీడాకారుడిని చిత్తు చేసిన కిదాంబి దాదాపు నెల రోజుల తర్వాత బిడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌లోకి తిరిగి వచ్చి ప్రచారాన్ని అద్భుతంగా ప్రారంభించాడు, ప్రపంచ 20వ ర్యాంకర్, చైనీస్ తైపీకి చెందిన చియా హావో లీని మూడు గేమ్‌లలో 21-19, 10-21, 21-15 తేడాతో ఓడించాడు. అలాగే యువ ఆటగాళ్లు ఆయుష్, తరుణ్ కూడా రౌండ్ ఆఫ్ 16లో తమ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో విజయాన్ని నమోదు చేశారు. మరోవైపు కిరణ్ జార్జ్ ధైర్యంగా పోరాడి, గత వారం ఫైనలిస్ట్ జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటో చేతిలో 21-11, 22-24, 17-21 తేడాతో ఓడిపోయింది. అతడు మొదటి గేమ్‌ను సులభంగా గెలిచి, రెండవ గేమ్‌లో 17-14తో ఆధిక్యంలోకి వచ్చినా, తరువాత వరుసగా నాలుగు పాయింట్లు కోల్పోయి ఆటను వదులుకున్నాడు.

# పడిలేచిన పసిడిధరలు..

## వెండిధరలూ అదే దారి..



**ముంబయి, నవంబరు 19:** బంగారం ధరలు కొనుగోలుదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. ధరలు తగ్గినట్టే తగ్గి మరోసారి భారీగాపెరిగాయి. ముందురోజు మార్కెట్‌లో ధర భారీగా దిగివచ్చిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం మళ్లీ పెరిగింది. డిమాండ్ బలంగా ఉండడంతో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధర పెరిగినట్లుగా ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.1500 పెరిగి తులానికి రూ.1,27,300కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1500 పెరిగి తులానికి రూ.1,26,700కి చేరుకుంది. వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.4వేలు పెరిగి కిలోకు రూ.1.60లక్షలకు ఎగిసింది. దాంతో మూడురోజుల తర్వాత ధరలు బులియన్ మార్కెట్‌లో ధరల తగ్గుదలకు బ్రేక్ పడినట్లయ్యింది. యుఎస్ లేబర్ మార్కెట్‌లో బలహీనమైన సంకేతాలు వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచాయని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు సౌమిల్ గాంధీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ వరుసగా రెండో సెషన్‌లో పెరిగాయి. ఔన్స్‌కు 1.14 శాతం పెరిగి 4,114.01 డాలర్లకు చేరుకుంది. ఔన్సుకు వెండి ధర 3.09 శాతం 52.26 డాలర్లకు పెరిగింది. బుధవారం రాత్రి ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్‌ఓఎంసి) అక్టోబర్ సమావేశం వివరాలు వెల్లడికానుండగా పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని దాంతో స్పాట్ గోల్డ్ 4,084 డాలర్ల కంటే ఎక్కువగా ట్రేడ్ అవుతోందని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ హెడ్ ప్రవీణ్ సింగ్ తెలిపారు. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ రీసెర్చ్, ఏవీపీ విశ్లేషకుడు కైనాత్ చైన్వాలా మాట్లాడుతూ బంగారం కనిష్ట స్థాయి నుంచి కోలుకుని ఔన్సుకు 4,065 కంటే ఎక్కువగా ముగిసిందని తెలిపారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారెట్ల గోల్డ్ రూ.1,24,860 ఉండగా 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,450 పలుకుతున్నది. ఇక కిలో వెండి రూ.1.76లక్షల వద్ద ట్రేడవుతున్నది.

# లాభాల్లోకి మళ్లిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, నవంబరు 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు రాణించడంతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,643.78 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకున్నాయి. ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు బలమైన కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 84,525.98 కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్ గరిష్టంగా 85,236.77 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 142.60 పాయింట్లు పెరిగి 26,052.65 వద్ద స్థిరపడింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 0.3శాతం పెరగ్గా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పడిపోయింది. నిఫ్టీ బ్యాంక్ వరుసగా మూడవ సెషన్‌లో కొత్తగా 59,264.25 పాయింట్ల వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. 0.54శాతం లాభాలతో 59,216.05 వద్ద ముగిసింది. ఐటీ ఇండెక్స్ 3శాతం, పిఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.2శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ 0.3శాతం, రియాలిటీ ఇండెక్స్ 0.4శాతం తగ్గాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ ఉండగా.. టీఎంపీవీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. వెస్టర్న్ రైల్వేస్ నుంచి ఆర్డర్ సాధించినా జీఆర్ ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ షేర్లు 2శాతం పడిపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు బైబ్యాక్ ఆఫర్ కంటే ముందు 4శాతం పెరగ్గా.. హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2శాతం వృద్ధిని నమోదు చేశాయి. బయోకాన్ షేర్ ధర 3శాతం తగ్గగా సెబీ హెచ్చరిక లేఖతో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ షేర్ ధర 1.2శాతం పడిపోగా కెనడా విస్తరణ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు 4శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, ఎంసిఎక్స్ ఇండియా, హీరో మోటోకార్ప్, ఫెడరల్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ, బీహెచ్ఈఎల్ వంటి 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఇలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

# పాపులర్‌ప్లాన్ వ్యాలిడిటీ తగ్గించిన బిఎస్ఎన్ఎల్




**న్యూఢిల్లీ, నవంబరు 19:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తన ప్రీపెయిడ్ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఎలాంటి ప్రకటన లేకుండా నిశ్శబ్దంగా తన పాపులర్ ప్లాన్లలో ఒకటైన రూ.107 ప్యాక్ కాలపరిమితిని తగ్గించింది. ప్రైవేట్ టెలికాం సంస్థల బాటలోనే బిఎస్ఎన్ఎల్ కూడా పయనించడంపై కస్టమర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రూ.107 ప్లాన్‌పై గతంలో లభించిన 28 రోజుల వ్యాలిడిటీని ఇప్పుడు 22 రోజులకు కుదించారు. వాస్తవానికి, కొన్నేళ్ల క్రితం వరకు ఇదే ప్లాన్‌కు 35 రోజుల వ్యాలిడిటీ ఉండేది. దశలవారీగా వ్యాలిడిటీని తగ్గిస్తూ రావడంతో, ధర పెంచకపోయినా వినియోగదారులపై పరోక్షంగా భారం మోపినట్లయ్యింది. ప్లాన్ ధరను మార్చకుండా వ్యాలిడిటీని తగ్గించడం కూడా ఒకరకమైన టారిఫ్ పెంపు అవుతుందని టెక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మార్పు దాదాపు 20 శాతానికి పైగా టారిఫ్ పెంపుతో సమానమని వారు అభిప్రాయపడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలోనూ వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. తక్షణమే పాత వ్యాలిడిటీని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం



**ముంబయి, నవంబరు 19:** ప్రముఖ జంతు ఔషధాల తయారీ సంస్థ సీక్వెంట్ సైంటిఫిక్‌లో, బల్క్ డ్రగ్స్, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్స్ (ఎపిఐ) ఉత్పత్తిలో ప్రత్యేకత కలిగిన వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనం అవుతున్నాయి. ఈ విలీన ప్రతిపాదనకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ తన తుది ఆమోదముద్ర వేసింది. ఈ ఆమోదంతో ఏడాది కాలంగా కొనసాగుతున్న విలీన ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే. ఇకపై రెండు కంపెనీల కార్యకలాపాలను పూర్తిగా ఏకీకృతం చేయడంపై యాజమాన్యం దృష్టి సారించనుంది. సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనాన్ని గతేడాది సెప్టెంబరులో ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు సంస్థల యాజమాన్యాలు వ్యాపార కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు కృషి చేస్తున్నాయి. ఈ విలీనం వెనుక స్పష్టమైన వ్యూహాత్మక ప్రణాళిక ఉంది. జంతు ఔషధాల ఫార్ములేషన్లలో సీక్వెంట్ సైంటిఫిక్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది.

మరోవైపు, ఆ ఫార్ములేషన్లకు అవసరమైన కీలక ముడిపదార్థాలైన ఏపీఐలు, బల్క్ డ్రగ్స్‌ను తయారు చేయడంలో వియాష్ లైఫ్‌సైన్సెస్‌కు అపారమైన అనుభవం, ఉత్పత్తి సామర్థం ఉన్నాయి. ఈ రెండు సంస్థలు కలవడం ద్వారా ముడిపదార్థాల నుంచి తుది ఉత్పత్తి వరకు పూర్తి సరఫరా గొలుసు (సప్లై చైన్)పై పట్టు సాధించవచ్చు. ఇది ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, నాణ్యతపై మరింత నియంత్రణకు అవకాశం కల్పిస్తుంది. పరిశోధనఅభివృద్ధి, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి కీలక విభాగాల్లో ఇప్పటికే కొంతమేర ప్రక్రియను సాధించినట్లు సీక్వెంట్ సైంటిఫిక్ యాజమాన్యం ఇటీవల వెల్లడించింది. ఆదాయాలు, లాభాల పరంగా చూస్తే ఈ విలీనం సంస్థను ఆర్థికంగా మరింత బలోపేతం చేయనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జూలైసెప్టెంబర్) ఆర్థిక ఫలితాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ త్రైమాసికంలో రూ.424 కోట్ల ఏకీకృత టర్నోవర్‌ను నమోదు చేసింది.

పన్నుల తర్వాత నికర లాభం రూ.19.6 కోట్లుగా ఉంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే వియాష్ లైఫ్‌సైన్సెస్ సంస్థ రూ.428 కోట్ల టర్నోవర్‌తో పాటు, రూ.53.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. రెండు సంస్థల ఆర్థిక ఫలితాలను కలిపి చూస్తే, విలీన సంస్థ రెండో త్రైమాసికంలో మొత్తం రూ.852 కోట్ల టర్నోవర్‌ను, రూ.189 కోట్ల ఎబిటా (వడ్డీ, పన్నులు, తరుగుదలకు ముందు ఆదాయం)ను నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 22.2శాతంగా ఉండటం సంస్థ కార్యకలాపాల సామర్థ్యానికి, అధిక లాభదాయకతకు సూచికగా నిలుస్తుంది.

# కృత్రిమ మేధలో గూగుల్ జెమిని3 రిలీజ్!




**కాలిఫోర్నియా, నవంబరు 19:** ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో టెక్ దిగ్గజం గూగుల్ జనరేటివ్ ఎఐ మోడల్, జెమిని3ని మోడల్‌ని లాంచ్ చేసింది. జెమిని 2.5 స్థానంలో భర్తీ చేయనున్నది. ఇదే ఇప్పటి వరకు తమ మోస్ట్ ఇంటలిజెంట్ మోడల్ అని కంపెనీ చెబుతోంది. కంపెనీ ప్రతినిధులు జెమిని 3 అనేక కీలక పరిశ్రమ బెంచ్‌మార్క్‌లను అగ్రస్థానంలో నిలిపిందని, దాని సామర్థ్యాలను నిరూపించాయని చెప్పారు. గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ కంపెనీ మోస్ట్‌టాలెంట్ మోడల్‌గా అభివర్ణించారు. కొత్త ఎఐ మోడల్‌ను సైబర్ దాడుల నుంచి కాపాడేలా రూపొందించినట్లు చెప్పింది. గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో వస్తున్న ఎఐ మోడ్‌తో కొత్త ఎఐ మోడల్‌ను ఇంటిగ్రేట్ చేసినట్లు చెప్పింది. గూగుల్ చీఫ్ ఎఐ ఆర్కిటెక్ట్ వ్లోగ్ మాట్లాడుతూ కంపెనీ ఇప్పుడు గతంలో కంటే వేగంగా మోడల్స్‌ను విడుదల చేస్తుందన్నారు. ఈ సారి గూగుల్ జెమిని3ని తన సెర్చ్ ఇంజిన్‌లో తొలిసారిగా విడుదలతో పాటు ఏకకాలంలో అనుసంధానించినట్లుగా పేర్కొంది. గతంలో అప్‌డేట్ చేసేందుకు వారాలు, నెలలు పట్టేది. ఏఐ మోడ్‌ని ఉపయోగించి గూగుల్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ వినియోగదారులు జెమిని 3ని వినియోగించుకోవచ్చు. ఈ మోడల్ సంప్రదాయ వెబ్ లింక్స్‌కు బదులుగా సంక్లిష్టమైన ప్రశ్నలకు ఎఐ జెనరేటెడ్ సమాధానాలు ఇస్తుంది. ఇక గూగుల్ కొత్త ఫీచర్స్‌ను తీసుకు వచ్చింది. గూగుల్ జెమిని ఏజెంట్ అనే కొత్త ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఈమెల్ ఇన్‌బాక్స్‌నుంచి టూర్ ప్లాన్ వరకు మల్టిపుల్ టాస్క్‌ల వరకు ఆటోమేటిక్‌గా పనులు పూర్తి చేస్తుంది. అలాగే, గూగుల్ కొత్తగా జెమిని యాప్‌ను పునరుద్ధరించింది. ఇందులో ఎఐ ఇప్పుడు టెక్స్ట్ సమాధానాలు ఇవ్వడంతో పాటు వెబ్‌సైట్‌లాంటి ఇంటర్‌ఫేస్‌లో డిస్‌ప్లే విజువల్, ఇంటరాక్టివ్ ఎలిమింట్స్‌ను ప్రదర్శిస్తుంది. బిజినెస్ యూజర్ల కోసం 'యాంటీగ్రావిటీ' ప్లాట్‌ఫామ్‌ని అభివృద్ధి చేసింది. ఈ ప్లాట్‌ఫామ్ ఎఐ ఏజెంట్లకు వారి సొంత కోడ్‌ను ప్లాన్ చేసుకునే, రాసి ఇచ్చేసామర్థ్యాన్ని ఇస్తుంది. జెమిని 3 డెవలపర్ల కోసం అనేక కొత్త కోడింగ్ ఫీచర్స్‌ను సైతం జోడిస్తుంది.

# చిల్లరకోసం బ్యాంకుముందు క్యూలు కట్టిన ట్రేడర్లు!

**మెహసానా, గుజరాత్, నవంబరు 19:** బ్యాంకుముందు జనం బారులు తీరారు. 2016లో నోట్లరద్దు సందర్భంగా పాత నోట్లను మార్చుకోవడానికి దేశవ్యాప్తంగా బ్యాంకుల ముందు కస్టమర్లు బారులు తీరిన దృశ్యాలను తలపించేలా ఆ బ్యాంకు ముందు జనాలు క్యూకట్టారు. అది గుజరాత్ లోని మెహసానాలో గల అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్. ఇంతకూ ఆ బ్యాంకు దగ్గర జనం చిల్లర కోసమే. ఆర్‌బిఐ ఆదేశాల మేరకు గుజరాత్ రాష్ట్రం మెహసానాలోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. స్థానికంగా నెలకొన్న చిల్లర కొరతను తీర్చాలన్నది ఆశిబిరం ఉద్దేశం. ఆ శిబిరంలో బ్యాంకు సిబ్బంది కొత్తగా ముద్రించిన రూ.10 నోట్లు, నాణేలను మార్పిడి చేసింది. పెద్ద కరెన్సీ ఇచ్చి రూ.10, రూ.20 నోట్లు కాయిన్‌లతోపాటు, రూ.5, రూ.2, రూ.1 కాయిన్‌లు తీసుకోవడం కోసం జనం భారీగా తరలివచ్చారు. ఈ ఒక్కరోజు శిబిరంలో బ్యాంకు సిబ్బంది రూ.14 లక్షల విలువైన రూ.10, 20 నోట్లు.. రూ.3 లక్షల విలువైన రూ.1, 2, 5 నాణేలను బ్యాంక్ అధికారులు మార్పిడి చేశారు. ఉదయం పది గంటల మొదలైన ఈ డ్రైవ్ సాయంత్రం వరకు కొనసాగింది. రోజూవారీ ఖర్చులకు, వ్యాపార ఖర్చులకు చిల్లర లేదని చిరు వ్యాపారులు, స్థానికులు తమ వద్ద ఉన్న పెద్ద నోట్లు ఇచ్చి చిల్లర తీసుకున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.